ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 109 పేజీలు: 12 వెల: 6.50


గాజాలో మారణహోమం: 60 మంది పైగా మృతి

వక్ఫ్‌సవరణ చట్టంపై 3 అంశాలపైనే విచారణ!

5లో

# త్వరలో తెలుగు వర్సిటీ



మంగళవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం దృశ్యం

### హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీని ఎపికి తరలించే ప్రతిపాదనకు కెబినెట్ ఆమోదం

### స్టడీ సెంటర్ల ఏర్పాటుకు ఓపెన్ వర్సిటీకి అనుమతి

### న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

### రూ. 30వేల కోట్ల పెట్టుబడులు, 35 వేల ఉద్యోగాల కల్పనకు కెబినెట్ ఆమోదం

### రైతుకు గిట్టుబాటు ధరపై కేబినెట్ సబ్‌కమిటీ నిరంతర పర్యవేక్షణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి పర్చేదిశలో తీసుకునేనిర్ణయాన్ని అమలుచేసే దిశలో కార్యాచరణ ఉండాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు అంశాలపై చర్చించారు. సచివాలయంలో మొదటి బ్లాక్‌లో మంగళవారం జరిగినసమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చ జరిగింది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఎపిఐఐసికి ఉచితంగా 615 ఎకరాల భూ కేటాయింపునకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక పార్కు ఏర్పాటుకోసం ఎపిఐఐసికి భూ కేటాయింపు చేసేప్రతిపాదనకు మంత్రివర్గం అమోదం తెలిపింది. సత్యసాయి జిల్లా తాడిమర్రిలో అదానీ పవర్‌కు 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు, కడప జిల్లాలోని కొండాపురంలో 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు భూ కేటాయింపునకు నిర్ణయం తీసుకున్నారు. ఎకరా 5 లక్షల రూపాయల చొప్పున భూ కేటాయింపునకు నిర్ణయించారు. 2260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామక నిర్ణయానికి ర్యాటిఫై చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఎపికి తరలించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎపిలోని విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు స్టడీ సెంటర్ల ఏర్పాటుకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకీ అనుమతి ఇచ్చారు. అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా లీగల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యం ఇతర సరుకులు ఇచ్చే ప్రతిపాదనకు కేబినెట్‌లో చర్చించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద సిటీసైడ్ డెవలప్మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయించేలా జీఓఎం చేసిన సిఫార్సుకు కేబినెట్ అమోదం తెలిపింది. ఎపి లెదర్ >>2



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు పార్థసారథి, నాదెండ్ల మనోహర్

## విద్యాభివృద్ధికి పెద్దపీట

### రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీ, ఏలూరు వద్ద ఓపెన్ వర్సిటీ

### ప్రజా పంపిణీ వ్యవస్థలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు మూసివేత

### కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు నాదెండ్ల, పార్థసారథి

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటవుతుందని రాష్ట్ర సమాచారశాఖా మంత్రి కొలుసుపార్థసారథి, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌లు తెలిపారు, ఎపి ప్రచార,ప్రసార మాధ్యమాల సమాచార సమావేశ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ చట్టం, 1985 లోని సెక్షన్ 3(2) ప్రకారం ఆంధ్రప్రదేశ్లోని రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికై నోటిఫికేషన్ జారీచేసేందుకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పిందని వివరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ చట్టం, 1985 (1985 చట్టంనం.27) లోని సెక్షన్ 3(2) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయబడింది, తద్వారా ఈ విషయంలో గతంలో జారీ చేసిన ఆదేశాలను భర్తీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాని కార్యకలాపాలను ప్రారంభించడానికి వీలు కల్పిస్తుంది.
ప్రధానంగా తెలుగు భాష మరియు సాహిత్యం మరియు ఇతర లక్ష్యాలను అభ్యసించడానికి విద్యార్థుల అవసరాలను తీర్చడానికి ఎపిలో ఉన్న 3 కేంద్రాలను నిర్వహించడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనే పేరు, ఉప శీర్షికతో ఒక తెలుగు విశ్వవిద్యాలయం ఉండాలని రాష్ట్రం కోరుతోందన్నారు. తెలుగు భాషా సాహిత్యం మరియు సంస్కృతిలో ఉన్నత స్థాయి పరిశోధనా కేంద్రంగా పని చేస్తుంది. ఏలూరు సమీపంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర >>2

## ఎపిఐసెట్‌లో 95.86% ఉత్తీర్ణత

### క్వాలిఫైయర్స్‌లో బాలికలదే హవా

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపిఐసెట్2025 ఫలితాలు విడుదలయ్యాయి. ఐసెట్ పరీక్ష 34,131 మంది విద్యార్థులు రాయగా 32,719 మంది క్వాలిఫై అయ్యారు. ఈ పరీక్షలో 95.86శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఐసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థుల ఉజ్వల విద్య భవిష్యత్తుకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐసెట్‌కు మొత్తంగా 37,572మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 94 పరీక్ష కేంద్రాల్లో మే 7న ఐసెట్ నిర్వహించగా.. 34,131మంది పరీక్షకు హాజరయ్యారు. ఐసెట్‌లో 32,719మంది క్వాలిఫైఅయ్యారు. వీరిలో 15,176మంది అబ్బాయిలు, 17,543మంది అమ్మాయిలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్.వాట్సప్ గవర్నెన్స్ నం. 9552300009లో అందుబాటులో ఉన్నాయి. మనోజ్ మేకా (విశాఖ) అత్యధిక మార్కులతో ఒకటో ర్యాంకు సాధించగా.. ఆ తర్వాత ర్యాంకుల్లో ద్వారకచర్ల సందీప్ రెడ్డి (వైఎస్ఆర్ కడప), ఎస్. కృష్ణసాయి (ఎన్‌టీఆర్ జిల్లా), వల్లూరి సాయిరాం సాత్విక్ (హైదరాబాద్), రేవూరి మాధుర్య (గుంటూరు), షేక్ బషీరున్నీషా (అనకాపల్లి), వి. అజయ్ కుమార్ (తిరుపతి), భీశెట్టి హరి వెంకటప్రసాద్ (తూర్పు గోదావరి), ఎస్. గణేశ్‌రెడ్డి (విశాఖ), మహేంద్ర సాయి చామా (తిరుపతి) సాధించారు.



మంగళవారం హోస్పేటలో హక్కుదారులకు భూమి పట్టాలు వితరణ చేస్తున్న రాహుల్‌గాంధీ, కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, డిసిఎం డి.కె.శివకుమార్‌లు

## 6వ గ్యారెంటీగా భూపట్టాల పంపిణీ

### హోస్పేట సమర్పణ సంకల్ప సమావేశంలో రాహుల్‌గాంధీ

**బళ్లారి, మే20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినసందర్భంగా విజయనగర జిల్లా హోస్పేటలో సమర్పణ సంకల్ప సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐసిసి అధినేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిసిఎం డి.కె.శివకుమార్‌లుహాజరయ్యారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, దావణగెరె జిల్లాల నుంచి లక్షలాది సంఖ్యలో ప్రజలు హాజరుకావడం విశేషం. ఈ సమావేశంలో మాట్లాడిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాష్ట్రంలో పంచగ్యారంటీ యోజనలను సమర్థవంతంగా ఆచరణలోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 6వ గ్యారంటీ యోజనగా భూ హక్కును కల్పించే భూమిగ్యారంటీని జారీలోకి తెచ్చిందన్నారు. సుమారు లక్షమందికి భూహక్కుదారులకు ఈ సమావేశంలో వారి పేరిట పట్టాలుగా చేసి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే >>2

# అన్యమత ఉద్యోగులకు విఆర్ఎస్

### రూ.5లక్షలు అదనంగా చెల్లించేందుకు ఆమోదం

### ఆ 29మందిని సాగనంపేందుకు టిటిడి నిర్ణయం

### రూ. 10కోట్లతో అనంతవరం వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి



మంగళవారం అన్నమయ్యభవనంలో ధర్మకర్తలమండలి సమావేశం దృశ్యం

**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో తిరుమల,తిరుపతిలోని పలు కీలకవిభాగాల్లో పనిచేస్తున్న హిందూయేతర (అన్యమతస్తుల)ఉద్యోగులను స్వచ్ఛంద పదవీవిరమణ చేయించాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ప్రాథమికంగా గుర్తించిన ఉద్యోగులు గాక ప్రధానంగా పద్ధతి మార్చుకోని అన్యమతం ఆచరిస్తున్న 29మంది ఉద్యోగులను స్వచ్ఛంద పదవీవిరమణ చేయాలని, దీనికి అంగీకరించే వారికి అదనంగా 5లక్షలరూపాయలు చెల్లించడానికి నిర్ణయించారు. ఇందుకు అంగీకరించని వారిని అలా విఆర్ఎస్ ఇవ్వకుంటే రానున్న బోర్డు సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేందుకు అడుగేయనున్నారు.అంతేగాక ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునుండి అందే ఆదేశాల మేరకు తగిన నిర్ణయం ఉంటుందనేది టిటిడి అధికారుల వెల్లడించారు. మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, దేవాదాయశాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.తిరుమల,తిరుపతిలోనేగాక ఇతర ప్రాంతాల్లోని టిటిడికి చెందిన పలు విభాగాల్లో సుమారు 300మందివరకు అన్యమతస్తులు సేవలందిస్తున్నారనేది సమాచారం. గతంలో విజిలెన్స్ విభాగం అందించిన నివేదికలు. అయితే ఇందులో ప్రధానంగా 29మందిని గుర్తించిన టిటిడి అధికారులు ఆ దిశగా వారిని సాగనంపేందుకు తుదినిర్ణయం తీసుకున్నారు.ఆయా ఉద్యోగులను ఏకంగా ఇళ్లకే పంపించాలని బోర్డు సంచలన నిర్ణయం తీసుకుని ఆమోదించింది. ఇక భక్తుల సేవలో తిరుమలలో వ్యాపారాలు చేసుకుంటున్న హోటళ్లు,ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు ఆహారపదార్థాలు నాణ్యత లేకుండా తయారుచేస్తూ వడ్డిస్తున్నారనే భక్తులఫిర్యాదులపైకూడా టిటిడి బోర్డు స్పందించింది. లక్షమంది వరకు రోజువారీగా తిరుమలకు వస్తున్న భక్తులు చాలావరకు కొండపై హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో తయారుచేసి వడ్డించే ఆహారపదార్థాలు స్వీకరిస్తున్నారు. ఏదో ఒకరోజు ఇలా వచ్చాంకదా అని యాత్రికులు కూడా ధరలతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చిన, నచ్చిన ఆహారపదార్థాలు భోంచేస్తున్నారు. యాత్రికులు ఒకపూట భోంచేసి వెళ్లిన వాళ్లు మళ్లీ ఏడాదికో, రెండేళ్లకో తిరుమలకు వస్తారు. ఇక్కడ యాత్రికులకు రుచికరంగా, నాణ్యతతో ఆహారపదార్థాలు, తినుబండారాలు తయారుచేయాలనేది టిటిడిఅదనపు ఇఒ వెంకయ్య చౌదరి తీసుకున్న కీలక నిర్ణయం. ఆ దిశగా ఉత్తరభారతదేశ ఆహారపదార్థాలైన చైనీస్‌వంటకాలను కూడా నిషేధించారు. కొండపై హోటళ్లలో నూడిల్స్, గోబీ, చైనీస్ వంటకాలు లేకుండా ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తిరుమలలో హోటళ్లు నాణ్యతగా ఉన్న ఆహారపదార్థాలు వడ్డించేలా, రుచిగా శుచిగా ఉండేలా చూడాలని సూచించారు. హోటళ్ళలో వండిన అల్పాహారం ఇడ్లీ,దోస,పూరీలు, పులిహోర, లెమన్‌రైస్, వడలు, సాంబారు తదితర >>2

## రోహింగ్యాల వలసలతో నిరుద్యోగం

### అంతర్గత భద్రతకు ప్రమాదం: డి.సిఎం పవన్



**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:**సరిహద్దుల్లో సైనికులు ఎంత భద్రంగా దేశాన్ని రక్షిస్తున్నారో, దేశం లోపల అంతర్గత భద్రతలో పోలీసుశాఖ కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండటం కీలకమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. దీనిపైనే రాష్ట్ర పోలీసులను, పరిపాలన సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తూ లేఖ రాశానన్నారు.దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదుల సున్నితమైన లక్ష్యం అని గతంలో జరిగిన కిరాతక దాడుల్లో తేలింది. కోయంబత్తూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులు తల్చుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని చెప్పారు. సరిహద్దుల్లో భద్రతా సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉంటారో, రాష్ట్ర పోలీసులుకూడా అంతర్గత భద్రతపై అంతే సీరియస్‌గా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. మంగళవారం ఉపముఖ్యమంత్రి పవన్ విజయవాడ విమానాశ్రయంలో జాతీయమీడియాతో మాట్లాడారు.



## త్వరలో విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ రైలు

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాణికులకు ఇండియన్ రైల్వే.. గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలో విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే ప్రతిపాదనలను సిద్ధం చేసింది. షెడ్యూల్‌తోపాటు ప్రయాణ సమయం తొమ్మిది గంటలుగా రైల్వే శాఖ నిర్ణయించింది. దీంతో ప్రయాణికులకు దాదాపు మూడు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది.. ఈ వందే భారత్ రైలు బెంగళూరు వెళ్లేవారితో పాటు తిరుపతి వెళ్లే ప్రజలకూ ఉపయోగపడనుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ఉండనున్నాయి. విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20711) మంగళవారం మినహా వారానికి ఆరు రోజులు రాకపోకలు సాగించనుంది. ఈ రైలు విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి తెనాలి 5.39, ఒంగోలు 6.28, నెల్లూరు >>2

# రాష్ట్రంలో విలువల్లేని పాలన

### యథేచ్ఛగా సాగుతున్న కేసులు, అరెస్టుల పర్వం

### ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాజీ సిఎం జగన్



**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిది:** రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మనం రాక్షస యుగంలో ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు.చంద్రబాబు పాలనలో రాజకీయాల నైతికంగా పతనం అయ్యాయని స్పష్టం చేశారు. చంద్రబాబు పరిపాలనలో యథేచ్ఛగా కేసులు, అరెస్టుల పర్వం కొనసాగుతోందన్నారు. వాటికి భయపడాల్సిన అవసరం లేదని.. అలాంటి వారే ఇప్పుడు రాజకీయాలు చేయగలరని, రాజకీయాల్లో మనుగడ కొనసాగించగలరని ఆయన తెలిపారు. కోనసీమ జిల్లా రామచంద్రాపురం మున్సిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి)కి చెందిన వైఎస్సార్సీ ప్రజాప్రతినిధులతో వైయస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీ అందరితో ఈరోజు సమావేశంకావడం ఎంతో సంతోషకరం. ఎలాంటి పరిస్థితుల మధ్య మనం ప్రయాణం చేస్తున్నామో నాకంటే మీకే బాగా తెలుసు. మనం రాక్షసయుగంలోఉన్నాం. కలియుగంలో అంటే చంద్రబాబు యుగంలో రాజకీయాలు చేయాలంటే.. కేసులు వేసినా భయపడొద్దు. జైళ్లకు పంపినా, చంద్రబాబు నిన్ను ఎదుర్కొంటాం అని గట్టిగా అంటేనే, అలా ఉండగలిగినప్పుడే రాజకీయాల్లో ఉండగలం. రాజకీయాలు చేయగలం. అదే ఈ కలియుగంలో మనం నేర్చుకుంటున్న పాఠం. ఆ విధంగా ఈరోజు రాజకీయాలు తయారయ్యాయి. నాడు ఏనాడూ గతి తప్పలేదన్నారు.చంద్రబాబు ఈరోజు చేస్తున్న రాజకీయంలో కనీసం ఒక శాతం కూడా మనం చేయలేదు. ఏ ఒక్కరినీ ఇబ్బందిపెట్టే ప్రయత్నంచేయలేదు. నాడు స్థానిక ఎన్నికల్లో >>2



మంగళవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులతో మంత్రి లోకేష్

## స్కూలు పరీక్షలా! అసెంబ్లీలో ప్రశ్నలా?

### ఏది కష్టం?: ప్రశ్నించిన విద్యార్థులు

### ఆసక్తికరమైన జవాబిచ్చిన మంత్రి లోకేష్

### చంద్రబాబు స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి

### ఉన్నత స్థానం చేరాలంటే కష్టపడి పనిచేయాలి

**విజయవాడ,మే20, ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులేప్పుడు చురుకుగా,చలాకీగా ఆలోచించాలని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో పదోతరగతి ఉత్తమ విద్యార్థులకు సత్కార కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సరదా ప్రశ్నలకు మంత్రి లోకేష్ ఉత్సాహంగా సమాధానాలిచ్చారు. మీకు స్కూలులోపరీక్షలు కష్టంగా ఉండేవా, అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలు కష్టమా అని చీరాలకు చెందిన సంతోష్ ప్రశ్నించగా, >>2

## తిరువూరు మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ,మే20,ప్రభాతవార్త ప్రతినిధి:** తిరువూరు మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అరగంటలో భద్రత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. డిసిపి స్థాయి అధికారితో కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని సూచించింది. తిరువూరు మున్సిపల్ ఎన్నికపై వైసిపి హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. వైసిపి కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని పేర్కొంది. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు అరగంటలో డిసిపి స్థాయి అధికారితో వైసిపి కౌన్సిలర్లకు భద్రత కల్పించడమే కాదు, తక్షణమే ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది.



సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## నేటినుండి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వద్ద పిసిసి ఛీఫ్ షర్మిల ఆమరణ దీక్ష

**విజయవాడ, మే 20, ప్రభాతవార్త :** విశాఖ ఉక్కుఫ్యాక్టరీ వద్ద ఎపిసిసి ప్రెసిడెంట్ షర్మిలమ్మ నేడు చేపడుతున్న ఆమరణ దీక్షకు మద్దతు పలకాలని ఎపిసిసి ప్రత్రికాముఖంగా పౌరసమాజం, వివిధ రంగాల ప్రజలను కోరింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో ఇప్పటికే తొలగించిన 2వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పర్మినెంట్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 8నెలల జీతాలు చెల్లించాలని తాము పలుమార్లు రాష్ట్ర ముఖ్య మంత్రికి తీసుకొచ్చినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో తాము ఈ దీక్ష చేపడుతున్నట్లు ఎపిసిసి ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజి తెలిపారు.



మంగళవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సిసిఐ వార్షికోత్సవాలలో పాల్గొన్న కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

# త్వరలో తెలుగు వర్సిటీ

>> ఫుట్ వేర్ పాలసీ 4.0కి కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదించిన 11 సంస్థలకు సంబంధించిన పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం లభించింది. 30 వేల కోట్ల వరకూ పెట్టుబడులు, 35 వేల ఉద్యోగాల కల్పనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేబినెట్‌లో రైతుల సమస్యలపై సుదీర్ఘ చర్చజరిగింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది వివిధ పంటల దిగుబడులు పెరిగాయని అధికారులు వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, దేశవిదేశాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా వివిధ పంటల ధరలపై ప్రభావం పడిందని మంత్రివర్గం అభిప్రాయపడింది. మిర్చి, పొగాకు, ఆక్వా, కోకో, చెరుకు, మామిడి వంటి పంట ఉత్పత్తుల ధరలు తగ్గడానికి గల కారణాలు అధికారిక నివేదికలను అనుసరించి వ్యవసాయమంత్రి అచ్చెన్ననాయుడు వెల్లడించారు. ఇందులో ప్రధానంగా పొగాకు ధర పతనం కావడంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర వచ్చేలా చూసి, రైతుల్లో అధికారులు నమ్మకం నింపాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా చూడాలని స్పష్టం చేశారు. పొగాకును నాణ్యత ఆధారంగా క్వింటాల్‌కు రూ.12,500కు కంపెనీలు కొనుగోలు చేయాలి. రైతుల ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ ఎక్కడా పొగాకు నిల్వలు కొనుగోళ్లు జరగకుండా మిగిలిపోకూడదని.. తక్షణం కంపెనీలు కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేసి అవసరమైతే గోడౌన్లలో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. కొనుగోళ్లు ఏస్థాయిలో జరుపుతున్నారు, ఎంతమేర ధర చెల్లిస్తున్నారు... అనే నివేదిక సోమవారం కల్లా ఇవ్వాలని ఆదేశించారు. అత్యధిక ధరలు ఆశ చూపించి రైతులు పొగాకు సాగు చేసేలా చేస్తున్న కంపెనీలు, తీరా పంట చేతికి వచ్చేసరికి అమాంతం ధరలు తగ్గించడం సరికాదన్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యను అధిగమించాలంటే బైబ్యాక్ పాలసీ ఉత్తమమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే క్రాప్ రీషెడ్యూల్ చేయాలని, దీనికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. కోకో పంట గిట్టుబాటు ధరపైనా మంత్రిమండలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. కోకో గింజలను కిలోకు రూ.500 ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలని మాండలీజ్ సంస్థకు సూచించారు. రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ నిర్ణయించింది. రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీ నిరంతర పర్యవేక్షణ చేయనుంది. కేబినెట్ సమావేశంలో 45 నిమిషాలు వ్యవసాయరంగం, అన్నదాతల కష్టాలు, మార్కెటింగ్‌పై చర్చ జరిగింది. రైతులకు స్వాంతన చేకూరేలా, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇటీవల 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**లిక్కరు స్కామ్ ఎవ్వరు మాట్లాడ వద్దు**

మద్యం కుంభకోణం దర్యాప్తులో ఎవరు మాట్లాడవద్దని.. అనవసరంగా మాట్లాడితే మరో రకంగా వెళ్తుందని మంత్రులకు సీఎం తెలిపారు. సిట్ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తోందని... వాళ్ళ పని వాళ్లని చూసుకోనివ్వాలన్నారు. మద్యం కుంభకోణంపై పత్రికల్లో వచ్చిన వార్తలు చూసి ఎవరు మాట్లాడవద్దని సిఎం స్పష్టం చేశారు.

వచ్చే కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి అవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, ప్రజలు మనోభావాలపై చర్చిద్దామని సీఎం అన్నారు. పంటలకు ఈ సారి ధరలు తగ్గాయని.. మానిటర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైజాగ్ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడటంపై మంత్రి స్వామిని సీఎం ప్రశ్నించారు. అలా జరగకుండా చూడాలని సీఎం కోరారు. రేషన్ సరఫరాకు ఎండీయూ వాహనాలను కేబినెట్ రద్దు చేసింది. వీటిపై తీసుకున్న రుణాలను ప్రభుత్వం చెల్లించి వాహనాల యజమానులకు ఇచ్చేయాలని నిర్ణయించింది. బియ్యం ఇచ్చే రోజు మినహా మిగతా రోజుల్లో వాళ్ళే వాడుకుంటున్నారని... ఇకపై రేషన్ బియ్యం రేషన్ దుకాణాల్లోనే ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. వికలాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంటికి వెళ్ళి బియ్యం ఇవ్వాలని సిఎం ఆదేశించారు. రేషన్ స్థానంలో నగదు ఇస్తే ఎలా ఉంటుంది అనే అంశంపై కూడా కేబినెట్‌లో చర్చకు వచ్చింది. విశాఖ డిప్యూటీ మేయర్‌తో పాటు పలు చోట్ల చైర్మన్,ఉప చైర్మన్ ఎన్నిక వాయిదా సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంత్రి వర్గ సమావేశం అనంతరం తాజా రాజకీయ అంశాలపై మంత్రులతో చంద్రబాబు చర్చించారు. బియ్యం ఇచ్చే రోజు తప్ప రేషన్ వాహనాల వల్ల ఉపయోగం లేదని మంత్రులు అభిప్రాయపడ్డారు. వికలాంగులు, వృధ్ధులకు ఇళ్ళ వద్దనే రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మిగిలిన వారికి రేషన్ దుకాణాల ద్వారానే ఇకపై బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.వాహనాల ద్వారా రేషన్ సరఫరా వల్ల స్మగ్లింగ్‌కు అవకాశం ఇస్తూ పథకం దుర్వినియోగం జరుగుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దుకాణంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు రేషన్ తీసుకునే అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు.

# వందేభారత్ రైలు

>> 7.43, తిరుపతి 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరు 14.15 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు (20712) బెంగళూరులో మధ్యాహ్నం 14.45 గంటలకు ప్రారంభమై కృష్ణరాజపురం 14.58, కాట్పాడి 17.23, చిత్తూరు 17.49, తిరుపతి 18.55, నెల్లూరు 20.18, ఒంగోలు 21.29, తెనాలి 22.42, విజయవాడ రాత్రి 23.45 గంటలకు చేరుకోనుంది.

# విలువల్లేని పాలన

>> అన్నీ మనం గెల్చాం. కేవలం రెండు మున్సిపాలిటీల్లో మనం ఓడిపోయాం.తాడిపత్రి మున్సిపాలిటీలో మనకు 16 మంది కౌన్సిలర్లు ఉంటే, టిడిపికి 18 మంది ఉన్నారు. ఇద్దరిని లాగుదామని, మన ఎమ్మెల్యే అంటే, నేను వద్దన్నాను. ఎమ్మెల్యేను హౌజ్ అరెస్టు చేయించి, ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాను. అదీ మనం చేసిన విలువలతో కూడిన రాజకీయం. జగనన్నకు చెబుతాం అని కార్యక్రమం పేరుతో ఒక నెంబర్ ఇచ్చాను. దానికి ఎవరు ఫోన్ చేసినా, వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాం. అలాగే స్పందన అనే కార్యక్రమం వారం వారం నిర్వహించాం. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాం. కలెక్టర్లు, మండల స్థాయిలో కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా, నేరుగా సిఎంఒ ఫాలోఅప్ చేసేది. అప్పుడు ఎక్కువ సమస్యలు టిడిపి వారివే పరిష్కారమయ్యాయి. పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందన్నారు. ఆరోజు కులం, మతం, రాజకీయం చూడకుండా మనం పాలించాం. అదే ఈరోజు పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఈరోజు తిరువూరు చూసినా, ఎక్కడైనా అదే రాజకీయం. తిరువూరులో 20 మంది కౌన్సిలర్లలో 17 మంది వైయస్సార్సీకి చెందిన వారు. టిడిపి నుంచి ముగ్గురే ఉన్నా, బలవంతంగా లాగే ప్రయత్నం చేస్తున్నారు. 5గురిని లాగారు. అయినా ఆ ఎన్నికలో మనమే గెలవాలి. ఎందుకంటే మన బలం 12. టిడిపికి కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. టిడిపికి బలం లేకపోయినా, పదవి కోసం దారుణంగా వ్యవహరిస్తున్నారు. అదికూడా జరగకుండా పోలీసుల సహాయంతో ఎన్నిక జరగకుండా చూస్తున్నారు. మన నాయకులను హౌజ్ అరెస్టు చేశారు. టిడిపి వారందరినీ రోడ్ల మీదకు వదిలారు. ఈరోజు కోర్టులో హౌజ్ మోషన్ మూవ్ చేశాం. పోలీసు బందోబస్తు కోరాం. ఎన్నికల జరగకుండా చూస్తున్నారు. నరసారావుపేటలో మొత్తం 17 గెల్చాం. కానీ వారిలో కొందరిని లాక్కున్నారు. దీంతో మనకు 13 మంది సభ్యులుఉండగా, టిడిపికి కేవలం ముగ్గురే ఉన్నారు. ఒకరు చనిపోయరు. కోరం లేకపోయినా గెల్చామని ప్రకటించుకున్నారు. కారంపూడిలో మొత్తం 14 వైయస్సార్సీ గెలిస్తే, ఆరుగురిని లాగారు. అయినా అక్కడ మన బలం 8 కాగా, టిడిపికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. అయినా అక్కడా కోరం లేకపోయినా గెల్చినట్లు ప్రకటించారు. చివరకు కుప్పంలోనూ అదే పరిస్థితి. కుప్పం మున్సిపాలిటీ, రామకుప్పంలోనూ అదే పరిస్థితి.రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరిలో వైయస్సార్సీ 9 గెలిస్తే, టిడిపి 1 మాత్రమే గెల్చింది. అయినా ఛైర్మన్ ఎన్నికలో అక్రమాలు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఎందుకీ రాజకీయాలు? సిఎం స్థాయిలోనే అక్రమాలు చేస్తే ఎలా? ఒక పార్టీ మీద గెల్చినప్పుడు, వారిని లాక్కోవడం ఏమిటి? సిఎంగా ఉన్న వ్యక్తే ప్రజాస్వామ్యాన్ని కాపాడకపోవడం, పోలీసులను పెట్టి భయపెట్టడం ఏమిటి? మన పార్టీ నుంచి ముగ్గురిని లాక్కున్నారు. అయినా మనకు ఇంకా ఆరుగురు ఉన్నారు. మనదే మెజారిటీ. ఎన్నిక పెడితే మనమే గెలుస్తాం. అయినా దౌర్జన్యం చేసి, కోరం లేదని చెప్పి, ఎన్నిక గెల్చే ప్రయత్నం చేస్తున్నారు.పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం, యలమంచిలి. అక్కడ వైయస్సార్సీ 14. టిడిపి 4గెల్చింది. ఒకరిని లాక్కున్నారు. మిగతావారు గట్టిగా నిలబడ డంతో, ఏంచేయలేక వదిలేశారు. మామూలుగా ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఏడాది తర్వాత కొంత వస్తుంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వానికి ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత చాలా తీవ్ర స్థాయిలో ఉంది. ప్రజలు ఆయన్ను తీవ్రంగా ద్వేషిస్తున్నారు. కారణం, ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చాడు. జగన్ ఇచ్చినవన్నీ ఇవ్వడమే కాకుండా, ఇంకా మూడు ఎక్కువ ఇస్తానన్నాడు. కానీ, ఏదీ నిలబెట్టుకోలేదు. ఇప్పటికీ సంవత్సరం అయిపోయింది. అందుకే ఆయన ప్రభుత్వంపై అంత వ్యతిరేకత వచ్చిందని జగన్ అన్నారు. ఎవరు మాట్లాడినా,గొంతు విప్పినా, వారి గొంతు నొక్కుతున్నారు. మ్యానుఫ్యాక్చర్ విట్నెస్ సృష్టిస్తున్నారు. అంటే నేరంతో ఒక మనిషికి సంబంధం ఉండదు. వారు ఏం చేస్తున్నారంటే.. వారికి సంబంధించిన ఒక వ్యక్తిని ఏర్పాటు చేస్తున్నారు. ఆయన్ను అప్రూవర్ అంటున్నారు. ఆయనతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడిస్తున్నారు. ఒక మ్యానుఫ్యాక్చర్ ఎవిడెన్స్ క్రియేట్ చేస్తున్నారు. ఆ మనిషితో, ఈ మనిషి పేరు చెప్పిస్తున్నారు. ఈ మనిషిని అరెస్టు చేస్తున్నారు. చరిత్రలో గతంలో ఏనాడూ ఇలాంటివి జరగలేదు. ఒక తప్పుడు సంప్రదాయానికి ఈ పెద్దమనిషి చంద్రబాబునాయుడు ఈరోజు బీజం వేస్తున్నారు.ప్రతి నియోజక వర్గంలో పాత కేసులు తిరగ తోడుతున్నారు. మన ఎమ్మెల్యే అభ్యర్థిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. చురుగ్గా పని చేస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులను ఇరికిస్తున్నారు. ఎవ్వరినీ వదిలి పెట్టకుండా తప్పుడు కేసులు పెడుతున్నారు. కచ్చితంగా ప్రజలు ఇందుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు అన్నారు.

# స్కూలు పరీక్షలా! అసెంబ్లీలో ప్రశ్నలా?

>> పరీక్షలు రాయడం, అసెంబ్లీలో సమాధానాలు చెప్పడం రెండూ కష్టమైనవే. అయితే అసెంబ్లీ ప్రశ్నలను ఎదుర్కోవడం పూర్తిగా భిన్నమైనది. ప్రతిపక్షం సభలో లేకపోయినప్పటికీ అధికారపక్షం సభ్యులు ప్రతిపక్షం కంటే కష్టమైన ప్రశ్నలు అడుగుతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిరోజూ తనకు మూడు ప్రశ్నలు వచ్చాయని, వాటికి సమాధానం చెప్పేందుకు ఎంతో ప్రిపేర్ కావాల్సి ఉంటుందని తెలిపారు. స్కూల్ డేస్‌లో నేను లాస్ట్ బెంచి అని, తమది అల్లరి బ్యాచ్ అని సరదాగా సమాధానమిచ్చారు. మీకు ఇష్టమైన కొటేషన్ ఏమిటని ఒక విద్యార్థి ప్రశ్నించగా చంద్రబాబుగారి “డేర్ టు డ్రీమ్... స్ట్రైవ్ టు ఎచీవ్” అనే కోట్ తమకు ఇష్టమైనదని చెప్పారు. రాజకీయాల్లో ఎవరి నుంచి స్ఫూర్తి పొందారని మరో విద్యార్థి అడిగిన ప్రశ్నకు లోకేష్ సమాధానమిస్తూ...“ఓటమి తర్వాత 2005లో చంద్రబాబుగారితో హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కి వెళ్లాను... బాబుగారిని చూడగానే ఆయన గౌరవార్థం అక్కడ ఉన్న 5వేలమంది లేచినిలబడ్డారు. రాజకీయాల్లో మంచిచేస్తే ప్రజల్లో గౌరవం ఎల్లప్పుడూ ఉంటుందని తెలుసుకున్నా. ఆనాడే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నా”నని చెప్పారు. మీరు అదృష్టాన్ని నమ్ముతారా, హార్డ్ వర్క్‌ను నమ్ముతారా అన్న ఓ విద్యార్థి ప్రశ్నకు లోకేష్ సమాధానమిస్తూ... జీవితంలో ఉన్నతస్థానాలకు చేరాలంటే కష్టపడి పనిచేయడం ఒక్కటే మార్గం, కష్టానికి ప్రత్యామ్నాయం లేదు, ఈ విషయంలో నేను చంద్రబాబునాయుడు, నరేంద్రమోడీ ద్వారా ప్రేరణ పొందాను. 226రోజుల యువగళం పాదయాత్రలో ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. ప్యాసివ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్ కు! ఈ సందర్భంగా ప్రభుత్వ స్కూళ్లలో నెలకొన్న సమస్యలపై విద్యార్థుల నుంచి మంత్రి లోకేష్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన రౌతు హారిక మాట్లాడుతూ... వందరోజుల యాక్షన్ ప్లాన్ తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని తెలిపింది. కేవలం విద్యాభ్యాసం మాత్రమే కాకుండా లైబ్రరీకి, ప్రాక్టికల్ లెర్నింగ్ కు సమయం కేటాయించాలని కోరింది. దీనికి లోకేష్ సమాధానమిస్తూ... దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించాం, ప్యాసివ్ లెర్నింగ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్‌కు తేవాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

పల్నాడు జిల్లా ఒప్పిచర్లకు చెందిన పావని మాట్లాడతూ... తమ గ్రామంలో రోడ్డు సరిగా లేదని, టీచర్లు, విద్యార్థులు స్కూలుకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని చెప్పగా, వెంటనే రోడ్డు వేయించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. తమ స్కూలులో లైబ్రరీ, ల్యాబ్, ప్లేగ్రౌండ్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరింది. సాత్విక అనే విద్యార్థినిమాట్లాడుతూ... తాము మంచి మార్కులు సాధించడానికి డిజిటల్ క్లాస్‌రూమ్స్ బాగా ఉపయోగపడ్డాయని తెలిపింది. ఒకేషనల్ విద్యార్థులకు ల్యాబ్‌ఫెసిలిటీస్ పెంచాలనికోరింది. అనంతపురం జిల్లా అమరాపురానికి చెందిన అక్షిత మాట్లాడుతూ... కెజిబివి స్కూళ్లలో అమలుచేస్తున్న పంచతంత్ర విధానం బాగుందని తెలిపింది. సౌకర్యాలు మెరుగుపర్చి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించాలని విజ్ఞప్తిచేసింది. విద్యార్థులకు మధ్యాహ్నా భోజనం తోపాటు అందించే వెజిటబుల్ బిర్యానీతో పాటు రాగిజావ సరిగా ఉండటం లేదని పలువురు విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు.

## టిడిపి మహానాడుకు 19 కమిటీల ఏర్పాటు

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మహానాడు నిర్వహణకు తెలుగుదేశం పార్టీ 19 కమిటీలను నియమించింది. పార్టీలోని ముఖ్య నేతలతో కమిటీని ఏర్పాటు చేసింది. పల్లా శ్రీనివాస్, బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో ఆహ్వాన కమిటీ నారా లోకేశ్ నేతృత్వంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. యనమల ఆధ్వర్యంలో తీర్మానాలు, అచ్చెన్న నేతృత్వంలో వసతి ఏర్పాటు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సభ నిర్వహణ, బీసీ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో భోజనాల కమిటీలను ఏర్పాటుచేశారు. ఒక్కో కమిటీలో 10నుంచి 20మందినేతలకు చోటు కల్పించారు. కడప వేదికగా ఈనెల 27,28, 29 తేదీల్లోమహానాడు నిర్వహించనున్నారు.

## ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు సిఎం ఘన నివాళి

**విజయవాడ,మే20,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర కేసరి, దివంగత సిఎం టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు సిఎం చంద్రబాబు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. నిరుపేద కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ప్రముఖ వ్యక్తిగావెలుగొంది ఆంధ్రకేసరిగా కీర్తిప్రతిష్ఠలు పొందిన ఆ మహనీయుడు మనందరికీ స్ఫూర్తి ప్రదాత. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని బ్రిటీష్ తుపాకీకి గుండెను చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేం. టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగం ఆదర్శవంతం. ఆయనకుమరొక్కమారు ఘననివాళి ఘటిస్తున్నాను అని సిఎం చంద్రబాబు తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 21-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
నవమి రా.3.20
శతభిషం సా.6.53
వర్జ్యం రా.9.36-10.17
దు.ఘ.11.39-మ.12.31
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** కొత్తపనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో మీమాటకు విలువ పెరుగుతుంది.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** కుటుంబంలో వివాదాలు ఏర్పడిన పరిష్కరించుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** ముఖ్యమైన పనులలో జాప్యం పెరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. ఋణ బాధలు తప్పవు. అనారోగ్య సూచనలు.

**సింహం:** చిరకాల మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు. వాహనయోగం.

**తుల :** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృశ్చికం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సన్నిహితులు నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రయాణాలు.

**కుంభం:** ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**మీనం :** కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నూతన వస్తులాభాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విద్యాభివృద్ధికి పెద్దపీట

>> ఉన్నత విద్యా శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పిందని వివరించారు. ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ద్వారా, ప్రభుత్వం ఉన్నత విద్య. జీవితాంతం నేర్చుకునే అవకాశాలను మరింత సమ్మిళితమైన మరియు జ్ఞానవంతమైన సమాజాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుంది. ఈ చొరవతో నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి రావడమే కాకుండా విభిన్న వర్గాల అవసరాలను తీరుస్తుంది మరియు రాష్ట్రంలోని రాష్ట్ర లేదా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో సులభంగా ప్రవేశం లేని విద్యార్థులను శక్తివంతం చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70 అధ్యయన కేంద్రాలను నిర్వహించడానికి, తద్వారా ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థుల విస్తృత విద్యా ప్రయోజనాలకు సేవ చేయడానికి, ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటుచేస్తున్నది. హైకోర్టులో వివిధ కేటగిరీ లలో 245 పోస్టుల కల్పనకు న్యాయ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తూన్నామని మంత్రి నాదెండ్ల సమావేశంలో వివరించారు. గతంలో మాదిరిగానే చౌక ధర దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు పౌర సరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రేషన్ కార్డుదారులు ఇచ్చిన ఫీడ్బ్యాక్ ప్రకారం 25 మంది నిత్యావసర సరుకులు అందకపోవడం, 26 మంది ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు చేశారు. ఈ నిర్ణయం వలన ప్రభుత్వానికి రూ.353.81 కోట్లు ఆదా అవుతాయి. దీపం 2 పథకం క్రింద మొదటి ఫేజ్ లో దాదాపు 99,700 మంది లబ్ధిపొందాయ ఉచిత గ్యాస్ సిలిండర్ సౌకర్యాన్ని వినియోగించుకోవడం జరిగింది. దీపం2 ఫేజ్ టూ అమల్లో భాగంగా ఇప్పటికే దాదాపు 70 లక్షల మంది ఉచిత గ్యాస్ సిలిండర్ కోసమై బుక్ చేసుకోవడం జరిగింది. ఫేజ్3 లో ముందుగానే గ్యాస్ రాయితీ సొమ్మును లబ్దిదారులు ఖాతాలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ పాల్గొన్నారు.

# అన్యమత ఉద్యోగులకు విఆర్ఎస్

>> వాటికి కనీసం మూతలు ఉండటం లేదనేది కూడా ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో మంగళవారం బోర్డు సమావేశంలో పెద్ద హోటళ్ళు, జనతాక్యాంటీన్లుకు టెండర్లు పిలిచి నాణ్యమైన, సరసమైన ధరలకే ఆహారం విక్రయించాలనే బ్రాండెడ్ హోటళ్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇక తిరుమలలో విశ్రాంత భవనాల పేర్ల మార్పులో ఇద్దరు దాతలు మాత్రం స్పందించలేదని, దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టిటిడి మార్పుచేయాలని కూడా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్‌నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామాలయంలో భక్తులకు అన్నదానం సేవలను మరింత పెంచాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా తుళ్లూరుమండలం అనంతవరంలోని టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధిచేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 10కోట్ల రూపాయలు కేటాయింపుకు ఆమోదించారు. తమిళనాడులో శ్రీవారి నామావళిని రీమిక్స్‌చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్‌లెవల్ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలకు గాను అదనంగా 71కోట్ల రూపాయలు అందించేందుకు ఆమోదం తెలిపారు. స్విమ్స్‌లో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియమాకం కోసం అనుమతి. ఈ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర ఎల్లా, ప్రశాంతిరెడ్డి, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎన్.నర్సిరెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వరరావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపి మద్యం కేసులో నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మద్యం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. జూన్ 3 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విధించిన రిమాండ్ గడువు ఇవాల్టితో ముగియడంతో నిందితులను సీఐడీ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో కీలక నిందితుల రాజ్ కెసిరెడ్డి గోవిందప్ప బాలాజీ, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్‌రెడ్డి ధనుంజయ్‌రెడ్డి కృష్ణమోహన్ విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ రోజు వారు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు, వారి రిమాండ్‌ను పొడిగించింది.

## వల్లభనేని వంశీ పిటిషన్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు నిరాశ ఎదురైంది. అక్రమ మైనింగ్ కేసులో తనపై పీటీ వారెంట్ దాఖల చేయకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిగింది. అయితే దిగువ కోర్టు పిటీ వారెంట్ అనుమతించినా వచ్చే గురువారం వారెంట్‌కు అమలు చేయబోమని కోర్టుకి తెలిపింది రాష్ట్ర ప్రభుత్వం ఇక, వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ జరగగా వంశీ మోహన్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వచ్చేగురువారానికి వాయిదా వేసింది ఏపీ హైకోర్టు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని రెండు రోజులు కస్టడీ కోరుతూ హనుమాన్ జంక్షన్ పోలీసులు నూజివీడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## 22 నుంచి సిఎం మూడు రోజుల ఢిల్లీ పర్యటన

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి :** ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 22వ తేదీ ఢిల్లీ వెళుతున్నారు. 23న పలువురు కేంద్ర మంత్రులను సిఎం కలవనున్నారు. అదే విధంగా రాష్ట్రానికి పెట్టుబడులకు సంబంధించి పలువురు పారిశ్రామిక వేత్తలతో కూడా సిఎం భేటీ అవ్వనున్నారు. 24వ తేదీ ఉదయం 9.30 గంటలకు భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సిఎం పాల్గొంటారు. అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణమై అమరావతి చేరుకుంటారు.

# భూపట్టాల పంపిణి

>>తాండాలుగా ఉన్న గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని తెలిపిన ఆయన, ఎన్నికల సమయంలో ఐదు గ్యారంటీ యోజనల హామీ ఇచ్చి ప్రజలకు ఆచరణలోకి తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు భూహక్కును కల్పిస్తూ వారి పేరిట పట్టాలు చేసి 6వ గ్యారంటీని జారీలోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది సొంతంగా నివసిస్తున్న భూమితోపాటు సాగు చేస్తున్న భూమికి ఎటువంటి యాజమాన్య హక్కులు లేవు. దీనిని గమనించి తాను అటువంటి వారికి హక్కు పత్రాలు ఇవ్వాల్సిందిగా సూచించినట్లు, ఆ మేరకు నేడు 1 లక్ష మందికి పైగా లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కు పత్రాలు ఇస్తూ 2 వేల తాండాలు, హట్టి ప్రాంతాలను రెవెన్యూ గ్రామాలుగా అధికారికంగా ప్రకటించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో దేశంలో కర్ణాటకలో ఎవరూ కూడా భూహక్కు లేని వారు ఉండకూడదని రాష్ట్రంగా కర్ణాటక ఉంటుందని, ప్రతిఒక్కరికీ వారు అనుభవిస్తున్న భూ యాజమాన్యహక్కు దక్కాలని చెప్పారు. రాష్ట్రంలో ఇంకా 500 రెవెన్యూ గ్రామాలను ప్రకటించాల్సి ఉన్నదని తెలిపిన ఆయన, 50 వేల మందికి భూహక్కు పత్రాలను ఇవ్వాల్సి ఉన్నదన్నారు. వచ్చే ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని తాను ప్రభుత్వానికి చెప్పినట్లు రాహుల్‌గాంధీ తెలిపారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ భూమి హక్కుల పత్రాలు లేకుండా ఉండకూడదన్నదే మా ఉద్దేశ్యం మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ ఆశయం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ గ్యారంటీని 6వ గ్యారంటీగా జారీలోకి తెచ్చింద.

ఈ గ్యారంటీ జనపర, నిరుపేదలపరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తాము ఐదు గ్యారంటీలను ప్రకటించినప్పుడు ప్రధాని మోదీతోపాటు బీజేపీ నాయకులు ఈ గ్యారంటీలను జారీలోకి తీసుకురావడం కుదరదని ఎద్దేవా చేశారని, అయితే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఐదు గ్యారంటీలను విజయవంతంగా జారీ చేశామన్నారు. లక్షలాది కుటుంబాల మహిళలఖాతాలకు గృహలక్ష్మిద్వారా డబ్బు జమ చేస్తూ మాట నిలబెట్టుకున్నా మన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జనపర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, అందుకు ఉదాహరణ 5 గ్యారంటీ యోజనలు జారీ చేస్తుండడమేనని ప్రజల హర్షధ్వానాల మధ్య చెప్పారు. బిజెపి వారు పదేపదే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుండడం హాబీగా పెట్టుకున్నారని, ప్రభుత్వం చేస్తున్న పనులను చూసి మాట్లాడాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, డీసీఎం డి.కె.శివకుమార్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## బందరు చరిత్ర తిరగరాసేలా

# మసులా బీచ్ ఫెస్టివల్

### ఏర్పాట్లపై చర్చించిన మంత్రులు కందుల దుర్గేష్, కొల్లురవీంద్ర


మసుల బీచ్ ఫెస్టివల్‌పై సమీక్షిస్తున్న మంత్రులు దుర్గేష్,రవీంద్ర

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** బందరు చరిత్ర తిరగ రాసేలా మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్ నిర్ణయించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ 2వ బ్లాక్ లోని మంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఈ మేరకు ఇరువురు మంత్రులు భేటీ అయ్యారు. జూన్ 68 తేదీల్లో మచిలీపట్నం మంగినపూడి మసూల బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై చర్చించారు. మంగినపూడి బీచ్ అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా లక్షలాది సంఖ్యలో తరలివచ్చే సందర్శకులకు తెలిసేలా రాష్ట్ర పర్యాటక రంగానికి తగిన ప్రాచుర్యం కల్పించాలని సూచించారు. అంతేగాక రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలని కోరారు. ఇసుక తిన్నెలపై ఉత్సవాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసే స్వాగత తోరణాలు మొదలుకొని సాంస్కృతిక, కళా వైభవాన్ని స్ఫురించేలా, పర్యాటక ప్రాంతాల గొప్పతనం తెలిసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. మసుల బీచ్ ఫెస్టివల్ కు తరలివచ్చే లక్షలాది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల రేఖా చిత్రపటాన్ని పరిశీలించిన మంత్రి దుర్గేష్ ఉత్సవాల్లో ఏర్పాటు చేసే బందోబస్తు, ప్రదర్శనశాలలు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్, క్రీడల నిర్వహణ, పారిశుద్ధం, జనసమూహ నిర్వహణ, తాగునీటి ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై తనదైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా మసుల ఫెస్టివల్ కు సంబంధించిన ప్రోమో వీడియోలను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర సమాధానమిస్తూ ఉత్సవాల్లో భాగంగా పర్యాటకుల వినోదం కోసం జాతీయ క్రీడలైన బీచ్ కబడ్డీ, కయాకింగ్ జల క్రీడలు, హెలీ రైడ్, పారా గ్లైడింగ్, నీటిలో గ్లైడింగ్, స్కూబా డైవింగ్, స్పీడ్ బోట్లు తదితర సాహస క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ సినీ కళకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ సూచించనట్లుగా పర్యాటక రంగానికి తగిన ప్రాచుర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ పాల్గొన్నారు.

## క్రీడల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టాలి

### శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కర్రసాము క్రీడాకారులకు అభినందన

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రీడల్లో ఏపీని అగ్రగామిగా నిలబెట్టి రాష్ట్ర దేశ కీర్తి ప్రతిష్టతలను ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో సిలంబమ్ క్రీడాకారులు శాప్ ఛైర్మన్ ను సోమవరాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిలంబమ్ క్రీడాకారులు మాట్లాడుతూ ఏలూరు జిల్లా కలిదిండిలో ఏప్రిల్ 30వ తేదీన జరిగిన స్టేట్ లెవల్ సిలంబమ్ ఛాంపియన్‌షిప్ -2025 పోటీల్లో వారు సాధించిన విజయాలు పతకాల గురించి శాప్ ఛైర్మన్ కు వివరించారు. ఎస్వీఆర్కే ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 73 గోల్డ్ మెడల్స్ 16 సిల్వర్ మెడల్స్ 5 బ్రాంజ్ మెడల్‌స సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని శాప్ ఛైర్మన్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని తమకు కావాల్సిన క్రీడాసదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర దేశ గౌరవాన్ని పెంచాలని ప్రోత్సహించారు.

### రాష్ట్రం మీదుగా తిరిగే భువనేశ్వర్- యశ్వంతపూర్ ప్రత్యేక రైళ్లు జూన్ వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 20,ప్రభాతవార్త** రాష్ట్రం మీదుగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్ మధ్య తిరుగుతున్న వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జూన్ ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. భువనేశ్వర్ నుంచి యశ్వంత్‌పూర్‌కు ప్రతి శనివారం బయలుదేరే నెంబర్ 02811ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24నుంచి జూన్ 28వరకు, యశ్వంత్‌పూర్ నుంచి భువనేశ్వర్‌కు ప్రతి సోమవారం బయలుదేరే నెంబర్ 02812ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26నుంచి జూన్ 30వరకు పొడిగించామన్నారు. ఈ రైళ్ల మార్గమధ్యలో ఖుర్దారోడ్, బర్హంపూర్, పలస, శ్రీకాకుళం, విజయనగరం, కొత్తవలన, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసరావు పేట, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, డోన్, ధర్మవరం, సత్య సాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి), హిందూపురం స్టేషన్లలో నిలుస్తాయి.

## ప్రజల జీవితాల్ని మెరుగుపరచాలనే మీ తపన స్ఫూర్తిదాయకం..

### సిఎం చంద్రబాబును ప్రశంసించిన బిల్‌గేట్స్


బిల్ గేట్స్, చంద్రబాబు

**విజయవాడ మే 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలతో పాలనను బలోపేతం చేయడం, మరింత సులభతరంగా సేవల్ని అందించి ప్రజా జీవితాల్ని మెరుగుపరచాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు తపన, కృషి స్ఫూర్తిదాయకమని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, బిల్-మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ కొనియాడారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన వంటికీలక రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి గేట్స్ ఫౌండేషన్ - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌కే కాక భారత్‌తో పాటు అల్ప, మధ్యాదాయ దేశాలకూ ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు. కీలక రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తక్కువ ఖర్చుతో పరిష్కార మార్గాలు కనుగొనడం ప్రజలకు సులభతరంగా ఆయా సేవల్ని అందించే అంశాలపై ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ వేదికగా చంద్రబాబు బిల్‌గేట్స్ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇరువురి సమక్షంలో పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని చంద్రబాబును అభినందిస్తూ ఇటీవల గేట్స్ లేఖ రాశారు. నేను భవిష్యత్తులో ఏపీలో పర్యటించే నాటికి ఈ ఒప్పందంలోని లక్ష్యాన్ని సాధించడం ద్వారా అద్భుతమైన ఫలితాలు సాకారం కానున్నాయి. మెడ్‌టెక్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి మీరు చూపుతున్న శ్రద్ధతో పేదలకు అత్యంత నాణ్యత కలిగిన పరికరాలు తక్కువ ధరకు అందుబాటులోకి వస్తాయి అని లేఖలో బిల్ గేట్స్ పేర్కొన్నారు.

హెల్త్ రికార్డుల డిజిట లైజేషన్ ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్ ద్వారా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయాలనే మీ ప్రణాళికలు ఆసక్తికరంగా అనిపించాయి. గర్భిణులు, చిన్నపిల్లల ఆరోగ్య రక్షణకు మల్టి పుల్ మైక్రోన్యూట్రియంట్ సప్లిమెంట్లు తదితరాలు ఎలా ఉపయోగపడతాయో చర్చించినందుకు ఆనందంగా ఉంది.

## మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడకూడదు

### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్


కీరవాణిని సత్కరిస్తున్న పవన్ కల్యాణ్

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదు అని డి.సీఎం,పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అన్నారు.ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే. అని పాటకు సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారు సంగీత దర్శకుడు కీరవాణి అంటూ ప్రశంసించారు. పవన్ కళ్యాణ్‌మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదు అని ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే.., అని పాటకు సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారు సంగీత దర్శకుడుకీరవాణి. "హరిహర వీరమల్లు" చిత్రంలో ఈ గీతం వినిపిస్తుంది.ఈ చిత్రానికి సంగీతాన్ని అందించిన కీరవాణిని పవన్ కల్యాణ్ స్వయంగా అభినందించి,సత్కరించారు.ఈ సందర్భంగా పవన్ ఉద్వేగంగా మాట్లాడుతూ నేటి పరిస్థితులలో మనందరిలో వీరత్వం చేవజారిపోకూడదని పాటలో చర్నాకోలతో చెప్పినట్లు అనిపించింది. ఈ పాటను 21వ తేదీన అందరికీ విన్పించబోతున్నామన్నారు. హరిహర వీరమల్లు చిత్రానికి కీరవాణి అందించిన నేపథ్య సంగీతం ఆ చిత్ర కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకువెళ్తాయి. ఈ సినిమా కోసం ఎంత తపన చెంది స్వరాలు అందించారో స్వయంగా చూశాను. 'వీరమల్లుకి ప్రాణం పోశారు అంటే అతిశయోక్తి కాదు.'మొదటిసారి మీతో చేస్తున్నాను అంటే... అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టు ఉండాలి కద్దా అనడం కీరవాణి లో అంకిత భావాన్ని తెలియచేస్తోంది. ఈ రోజు ఉదయం ఆస్కార్ గ్రహీత కీరవాణి గారిని కలిసి సాగించిన సంభాషణ ఎంతో సంతోషాన్ని కలిగించింది. సంగీత దర్శకులు చక్రవర్తి గారి దగ్గర శిష్యరికం నుంచి సరస్వతి పుత్రులైన వేటూరి సుందర రామమూర్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి వరకూ తనకున్న అనుబంధాన్ని, సంగీత సాహిత్యాల గురించి చెబుతుంటే సమయం తెలియలేదు. కీరవాణి దగ్గర ఉన్న వయొలిన్లు చూసి వాటి గురించి మాట్లాడుకొంటున్నప్పుడు నేను వయొలిన్ నేర్చుకోవడం, జంట స్వరాల వరకూ నేర్చుకొని వదిలేయడం గుర్తు చేసుకున్నాను. చిదంబరనాథన్ గారు ఇచ్చిన వయొలిన్ ను ఎంత భద్రంగా దాచుకున్నారో చూపించారు కీరవాణి గారు. తెలుగు కథలను ప్రేమించే కీరవాణి గారు తనకు అమితంగా నచ్చిన 32 కథలను ఒక సంకలనంలా చేసుకొన్నారు. వాటిని నాకు బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అందులో కీరవాణి రాసిన రెండు కథలు కూడా ఉన్నాయి. ఆయన సరిగమలతో బాణీలు కూర్చే కూర్పరి మాత్రమే కాదు... చక్కటి తెలుగు పదాలతో గీతాలు అల్లగల నేర్పరి కూడా. తన పదాలతో గీత రచయితలకు మార్గం వేస్తారు.

## గ్రామాల్లో అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు సహకరించాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


గిరిజన కాలనీలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

**తొట్టంబేడు,మే 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గం పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందిందని గ్రామాల అభివృద్ధికి ప్రతి పారిశ్రామిక వేత్త సహకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి పంచాయతీ గిరిజన కాలనీలో గ్రీన్‌ప్యానెల్ సిఎస్ఆర్ ఫండ్స్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసారు. దీనిని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏర్పాట్లను కన్నలి ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షించారు. సభలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయన్నారు. తొట్టంబేడు మండలం చెన్నై-విశాఖ కారిడార్‌లో ఉండటంతో పరిశ్రమలు వెలుస్తున్నాయన్నారు. పరిశ్రామిక వెత్తలు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సహాకరించాలన్నారు. అలాగే ఆయా పరిశ్రమల పరిసరాల్లో ఉన్న నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి ఆవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమలు వస్తునాయంటే గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తా యనే ఆశతో ఉంటా రన్నారు. కాబట్టి పారిశ్రామిక వెత్తలు సాధ్యమైనంత వరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చి దిద్దుటకు 2014-2019 అప్పటి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రణాళిక రూపొందించి భారీ పరిశ్రమలను సాధించారన్నారు. ఏర్పేడు మండలంలోని విమానాశ్రయం సమీపంలోనూ, తొట్టంబేడు మండలంలోని కన్నలి, లింగమనాడుపల్లి పరిసరాల్లో భారీ పరిశ్రమలు వెలిసాయన్నారు. పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుత్ సరఫరాతోపాటు పారిశ్రామి వెత్తలకు చేయూత ఇవ్వటంలో డిక్సన్, టిసిఎల్, గ్రీన్ ప్యానల్, విద్యాపరంగా ఏర్పేడులో కేంద్ర విద్యాసంస్థలు ఐఐటి, ఐసర్‌లను సాధించి నియోజకవర్గ పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసారన్నారు. గ్రీన్ ప్యానెల్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి పారిశ్రామిక వేత్త గ్రామాల అభివృద్ధికి సహాకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌ంరెడ్డి పిలుపు నిచ్చారు.1994లో ఇక్కడ మొట్టమొదటి భారీ పరిశ్రమను గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద 'లాంకో పరిశ్రమ'తో శ్రీకారం చుట్టారన్నారు.

## నాజిల్ మొరాయించడంతోనే రాకెట్ ఫెయిలైందా?

### రాకెట్ విఫలమవడానికి కారణాలను అన్వేషిస్తున్న ఇస్రో

**శ్రీహరికోట (తడ), మే 20 ప్రభాతవార్త** శ్రీహరికోట నుంచి ఈ నెల 18న ప్రయోగించిన పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్ విఫలమవడానికి కారణాలను అన్వేషిస్తూనే ఉన్నారు. ప్రత్యేకించి మూడవ దశలో నాజిల్ పనితీరుపై కొందరిలో అనుమానాలున్నాయి. రెండు దశలు సక్రమంగా జరిగిన తర్వాత మూడవ దశలో తలెత్తిన సాంకేతిక అవరోధం వల్ల రాకెట్ ఫెయిలైందని ఇస్రో గుర్తించింది. అయితే ఈ మూడవ దశలోని నాజిల్ పనితీరు మీద కొన్ని సందేహాలున్నాయి. రెండవ దశ నుంచి మూడవ దశకు ఘన ఇంధన మోటారు అంటుకునే సమయంలో కొంత ఆలస్యమైనా రాకెట్ వడివడిగా దూసుకెళ్లలేదు. ఘన ఇంధన కర్మాగారం (స్ప్రాబ్) శ్రీహరికోటలోనే నిర్మించి ఉన్నారు. ఇప్పటికి ఎన్నో ఘన ఇందన మోటార్లను తయారు చేసి విజయవంతంగా పిఎస్‌ఎల్‌వి రాకెట్లను ప్రయోగించి ఉన్నారు. ఘన ఇంధన దశ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండటమే కాకుండా శ్రీహరికోటలోని స్ప్రాబ్‌లో పనిచేసే వారు ఎక్కువగానే ఉంటారు. అత్యంత క్లిష్టమైన ఈ దశలో ఇంధనం సమకూర్చడానికి శాస్త్రవేత్తలు అలవాటుగా మార్చుకున్నారు. షార్‌లోని ఘన ఇంధన కర్మాగారం వలన ఆ మోటార్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇటువంటి అత్యంత కీలకమైన స్ప్రాబ్‌లో ప్రస్తుతం పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్‌లోని ఘన ఇంధన దశను కూడా ఏర్పాటు చేశారు. ఈ దశ సక్రమంగా పనిచేయకపోవడమే రాకెట్ ఫెయిలవడానికి ఒక కారణం కాగా, ఆ దశలోని నాజిల్ సరిగ్గా అంటుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషిస్తున్నారు. అయితే ఇస్రో శాస్త్రవేత్తలు దీన్ని ఇప్పటికీ ధ్రువీకరించలేదు.

## తిరువూరులో నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక వాయిదా

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** తిరువూరులో పట్టణంలో నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఉద్రిక్తతతో కూడిన వాతావరణం నెలకొంది.ఈ క్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక మరో సారి వాయిదా పడింది. టీడీపీ నాయకులను, కార్యకర్తల మధ్య నగర పంచాయతీ ఎన్ని వ్యవహారంలో వివాదం చోటు చేసుకుంది. వైకాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ .ఎంఎల్‌సీ అరుణ్‌కుమార్‌లు తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నికను అడ్డుకునేందుకు అనుచరగణంతో విజయవాడ నుంచి తిరువూరు వచ్చారంటూ టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తూ వారిని అడ్డుకునే ప్రయత్నం చేసారు. వారిని వైకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు పక్షాల నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. రేపూడి వద్ద దేవినేని అవినాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మైలవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో అవినాష్‌పై టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించారనే అభియోగం.ఈ క్రమంలో పోలీసులు దేవినేని అవినాష్, మొండితోక అరుణ్‌కుమార్‌లను పోలీసుస్టేషన్ తీసుకుని వెళ్ళారు.తరువాత వారిని విజయవాడకు పంపించేసారు.ఈ క్రమలోతిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడం అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో కే.మాధురి ప్రకటించారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ఆలయాల అభివృద్ధికి సమగ్ర బృహత్ ప్రణాళిక

### -తిరుమల ఆలయ భద్రతకు యాంటీడ్రోన్‌టెక్నాలజీ - టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** సనాతన హిందూ ధర్మాన్ని విస్తృతంగా వ్యాప్తిచేసేందుకు, ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక భక్తిభావం పెంపొందించేలా రాష్ట్రంలోని పలు టిటిడి ఆలయాల అభివృద్ధికి సమగ్ర బృహత్ ప్రణాళిక తయారుచేస్తున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు వెల్లడించారు. ఇందుకు నిపుణులైన ఆర్కిటెక్‌లనుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన ధర్మకర్తలమండలి సమావేశంలో చర్చించి ఆమోదించిన వివరాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి మీడియాకు వెల్లడించారు. టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయం, రాష్ట్రరాజధాని అమరావతిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, తిరుపతి జిల్లాలోని నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, కడపజిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారుచేసేందుకు ప్రతిపాదనలు ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించనున్నారు. తిరుమల క్షేత్రంలో మరోప్రసిద్ధ ఆలయం బాల ఆంజనేయస్వామి, పాపవినాశనం పుణ్యతీర్థాల సందర్శనకు వస్తున్న భక్తుల సంఖ్య పెరగడంతో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌళిక సదుపాయాలు మరింత పెంచనున్నారు. ఇటీవల భారత్, పాక్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నడుమ ప్రపంచ ప్రసిద్ధ హిందూ ఆలయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మరింత భద్రత పెంచాలని నిర్ణయించారు.

## అంజనాద్రిలో 22న హనుమజ్జయంతి ఉత్సవాలు

### - ఆకాశగంగలోని బాలాంజనేయునికి ప్రత్యేక అభిషేకం



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమల ఆకాశగంగ ప్రాంతంలో మరో దివ్యపుణ్యక్షేత్రం బాలాంజనేయస్వామికి ఈనెల 22న హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. బాల ఆంజనేయస్వామి పుట్టుక ఆకాశగంగ ప్రాంతంలోనే అని చారిత్రక ఆధారాలతో ,పురాణాల్లో పేర్కొనబడింది. తిరుమల తిరుపతి దేవస్థానం కూడా బాల ఆంజనేయస్వామి జన్మస్థలం గుర్తించి ఐదు సంవత్సరాలుగా ఇక్కడే జయంతి ఉత్సవాలు నిర్వహిస్తోంది. 22వతేదీ గురువారం రోజు పలు రకాల విశేష ఉత్సవాలు, ప్రత్యేక అభిషేకాలు జరిపించనున్నారు. అంజనాద్రిలోని ఆకాశగంగ ఆలయం, జపాలి తీర్థంలోని హనుమాన్ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఆకాశగంగలోని అంజనాద్రి ఆలయం, జపాలి ఆంజనేయాస్వామి ఆలయాలకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. వేదపండితులు ఆంజనేయసహస్రనామార్చన, మంత్రోచ్చరణల మధ్య స్వామివారికి, అంజనాదేవికి అభిషేకం నిర్వహించనున్నారు. రేపు ఉదయం 11గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు తిరుమల నుండి 7వమైలుకు ఉచిత రవాణా సౌకర్యం, తిరిగి తిరుమల చేరడానికి కూడా కల్పిస్తోంది. ఆరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంజనాద్రిని టిటిడి సర్వాంగసుందరంగా ముస్తాబుచేస్తోంది.

## శ్రీవారి ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని తెలంగాణ ఎంఎల్‌సి దయానందగుప్త, సినీనటి, మిస్‌వరల్డ్ మానసవారణాసి, ఏపి జైళ్ళశాఖ డిజి అంనీకుమార్ దంపతులు మంగళావారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. దేవుడ్ని దర్శించుకుంటే మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీగోశాలకు 10 జంబో ఎయిర్‌కూలర్లు



**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన జంబో ఎయిర్ కూలర్లను అందించారు. మంగళవారం ఉదయం టిటిడి బోర్డుసభ్యుడు రంగశ్రీ ,జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, హేమకుమార్, మనోజ్‌తో కలసి ఈ ఎయిర్‌కూలర్లను అందించారు. అక్కడే ఉన్న అగరబత్తీల తయారీ కేంద్రాన్ని గోశాలను పరిశీలించారు. గోవులకు చల్లదనం కోసం వీటిని అందించడం జరిగిందన్నారు.

## వైఖానస ఆగమ సలహా కమిటీ నియామకం

**తిరుమల,మే 20ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆలయంలో నిత్యకైంకర్యాలు, సేవలు నిర్వహించేందుకు వీలుగా నూతన వైఖానస ఆగమ సలహాకమిటీని మంగళవారం టిటిడి బోర్డు నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కొత్త వైఖానస సలహా కమిటీలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు ఏఎస్ కృష్ణ శేషాచలందీక్షితులు, ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం వైఖానసం ఆగమవిభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పరాశరం భవనారాయణాచార్యులు, చెన్నైకి చెందిన పికె వరదన్‌భట్టాచార్యార్, గోవిందరాజస్వామి ఆలయంలోని సంభావన అర్చకుడు ఏ.అనంతశయనదీక్షితులు, మాజీ అర్చకుడు ఏ.ఖద్రీనరసింహాచార్యులు నూతన ఆగమ సలహాకమిటీలో సభ్యులు.

## పిడుగుపాటుకు ఆవులు మృతి

**శ్రీరంగరాజపురం, మే 20 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లి పంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామ పరిసరాల్లో మంగళవారం పిడుగు పడటంతో రెండు ఆవులు మృతి చెందాయి. కృష్ణమూర్తి అనే రైతుకు చెందిన ఆవులపై పిడుగు పడటంతో రెండు ఆవులు ఒకేసారి మృతి చెందాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నెం. 2/TO/2025-26 తేదీ: 15.05.2025
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, పెద్దాపురం వారిచే రూ.36.90 లక్షల విలువ గల 5 పనుల కొరకు సమోదిత క్లాస్ IV & V పై స్థాయి సివిల్ కాంట్రాక్టరుల నుండి టెండర్‌లు కోరబడుతున్నవి మరియు పై పనులకు టెండర్‌ల స్వీకరణకు చివరి తేది 29.05.2025 సా.4.00గం. వరకు. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్ నం. 9440818526.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, పెద్దాపురం.
DIPR.NO. 16432/CL/ADVT/1/1/2022-23 తేది: 20.05.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెరమ్ టెండర్ ప్రకటన
ఎన్ ఐ టి నెం. 01/TO/2025-26 తేదీ: 16.05.2025
కాకినాడ జిల్లాలో 11నం.ల పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్‌లు కోరబడుతున్నవి. సుమారు విలువ: రూ.14.50 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు స్వీకరణ తేదీ : 22.05.2025 మ.2.00గం. నుండి 29.05.2025 మ.3.00గం. వరకు. తదుపరి వివరాలకు www.eprocurement.gov.in వీక్షించండి. ఫోన్ నం. 0884-2367626.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్, కాకినాడ.
DIPR.NO. 16431/CL/ADVT/1/1/2022-23 తేది: 20.05.2025

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-రస్కిన్

# అ 'మర్యాద'కు అంతేది?


ఏలినవారు ఎలా ఉన్నా అధికార దర్పం అనుభవిస్తూ ప్రభుత్వ మర్యాదలు పాటించాల్సిన వారు ప్రోటోకాల్స్ పాటించడానికి కూడా ఇష్టపడుట లేదు. సాధారణ జనజీవనంలో పెద్దల్ని గౌరవించని వారిని పెద్దంతర చిన్నంతరం తెలియకుండా పిల్లచేష్టలు చేస్తున్నారని తట్టిపడేస్తాం. మరి కానీ సాక్షాత్తూ ఈ దేశ అత్యున్నత సర్వోన్నత న్యాయస్థానాధిపతి ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌కి ప్రోటోకాల్ పాటించడానికి మహారాష్ట్ర డిజిపి కానీ, సిఎస్‌గానీ ముంబై పోలీసు కమిషనర్ కానీ హాజరుకాలేదు. దాంతో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారిగా శ్రీ బి.ఆర్ గవాయ్ సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వెళ్లారు. మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆ సందర్భంగా జరిగిన సభలో ఈ ప్రస్తావన తెచ్చారు. న్యాయమూర్తులకు ప్రోటోకాల్ విషయంలో 'అమర్యాద' కలిగితే సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న ఆర్టికల్ 142 కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఈ అధికరణం కింద ఏ వ్యక్తినైనా తమ ముందు హాజరు కమ్మని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వచ్చు. ప్రజాస్వామ్యంలో మూడు ప్రధాన స్తంభాలుగా వ్యవహరించే న్యాయవ్యవస్థ, శాసనసభా, కార్యనిర్వాహక వ్యవస్థలు సమాన గౌరవాలు పొందుతున్నప్పుడు అందులో భాగస్వాములైన వారు ఒకరినొకరు పరస్పరంగౌరవించుకోవాలని అన్నారు. ప్రతి రాజ్యాంగ వ్యవస్థ, సమానమైన మరొక సంస్థకు ఇచ్చే గౌరవానికి సంబంధించిన విషయమే 'ప్రోటోకాల్' అని ఆయన వివరించారు. వారెవరైనా అలాంటి ప్రోటోకాల్ విషయంలో భిన్నమైన అభిప్రాయం ఉంటే సముచితం కాదని భావిస్తే పునరాలోచించుకోవాలని జస్టిస్ గవాయ్ కోరారు. చీఫ్ జస్టిస్‌ఆగ్రహం చవిచూశాక దాని తీవ్రత మరోదశకు చేరకుండా సిజెను ఆ ముప్వురు ఉన్నతాధికారులు కలిసి వెళ్లారు. సాధారణంగా పాలకుల కనుసన్నల్లో నడుస్తూ తమకు వారి నుండి కావల్సినంత రాజ్యాంగ భద్రత ఉన్నదని భావించినపుడో, తమపై అధికారులను రక్షణ కల్పించే 'బాస్'లున్నారని భావించినప్పుడో పై అధికారులను వారి ఆధిపత్యాన్ని పక్కన బెట్టడం సహజంగా జరుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో ఇలాంటివి గతంలో చూశాం. అధికారులు పాలకుల ఆధిపత్యాన్ని అంగీకరించలేనప్పుడు అలాంటివి జరుగుతుంటాయి. ఇవన్నీ ఆయా ప్రాంతాల్లో నడుస్తున్న రాజకీయాలు. రాజకీయ పార్టీల అనుబంధాల నేపథ్యంలో బేధాభిప్రాయాలు బయటపడ్తుంటాయి. రాజకీయవేత్తల ఆధిపత్యాన్ని సహించనప్పుడు కొందరు అధికారులువారికి తలొగ్గేందుకు ఇష్టపడరు. వ్యక్తిగతంగా ఎవరు ఎవరితోనైనా విభేదించవచ్చు. కాని రాజ్యాంగ సంస్థలకు చెందిన వారి మధ్య ఎలాంటి మర్యాదల లోపం జరుగకూడదు. అలా జరిగినప్పుడు ఆయా వ్యవస్థల మధ్య జరిగే సంఘర్షణలు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తాయి. రాజ్యాంగ వ్యవస్థలో ముఖ్యమైన మూడు వ్యవస్థలూ సమాన గౌరవాలు ఇచ్చిపుచ్చుకోవాలి. ఇలాంటివి తాను పెద్దగా పట్టించుకోనని అయినా చెప్పవలసిన చోట, చెప్పదగిన విషయాలు చెప్పాల్సి వస్తుందని ప్రస్తావించారు. మహారాష్ట్రకు చెందిన తాను దేశంలోని న్యాయవ్యవస్థలో అత్యున్నత హోదా పొంది తొలిసారి స్వరాష్ట్రానికి వచ్చినప్పుడు సాటి రాజ్యాంగ సంస్థల అధికార్లు ప్రోటోకాల్ పాటించని విషయంలో పునరాలోచన చేసుకోవాలని కోరారంటే వారిని ప్రధాన న్యాయమూర్తి ఎంత సున్నితంగా మందలించారో అర్థమవుతుంది. ఇలా ఒక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విషయంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. శాసనసభ్యులు, మండల ప్రజాపరిషత్, జిల్లా పరిషత్ సభ్యుల విషయంలో విపక్ష శాసన సభ్యుల విషయంలో కూడా ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరుగుతుండడం తరువాత అవి సర్దుకుపోవడం మామూలే. అయితే గత కొంతకాలం తెలుగు రాష్ట్రాలలో రాజ్యాంగ వ్యవస్థ లోనే అంతర్గతంగా కొన్ని విభిన్న హోదాలున్న వారి మధ్య ఇలాంటి వివాదాలు చెలరేగి చాలాకాలం ముఖాముఖాలు చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. సాటి వ్యవస్థ అధినేతలు వారిని సమాన గౌరవంతో చూడలేకపోవడం అహంభావ ఛాయలు కూడా ఇలాంటి చేదు అనుభవాలకు దారితీస్తాయి. తెలంగాణ గవర్నర్ తమిళ్‌సై వచ్చాక తెలంగాణ ప్రభుత్వం ఆమె పట్ల ఎంతో విభిన్న వైఖరితో ప్రవర్తించింది. పలుసార్లు ఆమె అవమానానికి గురయ్యారు. కాగా ఎంతో సంయమనంతో వ్యవహరించేవారు. చివరికి తెలంగాణ గవర్నర్ తమిళ్‌సై సుందరరాజన్ పట్ల అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి సరైన గౌరవం చూపలేదనే చేదు అనుభవాల గురించి అందరికీ తెలిసిందే. 2024 జనవరిలో మెదక్ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా కాంగ్రెస్ నేతలను వేదిక మీద కూర్చోనివ్వకపోవడం వివాదాస్పదమైంది. రాజ్యాంగ సంస్థల మధ్య ఇటువంటి పరువు ప్రతిష్టల సమస్య ఏర్పడడం మంచిది కాదు. తెలుగునాట చీటికిమాటికి వచ్చే ప్రోటోకాల్ స్పర్థలన్నీ స్థానిక రాజకీయ విభేదాలకు సంబంధించినవే కనుక కాలక్రమంలో వీరు వారైనా, వారువీరైనా ఒకటైపోతారు. కాగా మొన్న ప్రధానన్యాయమూర్తి విషయంలో జరిగిన ఉల్లంఘన అసలుసిసలు సమస్య. అధికారులు ప్రోటోకాల్ విషయంలో విశాలదృక్పథంతో ఆలోచిస్తే అసలు సమస్యే ఉండదు. అందుకే రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు తాము ఇతరుల పట్ల ఎంత మర్యాదగా ప్రవర్తించాల్సి ఉంటుందో తెలుసుకోవాలి. దీనివలన ప్రజల్లో చులకనవడం తప్ప వేరే ఏ విధమైన గౌరవ ప్రతిష్టలు కలుగవని గుర్తుంచుకోవాలి.

అదృష్టాన్ని నమ్ముకోవడం కంటే ధైర్యాన్ని నమ్ముకోవడం మంచిది. అదృష్టం ఏ వ్యక్తినీ తెలివిమంతుడ్ని చేయలేదు.



సెనెకా

ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా, ఎప్పటికీ అతనిని విడువని నీడలాగా ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.



గౌతమబుద్ధుడు

# ప్రజావాక్కు



### ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం విధించాలి

రాష్ట్రంలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లపై నిషేధం ఉన్నప్పటికీ చాలా మంది విరివిగా ఆడుతున్నారు. రాష్ట్రంలో నిషేధించిన యాప్‌లను విపిఎన్ సాయంతో లొకేషన్ మారుస్తూ వినియోగిస్తున్నారు. ఈ ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత డబ్బును కోల్పోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలి.

- ఎం.ముత్యం రెడ్డి, అందెగ్రామం, సిద్ధిపేటజిల్లా

### అందాల పోటీలు రాష్ట్రఖ్యాతిని పెంచాయి

పన్నెండురాసులలో నూటఎనిమిది పాదాలున్నట్లుగా అందాల పోటీకి నూట ఎనిమది దేశాల అందగత్తెలలో అందగత్తెగా ఎన్నిక చేయడానికి వారందరని మన తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్‌కుఆహ్వానించి, గౌరవించడం రాష్ట్ర ఖ్యాతి మిక్కిలి ఇనుమడించింది. వారికి సకల సదుపాయాలను కలిగించి, ముఖ్యమైన చారిత్రాత్మక ప్రదేశాలకు, మన రామోజి ఫిల్మ్ సిటికి తీసుకెళ్ళడం వంటివి చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆహ్వానితులు ఎన్నటికి మరచిపోలేరు. వీరి కట్టూ బొట్టు మన హిందూ సంప్రదాయాన్ని ప్రతిఫలించింది. వీరిలో ఎవరో ఒకరు ప్రపంచ సుందరిగా ఎన్నికవుతారు. కానివారు కూడా చాలామందికి బాగా నచ్చుతారు. అందానికి సరియైన నిర్వచనం లేదు. నాకు ఏది అందంగా కనిపిస్తోందో అదే నాకు ఎప్పటికి ఆనందమనిపిస్తుందని ఆంగ్ల రోమాంటిక్ కవి జాన్‌కీట్స్ అన్నాడు. మన తెలుగు కవులు ఇంకా అద్భుతంగా స్త్రీ సౌందర్యాన్ని ఊహకు అందనంతగా అనేక శోభలతో వర్ణించారు.

-డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### సౌకర్యాలు కల్పించాలి

పొట్టకూటికోసం వలసకార్మికులు పడే కష్టాలు వర్ణనాతీతం. రెక్కాడితేకానీ డొక్కాడని ఈ భవన కార్మికులకు ఉపాధికరువయిందంటే అతిశయోక్తికాదు. ఏపూటకాపూట శ్రమించి, ఉదరం నింపుకునే వీళ్లకు సౌకర్యాలు చాలా దూరం. అంతేకాకుండా చేసే పనుల్లో దమ్ము, ధూళి కారణంగా శ్వాసకోశ సమస్యలతో అనారోగ్యపాలవుతుంటారు. ఎక్కువ పనిదినాలు, సొంతిళ్లతోపాటు రేషన్ హెల్త్, లేబర్ కార్డులు, షూ, చేతిగ్లౌస్‌లు, మాస్కులు అందించి ఆదుకొని వీరి జీవితాల్లో వెలుగు నింపాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### అగ్నిప్రమాదాలను నివారించలేరా?

వేసవి పొడి గాలులు, పెరిగిన ఉష్ణోగ్రతలు, గరిష్ఠ విద్యుత్ లోడ్లుకలిస్తే అగ్నిప్రమాదాలుసంభవించే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల ప్రమాదం శారీరకంగానే కాక ఆర్థికంగా కూడా వినాశకరంగా మారుతోంది. ఒక్క చిన్న స్పార్క్‌తో వేల కోట్లు విలువైన ఆస్తి కలిపి, ఎన్నో ప్రాణాలు మంటల్లో పోయే అవకాశముంది. ప్రభుత్వం తక్షణం మూడు దిశల్లో చర్యలు చేపట్టాలి. మొదట, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయాలి. ప్రతి మండలానికి ఒక మొబైల్ ఫైర్ స్టేషన్, వేగవంతమైన రగడ నీటి ట్యాంకర్లు, ఆధునిక ఫోమ్ సిస్టమ్‌లు అందుబాటులో ఉంచాలి. రెండవది, నిరంతర తనిఖీలు, శీతల పానీయ చేటిగళ్లు, గాజు ప్యానెల్లు, ఎయిర్‌కండిషనర్ లైను లాంటి అధిక లోడ్ ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్లు నెలసారి నిర్వహించి, తప్పులైతే వెంటనే సరిపెట్టాలి. మూడవది, ప్రజలకు అవగాహన ప్రతి రెవెన్యూ గ్రామంలో వేసవి ప్రారంభానికి ముందే 'ఫైర్ సేఫ్టీ వారాలు' జరిపి, గృహాల్లో ప్రత్యేక భద్రతాచర్యలు, గ్యాస్ సిలిండర్ నిర్వహణ, పొడుపు చర్యలు నిర్వహించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### క్లీన్ సిటీగా నగరం

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి అనే భావనతో ఇటీవల తెలంగాణాప్రభుత్వం గోడల మీద రాతలను వాల్‌పోస్టర్స్‌ను నిషేధించింది. దీన్ని ఉల్లంఘిస్తే ఫైన్ వేస్తామని తెలిపింది. ఇది ముమ్మాటికీ హర్షణీయం. అలాగే బ్యానర్ ఫ్లెక్సీలపై కూడా చర్యలు తీసుకోవాలి. గతప్రభుత్వం బ్యానర్ ఫ్లెక్సీలపై నిషేధం విధించింది. కానీ నగరంలో విచ్చలవిడిగా బ్యానర్లు ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. రోడ్లపై చెత్తను వేయకూడదు.

-ఎస్. శేషగిరి, సికింద్రాబాద్

### అవినీతిని అరికట్టాలి

ఇటీవల ఉభయరాష్ట్రాల్లో కొన్ని లక్షల ప్రజలకు ఎన్నో విషయాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. అత్యంత ఉన్నత అధికార హోదా ఉన్న వ్యక్తులు చాపకింద నీరులా అవినీతి, అధికార దుర్వినియోగం చేస్తూ బయట పడుతున్నారు. రాజును బట్టి రాజ్యం అన్నారు పెద్దలు. ఆ హోదాకి విలువ, ప్రజలకు రక్షణ అప్పుడే సాధ్యం. ఏ ప్రభుత్వమైన ప్రజల సంక్షేమానికి పెట్టిన పథకాలు అమలు బాధ్యత ప్రభుత్వానిదే. వాటిని సరిదిద్దేందుకు ఏదైనా సహేతుక చర్య తీసుకోవచ్చు.

-బొల్లోజు మేఘనాథ్, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి.. | ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అవగాహనే అగ్నిప్రమాదాల సమస్యకు పరిష్కారం

**ప్రభుత్వం తక్షణమే కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను ప్రవేశపెట్టి, వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. నగరంలోని అధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి. సురక్షితమైన, ధృవీకరించబడిన విద్యుత్ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పనులు అర్హత కలిగిన, శిక్షణ పొందిన నిపుణులచే మాత్రమే నిర్వహించబడేలా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలి. ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై ఒక బలమైన అవగాహన సంస్కృతిని పెంపొందించడం అత్యంత కీలకం. దీని కోసం విస్తృతమైన విద్యా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలి.**

డి. జయరాం

హైదరాబాద్ నగరంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఒక హెచ్చరిక. ఇది కేవలం ఒక దుర్ఘటనగా కొట్టిపారేయడానికి వీల్లేని ఒక భయానక వాస్తవం. పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్న మన దేశంలో, ఇలాంటి విషాదాలు మళ్లీ మళ్లీ తలెత్తుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ, ఇలాంటి ప్రమాదాలకు దారితీసే అంతర్లీన కారణాలను, వ్యవస్థాగత లోపాలను, మానవ తప్పిదాలను లోతుగా పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది. దట్టమైన జనాభాతో నిండిన మన నగరాలలో విద్యుత్ మౌలిక సదుపాయాల పరిస్థితి ఎప్పుడూ ఒక ప్రధాన సమస్యగా నిలుస్తోంది. పాతబడిపోయిన వైర్లు, ప్రమాదకర స్థాయికి చేరిన విద్యుత్ లోడ్, నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగం నిత్యం పెను ప్రమాదానికి కారణమవుతున్నాయి. నగరాలు విస్తరిస్తున్న తీరుకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థలను ఆధునీకరించడంలో మనం తీవ్రంగా వెనుకబడిపోతున్నాం. దీనిఫలితంగా ఎప్పుడు ఏ విపత్తుజరుగుతుందో అనే భయం ప్రతి నగరవాసి గుండెల్లోనూ దాగి ఉంది. ఇక అనధికారికంగా వెలసిన మురికివాడలు, అనుమతి లేని కట్టడాలలో విద్యుత్ కనెక్షన్ల పరిస్థితి మరింత దయనీయంగా, ప్రమాదకరంగా ఉంటుంది. అక్కడ నివసించే వారి జీవితాలు నిత్యం అగ్నిగుండంపైనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. విద్యుత్ వైఫల్యాలే కాకుండా, అగ్నిమాపక భద్రతా నిబంధనల పట్ల మనం చూపుతున్న నిర్లక్ష్యం, వాటిని సమర్థవంతంగా అమలు చేయడంలో ఉన్న అలసత్వం కూడా ఇలాంటి విషాదాలకు ముఖ్య కారణాలలో ఒకటి. వాణిజ్య సముదాయాలైనా, బహుళ అంతస్తుల నివాస భవనాలైనా, విద్యా సంస్థలైనా, ఆసుపత్రులైనా చాలా వరకు సరైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థలు లేకుండానే కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్నా అవి చాలా కాలంగా పనిచేయని స్థితిలో మూలకు పడివుంటాయి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు సరుకులతో నిండిపోయి ఉండటం, వాటిని తాళం వేసి ఉంచడం వంటి బాధ్యతారహితమైన చర్యలు మనకు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. అగ్నిమాపక పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, వాటి నిర్వహణపై శ్రద్ధ చూపడం అనేది చాలా చోట్ల మర్చిపోయిన విషయం. కేవలం స్వల్ప మొత్తంలో డబ్బు ఆదా చేయాలనే దురాలోచనతో భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ఇది ఎంతటి ఘోరమైన పరిణామాలకు దారితీస్తుందో మనం ఊహించలేం. మానవ ప్రవర్తన కూడా ఈ విషయంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. వంట చేసేటప్పుడు ఏమరుపాటుగా ఉండటం, మండే గుణం కలిగిన వ్యర్థ పదార్థాలను అజాగ్రత్తగా పారవేయడం, ప్రాథమిక అగ్నిమాపక భద్రతా నియమాల గురించి కనీస అవగాహన కూడా లేకపోవడం వంటివి భయంకరమైన ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఇరుకుగా ఉండే ప్రాంతాలలో ఒక చిన్న నిప్పురవ్వ కూడా క్షణాల్లో పెద్ద అగ్ని జ్వాలగా మారి ఎన్నో ప్రాణాలను బలిగొనగలదు. అగ్నిమాపక భద్రతపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించకపోవడం, పాఠశాలల్లో, కార్యా



లయాల్లో తగినంత శిక్షణ లేకపోవడం కూడా ఈ దుర్భర పరిస్థితికి ప్రధాన కారణమవుతోంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన ప్రాణాల కంటే ముఖ్యమైనది ఏదీ కాదని గుర్తెరగాలి. ఈ విషమ పరిస్థితిని చక్కదిద్దాలంటే మనం ఒక సమగ్రమైన, బహుముఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రభుత్వం తక్షణమే కఠినమైన భవన నిర్మాణ నిబంధనలను ప్రవేశపెట్టి, వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. నగరంలోని అధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి. సురక్షితమైన, ధృవీకరించబడిన విద్యుత్ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. విద్యుత్ పనులు అర్హత కలిగిన, శిక్షణ పొందిన నిపుణులచే మాత్రమే నిర్వహించబడేలా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలి. ప్రజల్లో అగ్నిమాపక భద్రతపై ఒక బలమైన అవగాహన సంస్కృతిని పెంపొందించడం అత్యంత కీలకం. దీని కోసం విస్తృతమైన విద్యా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలి. నివారణ చర్యలు తీసుకోవడం ప్రాముఖ్యతను, బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తెలియజేయాలి. భవన యజమానులు, నివాసితులు కూడా తమ వంతు బాధ్యతగా ప్రతి అంతస్తులో నాణ్యమైన పొగ గుర్తింపు యంత్రాలు ఏర్పాటు చేసుకోవడం, అందుబాటులో అగ్ని చల్లార్చే పరికరాలు ఉంచుకోవడం, స్పష్టమైనతరలింపు ప్రణాళికలు రూపొందించుకోవడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. అంతేకాకుండా, క్రమం తప్పకుండా అగ్నిమాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం కూడా చాలా అవసరం. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించినా దాని మూల్యం ప్రాణాలతో చెల్లించుకోవలసి వస్తుంది. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మండే పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో జరిగిన ఈ విషాదకరమైన సంఘటన మనందరికీ ఒక కనువిప్పు లాంటిది. అధికారులు, పాలకులు, భవన యజమానులు, సామాన్య పౌరులు ఇలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి, అగ్ని భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. ఈ దిశగా మనం తీసుకునే ప్రతి చిన్న చర్య కూడా భవిష్యత్తులో ఎన్నో అమూల్యమైన ప్రాణాలను కాపాడుతుంది. సమిష్టిగా కృషి చేస్తేనే సురక్షితమైన, మరింత నిరోధక శక్తి కలిగిన నగరాలను మనం నిర్మించగలం. ఇది కేవలం మన బాధ్యత మాత్రమే కాదు, మన భవిష్యత్తు తరాలకు మనం అందించే అత్యంత విలువైన భద్రతా వారసత్వం కూడా. ఈ విషయంలో ఇంకెంత మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నివురుగప్పిన నిప్పులా ఉన్న నగర భద్రతపై మనమందరం కలిసి పోరాడకపోతే, భవిష్యత్తులో మరిన్ని విషాదాలను చూడక తప్పదు. ఇకనైనా మేల్కొని, తగిన జాగ్రత్తలు తీసుకుందాం. మన ప్రాణాలను, మన ఆస్తులను కాపాడుకుందాం. సురక్షితమైన నగర జీవనానికి బాటలు వేద్దాం. ●

# ఉగ్రవాదం మూలాలు పెకలించాలి

సంపతి రమేష్

రాజకీయ, మతపరమైన లేదా సైద్ధాంతిక లక్ష్యాల కోసం జనాభాను లేదా ప్రభుత్వాన్ని బెదిరించడానికి హింసను సృష్టించడం ఉగ్రవాదంగా పేర్కొంటారు. ఉగ్రవాదం దేశ భద్రతకు సవాల్ విసురుతోంది. ప్రజల ఆర్థిక, సామాజిక జీవనాన్ని దెబ్బతీస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం. దేశాభివృద్ధికి విఘాతంగా మారుతుంది. మే 21, 1991లో తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్‌లో జాతీయ ఎన్నికలకు పార్టీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో ప్రసంగిస్తున్నప్పుడు ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైయ్యారు. ఆ తర్వాత భారత ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతో ఈ రోజును జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ఇది భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు అని చెప్పవచ్చు. మానవత్వం, కోసం పాటుపడేలా ప్రజలలో ఐక్యతను పెంపొందించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ శాంతి కోసం అహింస సందేశాన్ని ప్రజలకు అవగతమయ్యేలా చేయడం, యువత పెడదోవ పట్టకుండా చేయడం వంటివి ఈ దినోత్సవం ముఖ్యోద్దేశాలు. ఈ రోజున ఉగ్రవాద వ్యతిరేకంగా పోరాడిన వేలాదిమంది సైనికులు చేసినత్యాగాలను గుర్తుచేసుకోవడమే కాక వారికి నివాళుల అర్పిస్తారు. మానవత్వం శాంతి సందేశాన్ని ప్రచారం చేయడం జరుగుతుంది. ఉగ్రవాద మూలాలను వెతకాలి. భారత దేశంలో ఉగ్రవాదం ప్రధానంగా బోర్డర్ నుంచి పొంచి ఉంది. ఇది దేశవ్యాప్తంగా కూడా విస్తరించే ప్రమాదం ఉంది. మన దేశసరిహద్దు దేశాలకు మధ్య ఉన్న రాష్ట్రాలకు నిరంతరం వలసలు రావడం వలన ఉగ్రవాద ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగాచైనా, పాకిస్థాన్ సరిహద్దు రాష్ట్రాలతో మనకు ప్రమాదం ఉంది. ఇటీవల జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 28 అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పో



యారు. ఉగ్రవాద ముప్పు తొలగిపోయిందన్న నేపథ్యంలో ఈ దాడి జరగడం మరొకసారి భారతదేశాన్ని భయోందోళనలకు గురిచేసింది. దీనికి భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతిదాడి చేసింది. ఇప్పటికే భారతదేశంపై పలుమార్లు ఉగ్రదాడి జరిగింది. చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. కానీ గత కొంతకాలం నుంచి భారత్ వివిధ దేశాలతో కొనసాగిస్తున్న దౌత్య సంబంధాల నేపథ్యంలో ఉగ్రదాడి తగ్గిన సంగతి తెలిసింది. మరోవైపు భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి చాప కింద నీరులా కొనసాగుతున్న సామాజిక వివక్షత వలన అంతర్గత సంఘర్షణలు పెరుగుతున్నాయి. కులం పేరుతో విభజించి అవకాశాలు అందకుండా చేయడం కూడా ఉగ్రవాదమే. ముఖ్యంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కొన్ని వర్గాల వారికే అందడం వలన సమాజంలో అంతర్గత కలహాలు పెరిగిపోతాయి. దీంతో గతంలో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా పెరిగిపోయింది. ఇప్పటికీ అక్కడక్కడ కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణాన్ని అన్వేషించి పరిష్కరించాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉన్నాయి. కానీ ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల వద్ద ఆపరేషన్ పేరుతో అణచివేయడం వలన వామపక్ష తీవ్రవాదం అంతం కాదు. అనేక ప్రజా సంఘాల సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అతిపెద్ద జనాభా గల భారతదేశంలో అంతర్గత బహిర్గత ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం. దీన్ని నిలువరించాలంటే ప్రపంచ దేశాలతో స్నేహపూరిక దౌత్యసంబంధాలను పెంపొందించుకోవాలి. సరిహద్దు దేశాలతో ఉన్న బార్డర్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలి. ఉగ్రవాదం అంతం చేయడానికి ఆధునిక సాంకేతికతను వాడాలి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై నిఘాపెట్టాలి. ముఖ్యంగా మతోన్మాదాన్ని నివారించాలి. కులం పేరుతో కొనసాగుతున్న అణచివేతను తగ్గించాలి. అన్ని రంగాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పించాలి. ఉగ్రవాదం అంటే తుపాకిలతో కాల్చాడం. బాంబులను పేల్చడం ఉగ్రవాదం కాదు, ప్రజలను కులాలుగా, మతాలుగా విభజించడం కూడా అతి భయంకరమైన ఉగ్రవాదమే అని గుర్తెరిగి నడుచుకోవాలి. ●

# మానవహక్కుల కార్యవర్గాన్ని నియమించాలి

టేకి.సురేష్ కుమార్

ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల సంఘంలో దాదాపు14 నెలల నుంచి చైర్మన్, సభ్యుల నియామకం జరగని కారణంగా..వేలాది హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులు అపరిష్కృతంగా గత ప్రభుత్వ కాలం నుంచే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2024లో సదరు నియమకానికి దరఖాస్తులు ఆహ్వానించగా జూన్ 2024లో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం సదరు నియమకాలు పారదర్శకంగా, నిబద్ధతగా జరపాలని మరల నూతనంగా దరఖాస్తులని ఆహ్వానించి దాదాపు 6నెలలు కావస్తున్నా ఎంపిక, నియామక ప్రక్రియ జరగపోవడానికి కారణమేమిటో సామాన్య ప్రజలకు, విజ్ఞానవంతులకు, మానవ హక్కుల సంఘాల కార్యకర్తలకు అర్థం కావడం లేదు.! ప్రభుత్వం చొరవ చూపి తక్షణమే సమర్థుల్ని, సేవాభావం గల వారిని మానవహక్కుల సంఘం చైర్మన్, సభ్యులుగా నియమిస్తే బాగుంటుందని ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్.హెచ్.ఆర్.సి) మానవ హక్కుల రక్షణ కోసం ఏర్పాటు చేయబడిన ఒక చట్టబద్ధమైన సంస్థ. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993, ద్వారా ఏర్పడ్డ కేంద్ర(ఎన్.హెచ్. ఆర్. సి), రాష్ట్ర (ఎస్.హెచ్.ఆర్.సి) మానవ హక్కుల సంఘాలకు..సివిల్ న్యాయ స్థానాలకున్న అధికారాలు ఉంటాయి. ఈ కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనలను, వినతులు, విజ్ఞప్తులు, పరిశీలిస్తుంది. పరిశోధించి సంబంధిత చర్యలు తీసుకోవడానికి బాధ్యత వహిస్తుంది. ప్రజల హక్కులను రక్షించే బాధ్యత వహిస్తుంది. ఉల్లంఘనల ఫిర్యాదులను, వినతులు, విజ్ఞప్తులు స్వీకరించి వాటిని పరిశీలిస్తుంది. ఉల్లంఘనలు కన్ఫర్మ్ అయితే కమిషన్ సంబంధిత చర్యలు తీసుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను, ఇద్దరు సభ్యులని(ఎస్.హెచ్.ఆర్.సి).. ముఖ్యమంత్రి చైర్మన్గా, శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్, హోం మంత్రి, ప్రతిపక్ష నాయకుడు (లేదా అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలిచిన మరో పార్టీ నాయకుడు) సభ్యులుగా గల ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు గవర్నర్ నియమిస్తారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 నుంచి 35వ ఆర్టికల్ వరకు ప్రాథమిక హక్కుల గురించి సవివరంగా తెలియజేయబడింది. వాటినే మానవ హక్కులుగా పేర్కొనడం జరుగుతుంది. మానవ హక్కుల సంఘ పరిధి లో..బాలల హక్కులు, వయోవృద్ధుల హక్కులు, మహిళల హక్కులు, బాల కార్మికుల హక్కులు., హెచ్ఐవి/ఎయిడ్స్ (పరిరక్షణనిరోధ చట్టం)2017, ప్రజారోగ్య పరిరక్షణ చట్టం తదితర చట్టాల పరిధిలో అంశాలు కూడా పరిశీలించి తగు ఆదేశాలు ఇచ్చే అవకాశం కూడా ఈచట్ట పరిధిలో ఉంది. మానవ హక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తుంది, ఫిర్యాదులు పోస్టు, కొరియర్, ఫ్యాక్స్, ఈమెయిల్ ద్వారా పంపవచ్చు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆన్లైన్ల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర కమిషన్లో





ఆన్లైన్లో సమర్పించే సదుపాయాలు అందుబాటులోకిరాలేదు. ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత కమిషన్ వాటిని పరిశోధిస్తుంది. ఉల్లంఘనలపై సిఫారసులను చేస్తుంది. అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు ఎత్తు పెంచుతున్న సందర్భంగా మన తెలుగు రాష్ట్రాలకు నీరు అందక, రైతులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడతారని తెలుగు రాష్ట్రాల భవిష్యత్తుని ఆలోచించి నాడు బాబ్లీ ప్రాజెక్టు సందర్శనకు వెళ్ళగా మహారాష్ట్ర ప్రభుత్వాధికారుల నిరంకుశ చర్యల వల్ల దాదాపు మూడు రోజుల పాటు చాలా ఇబ్బందులకు గురి కాగా అప్పుడు రాజమండ్రికి చెందిన విశ్వశామలం సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి టి.సురేష్ కుమార్, అధ్యక్షులు కోటిలింగేశ్వరరావులు ఓ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి ఫ్యాక్స్ ద్వారా.. సమర్పించి రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదా పార్లమెంట్ సభ్యులు పై మహారాష్ట్ర ప్రభుత్వ అప్పటి పోలీసుల ప్రవర్తన పై చర్యలు తీసుకుని, రిలీఫ్ ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది. దానిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ మహా రాష్ట్ర డీజీపీకి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసి వెంటనే హైదరాబాదు చేరుకునే ఏర్పాట్లు చేయించింది.! అదే సందర్భంలో ఆ తదుపరి టిడిపి రాజ్యసభ సభ్యులు మైసూరారెడ్డి కూడా ఓ ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి నేరుగా అందించారు.! జూన్ 2014లో హిమాచల్ ప్రదేశ్‌లో ఒక విషాద సంఘటన జరిగింది. హైదరాబాద్‌కు చెందిన 24 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు థలోట్ సమీపంలోని బియాస్ నదిలో కొట్టుకుపోయారు. ముందస్తు హెచ్చరిక లేకుండా లార్జీ ఆనకట్ట నుండి అకస్మాత్తుగా నీరు విడుదల కావడంతో విద్యార్థులు కొట్టుకుపోయారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించి ప్రమాదంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం వచ్చేలా చేసింది. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థులు 8 రోజులుగా నిద్ర ఆహారాలు మాని నిరాహార దీక్షలో పాల్గొన్న సందర్భంగా వారి ఆరోగ్యం బాగా క్షీణిస్తుందనే వార్తల నేపథ్యంలో రాజమండ్రికు చెందిన సామాజిక కార్యకర్త టి.సురేష్ కుమార్.. ఫ్యాక్స్ ద్వారా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సుభాషన్ రెడ్డి గారికి ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించిన కమిషన్ దీక్షలో ఉన్నవిద్యార్థులకి వైద్య సదుపాయాలు కల్పించి, వారిని కాపాడేలా చేసింది. ఈ మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా నియామకంలో రాజకీయ పార్టీ చరిత్ర(రాజకీయపార్టీ సభ్యులుగా) ఉన్న వారిని నియమించకూడదని, అలాగే లాభదాయక పదవుల్లో ఉన్న వారు నియమింపబడకూడదని చట్టం నిర్దేశిస్తుంది.! సమర్థులు, సరైన వారు, సేవాభావం గలవారు, చైర్మన్గా, సభ్యులుగా నియామకం జరిపితే., అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణలో వారికి వెన్నుదన్నుగా ఉంటారనిప్రజల ఆశాభావం. కర్నూల్లో గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో నేటికే వేలాదిగా వినతులు, ఫిర్యాదులు గత 14 నెలలుగా చైర్మన్, సభ్యులనియామకం జరగనికారణంగా అపరిష్కృతంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్‌లు సమర్థవంతంగా ప్రజారంజక పాలన అందిస్తున్న సందర్భంగా వెంటనే మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యులు నియమించి మరింత ప్రోత్సాహం అందించాలి. ●

# వక్ఫ్ సవరణచట్టంపై 3 అంశాలపైనే విచారణ!

## అభ్యంతరం తెలిపిన కపిల్‌సిబాల్, అభిషేక్ మనుసింఘ్వి



**న్యూఢిల్లీ, మే 20:** వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసితో కూడిన ధర్మాసనం మంగళవారంనాడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా సిజెఐ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేననే భావన ఉందని, స్పష్టమైన సందర్భం వెల్లడి కానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోకూడదని అన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదన్నారు. అంతకన్నా తాము చెప్పవలసిన అవసరం లేదని చెప్పారు. వక్ఫ్‌ను స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ఉద్దేశమని పిటిషనర్ల తరఫు లాయర్ కపిల్ సిబాల్ అన్నప్పుడు సిజెఐ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ చట్టంపై గత విచారణ సందర్భంగా, మూడు అంశాలపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయడానికి వాదనలు వింటామని ధర్మాసనం పేర్కొంది. వాటిలో వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డులకు ముస్లిమేతరుల నామినేషన్, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల గుర్తింపు వంటివి ఉన్నాయి. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించమని, ఈ మూడు అంశాలపై వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోమని సుప్రీంకోర్టుకు గత విచారణలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

కాగా, మంగళవారం విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, వక్ఫ్ చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి విచారణను మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. కోర్టు గుర్తించిన మూడు అంశాలకు తాము సమాధానం దాఖలు చేశామన్నారు.

అయితే ఇప్పుడు పిటిషనర్ల లిఖిత పూర్వక సమాధానాలు ఇతర అంశాలను ప్రస్తావించాయని, విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలని కోరారు. ఇందుకు పిటిషనర్ల తరఫునహాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి అభ్యంతరం తెలిపారు. ఈ కేసును విచారించి, మధ్యంతర ఉపశమనం ఎక్కడ ఇవ్వచ్చో పరిశీలిస్తామని గత సిజెఐ (సంజీవ్ ఖాన్నా) చెప్పారని, అందువల్ల కేవలం మూడు అంశాలకే తాము పరిమితమవుతామని చెప్పలేమని అన్నారు. వక్ఫ్‌భూములను లాక్కోవడానికే చట్టం తెచ్చారని సిబాల్ వాదించారు. ఎలాంటి ప్రక్రియ లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశమన్నారు. వక్ఫ్‌ను క్రియేట్ చేయాలంటూ ఒక వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాంలో ఉండాలనే షరతును సిబాల్ ప్రస్తావించారు. నేను మరణశయ్యపై ఉండి వక్ఫ్ ఏర్పాటు చేయాలనుకుంటుంటే ముస్లింగా ఉన్నట్టు ప్రూవ్ చేసుకోవాలి. ఇది రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. ఇది ఖచ్చితంగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునే చట్టమేనని వాదించారు. సీజేఐ ఇందుకు స్పందిస్తూ, పార్లమెంటులో ఆమోదించిన చట్టానికి రాజ్యాంగబద్ధత ఉంటుందని, స్పష్టమైన సందర్భం వెల్లడికానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోలేవని అన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితిలో ఇంతకంటే తాము ఏమీ చెప్పాలనుకోవడం లేదని స్పష్టం చేశారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బైయూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీనోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీఇచ్చింది.

అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా మూడు అంశాల విషయానికి వస్తే వక్ఫ్ బై యూజర్ లేదంటే వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై ముస్లిం సంఘాల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



# గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

## తాజా దాడుల్లో 60మంది పైగా మృతి

**గాజాసిటీ, మే 20:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమాన్నిసృష్టిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్‌కు వెళ్లకుండానే మధ్యప్రాచ్య పర్యటనను ముగించిన తర్వాత ఐడీఎఫ్ తమ దాడులకు మరింత తీవ్రతరం చేసింది. గాజాలోని నివాస ప్రాంతాలు, ఆసుపత్రులపై విరుచుకుపడుతోంది. సోమవారం రాత్రి కూడా ఉత్తర గాజా, డీర్ ఆల్ బలా, ఖాన్ యూనిస్ ఇజ్రాయెల్ దళాలు తమ దాడులను కొనసాగించాయి. ఈ దాడుల్లో దాదాపు 60 మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 22 మంది, డీర్‌ఆల్ బలాపై జరిపిన దాడిలో 13 మంది, సమీపంలోని నుసెయిరాత్ శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో 15 మంది, దక్షిణ నగరమైన ఖాన్ యూనిస్‌లో జరిగిన రెండు దాడుల్లో 10 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. హమాస్‌ను అంతమొందించి ఆ ఉగ్రసంస్థ చెరలో ఉన్న బందీలను విడుదల చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ సేనలుతెలిపాయి.

మరోవైపు గాజాపోరు మొదలైనప్పటి నుంచి ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనియుల సంఖ్య 55 వేలు దాటినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి గాజాలో 3వేల మందికిపైగా మరణించారు. ఇజ్రాయెల్ ప్రధాని గాజాస్ట్రిప్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ప్రకటించారు.



మాలూరు రామస్వామి శ్రీనివాసన్ (ఫైల్)

# అణుఇంధన కమిషన్ మాజీ ఛైర్మన్ కన్నుమూత

**ఉదగమండలం, మే 20:** మాజీ అణు శాస్త్రవేత్త, అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ ఛైర్మన్ మాలూరు రామస్వామి శ్రీనివాసన్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. స్వదేశీ అణ్వాయుధ కార్యక్రమ రూపకల్పనలో డాక్టర్ హోమీ బాబాతో కలిసి శ్రీనివాసన్ పనిచేశారు. ప్రతిష్టాత్మక పద్మ విభూషణ్ పౌర పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రభుత్వం నివాళి అర్పించింది. శ్రీనివాసన్ బెంగుళూరులో జనవరి5, 1930లో జన్మించారు. సైన్స్ సబ్జెక్టుల్లో మైసూరు నుంచి ఇంటర్ చదివారు. 1950లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. 1952లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఉన్న మెక్‌గిల్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పూర్తిచేశారు.1955లో ఆయనడిఎఇలో చేరాడు. తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణానికి 1959 ఆగస్టులో డాక్టర్ శ్రీనివాస్‌ను ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా నియమించారు. దేశ అణ్వాయుధ కార్యక్రమాల రూపకల్పన అతని నాయకత్వంలో సాగింది. దేశవ్యాప్తంగా నెలకొల్పిన న్యూక్లియర్ పవంట్ ప్రాజెక్టుల ప్లానింగ్, ఆపరేషన్స్ అన్నీ చూసుకున్నారు. 1987లో అటామిక్ ఎనర్జీకమిషన్‌ఛైర్మెన్‌గా, అణు ఇంధన శాఖకార్యదర్శిగానియమితుడయ్యారు. ఆయనకు 1984లో పద్మశ్రీ, 1990లో పద్మ భూషణ్, 2015లో పద్మవిభూషణ్ అందుకున్నారు.

## ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త

# జయంత్ నార్లికర్ కన్నుమూత

**పూణె, మే 20:** ప్రముఖ ఖగోళ, శాస్త్ర సాంకేతిక శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ మంగళవారం పూణేలో కన్నుమూశారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. డాక్టర్ జయంత్ విష్ణు నార్లికర్ ప్రఖ్యాత ఖగోళ, సైన్స్ కమ్యూనికేషన్ శాస్త్రవేత్తగా ప్రసిద్ధి గాంచారు. ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం కూడా లభించింది. కుటుంబ వర్గాల సమాచారం ప్రకారం, డాక్టర్ నార్లికర్ మంగళవారం ఉదయం నిద్రలోనే మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. జులై 19, 1938న జన్మించిన డాక్టర్ నార్లికర్ తన ప్రాథమిక విద్యను బనారస్ హిందూ విశ్వవిద్యాలయర్‌లో పూర్తి చేశారు. తర్వాత ఉన్నత విద్యను కేంబ్రిడ్జ్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (1972-1989)లో చేరడానికి భారతదేశానికి తిరిగి వచ్చాడు. విష్ణు నార్లికర్ నాయకత్వంలో సైద్ధాంతిక ఖగోళ భౌతిక శాస్త్ర సమూహాన్ని విస్తరించారు. ఇది క్రమంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 1988లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డాక్టర్ నార్లికర్‌ను ప్రతిపాదిత ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌ని స్థాపించడానికి వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆహ్వానించింది.

2003లో పదవీవిరమణ చేసేవరకు ఆయన డైరెక్టర్ పదవిలో కొనసాగారు. డాక్టర్ నార్లికర్‌కు 1965లో 26 ఏళ్లకు చిన్న వయసులోనే పద్మభూషణ్ లభించడం విశేషం. 2004లో ఆయనకు పద్మవిభూషణ్ లభించింది. 2011లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారమైన మహారాష్ట్ర భూషణ్‌ను ప్రదానం చేసింది. 2014లో భారతదేశపు ప్రముఖ సాహిత్య సంస్థ సాహిత్య అకాడమీ, ప్రాంతీయ భాష (మరాఠీ) రచనలో అత్యున్నత పురస్కారానికి ఆయన ఆత్మకథను ఎంపిక చేసింది.

## వివాహేతరబంధంతో విడాకులు తీసుకున్న మహిళ

# భరణం పొందేందుకు అర్హతలేదు

## చత్తీస్‌గఢ్ హైకోర్టు సంచలన తీర్పు

**రాయ్‌పూర్, మే 20:** విడాకులు తీసుకున్న మహిళకు భరణానికి సంబంధించిన కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఓ సంచలన తీర్పును ఇచ్చింది. వివాహేతర సంబంధం కారణంగా తన మాజీ భర్త నుంచి విడాకులు తీసుకున్న మహిళ భరణం పొందటానికి అనర్హురాలని తీర్పునిచ్చింది. ఆమెకు నెలకు రూ.4,000 ఇవ్వాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. 2021లో తన భర్త ఇంటిని విడిచిపెట్టి 2019లో రాయ్‌పుర్‌లో హిందూ ఆచారాలతో వారిద్దరికీ వివాహం జరిగింది. అయితే భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారంటూ మార్చి 2021లో ఇంటిని విడిచిపెట్టి ఆమె వెళ్లిపోయారు. అనంతరం ఆమె భర్త తనతో క్రూరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రాయ్‌పుర్ ఫ్యామిలీ కోర్టులో భరణం కేసు దాఖలు చేశారు. అయితే, దీనిపై స్పందించిన భర్త, తన తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఆరోపిస్తూ భార్యతో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రశ్నించగా, తనను తప్పుడు కేసులో ఇరికిస్తానంటూ ఆమె బెదిరించిందని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే దీనిపై విచారించిన ఫ్యామిలీ కోర్టు 2023 సెప్టెంబర్ 8న భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని పేర్కొంటూ విడాకులు ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం నవంబర్ 6న భార్యకు నెలవారీ భరణం రూ.4,000 చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. అయితే దీనిపై ఆమె సంతృప్తి చెందకుండా దానిని రూ.20,000కి పెంచాలని డిమాండ్ చేశారు. చివరికి ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, భర్త తరఫున వాదించిన న్యాయవాదులు, ఆమెకు భరణం లభించదని హైకోర్టుకు తెలిపారు. తన క్లయింట్ భార్య, తన భర్త తమ్ముడితో వివాహేతర సంబంధం పెట్టుకున్నందున భరణానికి అనర్హురాలని కోర్టు ముందు చట్టబద్ధంగా నిరూపించారు. ఈక్రమంలోనే తీర్పునిచ్చిన కోర్టు, భర్తకు అనుకూలంగా విడాకులూ మంజూరు చేసింది. సెక్షన్ 125(4)లోని నిబంధనను పరిగణనలోకి తీసుకోకుండా భరణం ఉత్తర్వు జారీ చేశారంటూ భర్త తరపున న్యాయవాది తెలిపారు. భర్త తరఫు న్యాయవాది వాదనతో హైకోర్టు అంగీకరించింది. భార్య వివాహేతర సంబంధం కారణంగా ఫ్యామిలీ కోర్టు విడాకులిచ్చిన నేపథ్యంలో ఆమె భరణం పొందడానికి అనర్హురాలు అనడానికి తగిన సాక్ష్యమవుతుందని హైకోర్టు పేర్కొంది. సివిల్ కోర్టు జారీ చేసిన ఆదేశానికి విరుద్ధంగా హైకోర్టు వేరే అభిప్రాయాన్ని తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొంది. కాబట్టి ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు భార్య వివాహేతర సంబంధంలో జీవిస్తున్నట్లు స్పష్టంగా నిరూపిస్తుందని చెప్పింది. అందువల్ల ఆమె భర్త నుంచి భరణం పొందేందుకు అనర్హురాలని హైకోర్టు అభిప్రాయపడింది.



# గోల్డ్ స్మగ్లింగ్‌కేసులో నటి రన్యారావుకు బెయిల్

**బెంగళూరు, మే 20:** గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుతో పాటు తరుణ్ రాజ్ కొండూరుకు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరుచేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేకకోర్టు ఇద్దరికి షరతులతోకూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్‌ని ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని, ఇదేతరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది.

# బైడెన్‌కు కేన్సర్ సోకితే ఎందుకు రహస్యం?: ట్రంప్

**వాషింగ్టన్, మే 20:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు కేన్సర్ నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బైడెన్‌కు కేన్సర్ సోకిందనే విషయాన్ని ఆలస్యంగా బయటపెట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. విలేకరులతోమాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలుచేశారు. బైడెన్‌కు ప్రొస్టేట్ కేన్సర్ నిర్ధారణ అయినట్లు ఆయన కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ కేన్సర్‌ను గ్లీసన్ స్కోరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి అంచనా వేస్తారు. ఇందులో బైడెన్ స్కోరు 9 ఉన్నట్లు కార్యాలయం తెలిపింది.

దీనిపైనే తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. 'కేన్సర్ సోకిందన్న విషయం చాలా రోజుల తర్వాత తెలియడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. స్కోరు 9కు చేరుకోవడానికి చాలా సమయం పడుతోంది. బైడెన్ మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నారని గతంలో అదే వైద్యుడు చెప్పారు. ఇది రాజకీయమైన అంశం కాదు.. ఇది మన దేశానికి ప్రమాదం. కేన్సర్ విషయం ఇప్పటివరకు ఎందుకు బయటకు చెప్పలేదు. ప్రజలకు దీని గురించి వాస్తవాలు తెలియాలి. కొందరు వాస్తవాలు చెప్పడంలేదు. ఇది మరో పెద్ద సమస్య' అని ట్రంప్ పేర్కొన్నారు.

# పంజాబ్ మూడు చెక్‌పోస్టులవద్ద బిఎస్‌ఎఫ్ బీటింగ్ రిట్రీట్ వేడుకలు




**ఛండీఘర్, మే 20:** భారత్‌పాకిస్థాన్‌లమధ్య నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా నిలిపివేసిన బీటింగ్ రిట్రీట్ వేడుకలు మళ్లీ ప్రారంభం అయ్యాయి. మూడు జాయింట్ చెక్‌పోస్టులవద్ద కూడా కొనసాగినట్లు భారత్ ఆర్మీ తెలిపింది. పంజాబ్ ఫ్రాంటియర్‌లోని అమృత్‌సర్‌వద్ద అట్టారి, ఫిరోజ్‌పూర్‌లోని హుస్సేనీవాలా, ఫజిల్లాలోని సాద్‌కీ వద్ద ఈబీటింగ్ రిట్రీట్ వేడుకలు కేవలం మీడియా సిబ్బందికోసం నిర్వహించారు. ఇక సాధారణ ప్రజానీకం కూడా సందర్శించేందుకు ఈనెల 21వతేదీనుంచి అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కారణంగా బిఎస్‌ఎఫ్ అట్టారి సరిహద్దువద్ద ఈ బీటింగ్ వేడుకను నిలిపివేసింది. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత రెండుదేశాలమధ్య అత్యంత తీవ్రస్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుకలో బిఎస్‌ఎఫ్‌దళాలు పాకిస్తాన్ రేంజర్స్‌తో కరచాలనంచేయడం కానీ, ఇరువైపులా గేట్లు తెరవడం కానీ, పతాకాలను అవనతం చేయడం కానీ ఉండవని బిఎస్‌ఎఫ్ తెలిపింది. ప్రజాబాహుళ్యం లేకుండానే జెండాలను అవనతంచేస్తారు. ఈనెల 8వ తేదీనుంచి బిఎస్‌ఎఫ్ ఈ మూడు జాయింట్ చెక్‌పోస్టులవద్ద ప్రజల సందర్శనను రద్దుచేసింది. పంజాబ్ కేబినెట్‌మంత్రి కులదీనప్‌సింగ్ ధలివాల్ షాపూర్ సరిహద్దుపోస్టును సందర్శించి అజ్నాలావద్ద బిఎస్‌ఎఫ్ అధికారులు, సిబ్బందిని కలిసి చర్చలుజరిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వారిపొలాల్లో పనులుచేసుకునేందుకు అనుమతించాలని కోరారు.

# ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్షం

## టిఎంసి ఎంపి యూసఫ్ పఠాన్ స్థానంలో అభిషేక్ బెనర్జీ



**కోల్‌కతా, మే 20:** ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాలు విదేశాలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అందులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బహంపుర్‌కు ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్న యూసఫ్ పఠాన్‌ను కేంద్రం ఎంపిక చేయడాన్ని ఆ పార్టీ తప్పుబట్టడంతో ఆయన ఈ బృందం నుంచి తప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో యూసఫ్ స్థానంలో పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ఆ పార్టీ ఎంపిక చేసింది. దీనిపై టిఎంసి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో తమ పార్టీ తరఫున అభిషేక్‌ను ఎంపిక చేయడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బెంగాల్ దృఢ వైఖరిని ఆయన ప్రతిబింబించడమే కాకుండా.. ప్రపంచ దేశాల్లో భారత ప్రజల సమష్టి స్వరాన్ని వినిపిస్తారని తెలిపింది.

ప్రతినిధి బృందంలో యూసఫ్ పేరును చేర్చడంపై అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, దేశాన్ని రక్షించడం వంటి జాతీయ భద్రత విషయాలపై తమ పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తుందని.. కానీ, తమను సంప్రదించకుండా పఠాన్‌ను దౌత్యబృందంలో చేర్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒక పార్టీ ఎంపిని ఎంపిక చేసేటప్పుడు ఆ పార్టీతో సంప్రదింపులు జరపాలని కేంద్రానికి సూచించారు. ఈ వ్యాఖ్యలు చేసిన మరునాడే ఆయన పేరును పార్టీ తరఫున బృందంలో చేర్చడం గమనార్హం. పహల్గాం ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించింది.

ఇందులో భాగంగా 51 మంది నేతలు 7 బృందాలుగా విదేశాల్లో పర్యటించనున్నారు. ఈ బృందాల్లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, మాజీ ఎంపిలు, మంత్రులు దౌత్యవేత్తలు ఉన్నారు. ఒక్కో బృందంలో ఒక ముస్లిం నేతగాని, అధికారిగానీ ఉండేలా చర్యలు తీసుకున్నారు. 51 మందిలో 31 మంది ఎన్డీయే నేతలు, 20 మంది ఎన్డీయేతర పార్టీల నేతలున్నారు. 'ఒకే లక్ష్యం..ఒకే సందేశం.. ఒకే భారత్' పేరుతో ఈ పర్యటనలు సాగనున్నాయి.

# సాయం అందకపోతే గాజాలో 14వేల మంది చిన్నారులు మృత్యువాత

## ఐక్యరాజ్యసమితి మానవతాసాయం విభాగం హెచ్చరిక

**గాజాసిటీ, మే 20:** ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో పరిస్థితులు పూర్తి అధ్వాన్నస్థితికి చేరుకున్నాయి. ప్రజలజీవనంఅస్తవ్యస్థంగా మారింది. ఇప్పటికే గాజాను అన్నివైపులా నిర్బంధించిన ఇజ్రాయెల్‌పరిమిత స్థాయిలో మాత్రమే మానవతా సాయానికిఅనుమతిస్తోంది. ఆ ప్రాంతంలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఈపరిస్థితిపై స్పందించిన ఐక్యరాజ్యసమితి మానవతాసాయం విభాగం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది.సాయం ఇలాగే కొనసాగితే మరో రెండురోజుల్లో 14 వేల మంది చిన్నారులు మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 11 వారాలక్రితం పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్‌నిర్బంధించింది. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, యుకె ఒత్తిడిచేయడంతో పరిమితస్థాయిలో గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ అనుమతిస్తోంది. చిన్నారులతో సహా గాజావాసులకు ఇటీవల ఐదు ట్రక్కుల మానవతా సాయం మాత్రమే అందింది. వారికి మరింత సాయం అవసరమని లేదంటే 48 గంటల్లో 14 వేలమంది చిన్నారులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. అక్కడున్న చిన్నపిల్లలు, తల్లులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సమితిప్రతినిధి టామ్ ఫ్లెచర్ హెచ్చరించారు.

మానవతాసాయం విషయంలో ఇజ్రాయెల్ తీరును బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు తీవ్రంగా ఖండించాయి. గాజాకు మానవతా సాయంపై ఆంక్షలు వెనక్కితీసుకోకపోతే తామంతా ఉమ్మడి కార్యాచరణ తీసుకుంటామని హెచ్చరించాయి. తాజాగా ఇజ్రాయెల్ తీరుపై ఐక్యరాజ్య సమితికూడా స్పందించింది. పోషకాహారంతో కూడిన 100 ట్రక్కులసాయాన్ని గాజాలోకి అనుమతించాలని, చిన్నారుల ప్రాణాలు రక్షించాలని సూచించింది.

# ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 20:** ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్‌కుమార్ డేకా పదవీకాలం మరో ఏడాది పాటు పొడిగించారు. జూన్ 2026 వరకూ ఆయన డైరెక్టర్‌గా కొనసాగుతారని వ్యక్తిత్వ వికాసం, నియామకాల మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. 1988 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్‌కేడర్ ఐపిఎస్ అధికారి అయిన డేకా రెండేళ్ల కాలం పాటు పనిచేసేందుకు ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2022 జూన్‌నుంచి ఆయన ఈ పదవిలో ఉన్నారు. అంతకుముందు కూడా ఆయన ఏడాది కాలం పాటు అంటే2024 జూన్‌వరకూ పదవీకాలం పొడిగించారు. కేబినెట్ నియామకాల కమిటీ తపన్‌కుమార్ పదవీకాలం పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. 2025 జూన్ 30 నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన పదవీకాలం ఉంటుందని నియామకాలకమిటీ ఆమోదం తెలిపింది. ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రకార్యకలాపాలు తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్న కాలంలోఆయన జాయింట్ డైరెక్టర్‌గా కొనసాగారు. పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ దాడి, 2019 పుల్వామా దాడిలపైనా ఆయన నిఘా కార్యకలాపాలు కొనసాగించి సమగ్ర నివేదికలు ఇచ్చారు. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదం, లోయలో జరుపుతున్న హత్యలపైనా ఆయనసమగ్ర నివేదికలు రూపొందించి కేంద్రాన్ని అప్రమత్తంచేసారు.

# అధికారులూ.. దుబారాకు చెక్ పెట్టండి..

## మద్యం, సిగరెట్ కట్ : చైనా ఆదేశం



**బీజింగ్, మే 20:** మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులో భాగంగా ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశించింది. ప్రయాణాలు, మద్యం, సిగరెట్‌ఖర్చులు తగ్గించుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వం ళ్లోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా అక్కడి ప్రభుత్వ అధికారులతో పాటు, అధికార పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం ప్రయాణాలు, మద్యం, సిగరెట్, ఆహారం, కార్యాలయాల అద్దెలు వంటివి తగ్గించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ వనరులను ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరింది. దుబారాను తగ్గించాలని పేర్కొంది. ఈ దుబారా ఖర్చులు చేయడాన్ని సిగ్గుచేటుచర్యగా ప్రభుత్వం అభివర్ణించింది. ఇటీవల కాలంలో స్థిరాస్తి విక్రయాలకు సంబంధించిన ఆదాయం విషయంలో చైనా నష్టాలను చూస్తోంది. అంతేకాక స్థానిక ప్రభుత్వాలపై అప్పుల భారం కూడా పెరిగిపోయింది. ఈ క్రమంలో అధికారులు చేసే ఖర్చులతో ఒత్తిడి పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. స్థానిక ప్రభుత్వాల ఆర్థికవృద్ధిని మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా అక్కడి అధికారులను ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించింది.

# ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు..

## ఆ మార్గంలో చిక్కుకుపోయిన యాత్రికులు!

**డెహ్రాడూన్, మే 20:** ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్-మానసరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగిపడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితోపాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని సూచించారు. అయిదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్ మానస సరోవర్ యాత్రను ఈ యేడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. 50 మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి 10 బృందాలు సిక్కిం నాథులాపాస్ నుంచి ఈయాత్రకు తరలి వెళ్తాయి అని వెల్లడించింది.

యాత్ర కోసం దరఖాస్తులను కంప్యూటర్ జనరేటెడ్‌విధానంఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది. కొవిడ్ కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్ర 2020లో ఆగిపోయింది. గతేడాది రష్యాలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే చర్యలు మొదలయ్యాయి. ఈక్రమంలోనే కైలాస్ మానస సరోవర్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నారు.

# తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకోవాలి

## - సమ్మెకు దిగిన ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

**గాజువాక,మే 20,ప్రభాతవార్త:** ఉక్కులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధులలోకి తీసుకోవాలని,ఉక్కు ప్రైవేటీకరణ ను ఆపాలంటూ విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెతో పాటు భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఉదయం 6 గంటల షిఫ్టు కార్మికులు హాజరు కాలేదు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ హెచ్ఓడి డిపార్ట్మెంట్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్య మాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్లో అఖిల పక్ష కార్మిక సంఘాల పిలుపుమేరకు జరిగిన సమ్మెలో సమ్మెతో చావో రేవో తేల్చు కోవాలని తెగబడిన కార్మిక సంఘాల నేతలను అదుపు చేసేందుకు పోలీసులు భారీగా మోహరించారు. ఉక్కు లోకి అడ్డదారిలో హాజరవుతున్న కార్మికులను అడ్డు కుంటున్నారన్న సాకుతో నలుగురు కాంట్రాక్టర్ కార్మిక సంఘాల నేతలను స్టీల్ ప్లాంట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జోరు వానలో సైతం కార్మికులు లెక్క చేయకుండా సమ్మెలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ముఖద్వారం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 1559వ రోజుకు చేరాయి. సమ్మె కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గాజువాక సౌత్ సబ్ డివిజన్ పోలీసులు భారీగా మోహరించారు. స్టీల్ ప్లాంట్ బి.సి గేటు, మెయిన్ గేటుల వద్ద భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అ ఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్య నిరంకుశ వైఖరి పై మండి పడ్డారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా దుయ్యపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీ కరణ నుంచి కాపాడుకోవడం కార్మికుల జీవన్మరణ సమస్యగా మారిం దన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశానికి ఆదాయాన్నిస్తూ లాభాలు అందిస్తుందని అందుకే ఈ ప్లాంట్ ను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తుందని మండిపడ్డారు. దేశంలోని అన్నికార్మికసంఘాల ఐక్యతతో ఉద్యమాన్నిఉదృతం చేస్తామని, పాలకుల నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మిక పోరాటం సాగుతుందన్నారు. జీవనోపాధిని మింగేస్తూ ఆర్థిక ఇబ్బందులను సృష్టించి కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలకు ప్రభుత్వ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు.

# జగ్గయ్యపేట-నందిగామ ఇండస్ట్రియల్ క్లస్టర్ కాబోతోంది -మినీ మహానాడులో నేతల జోష్

## - అభివృద్ధిపై ఎలుగెత్తిన ఎంపి చిన్ని, ఎమ్మెల్యే రాజగోపాల్



మినీనాడు సభలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన నెట్టెం రఘురామ్‌ను ఘనంగా సన్మానిస్తున్న ఎంపి కేశినేని చిన్ని, ఎంఎల్ఏ రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

**జగ్గయ్యపేట, మే 20, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు నియోజకవర్గాలు జగ్గయ్యపేట-నందిగామ ఇండస్ట్రియల్ క్లస్టర్ కాబోతోందని, వైకుంఠాపురం-అమరవతి మధ్య కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణంతో రాజధానికి రోడ్డుమార్గంలో నందిగామ, జగ్గయ్యపేట దగ్గరవుతాయని పలువురు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్ఘాటించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని విజయవాడ రోడ్‌లోగల శుభమస్తు వేడుకల మందిర ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాధ్ (చిన్ని), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ పరిశీలకులు దొంతు చిన్నా, స్థానిక నాయకులు మేకా వెంకటేశ్వర్లు, కన్నెబోయిన రామలక్ష్మి ఠ్ర, ముల్లంగి రామకృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి ఠ్ర, కళావతి, అన్వర్, రాణి, జి సుధీర్‌బాబు, జి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి నెట్టెం రఘురామ్ పుట్టిన రోజు సందర్భంగా మినీమహానాడు సభలో భారీ కేక్‌కట్‌చేసి నేతలు, కార్యకర్తలు పంచిపెట్టారు. రఘురామ్ సమర్థత, నాయకత్వ పటిమ గురించి పలువురు నాయకులు శ్లాఘించారు. మినీమహానడు, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న ఎంపి చిన్ని మాట్లాడుతూ పోలంపల్లి ఎత్తిపోతల పథకం, కంచల వేదాద్రి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి అడ్డువున్న సమస్యలు తొలగి రెండు నెలల్లో బడ్జెట్ విడుదల అవుతుందని, త్వరలో జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు అవుతుం దని ఇందుకు సంబం ధించి డిపిఆర్ కూడా సిద్ధమైందని శుభ వార్త తెలిపారు. పలు పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పనలు చేసేందుకు నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో రెండు వేల ఎకరాలకు సర్వే చేయటం జరిగిందని త్వరలో పెద్ద ఇండస్ట్రియల్ పార్కు రాబోతోందని అన్నారు. కొత్తగా పార్టీ కమిటీలకు ఎన్నికైన కార్యవర్గ నాయకులను, ఆయా కమిటీలను ఎంపి అభినందించారు. కాగా రఘురామ్ జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం అన్నక్యాంటీన్‌లో పేదలు, కార్మికులకు వితరణగా భోజనాలు వడ్డించారు. నేతలు స్థానిక జెడ్‌పి హైస్కూలులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ విక్షణా శిబిరాన్ని సందర్శించి క్రీడాకారులకు అవసరమైన కనీస సదుపాయాలు, వసతులు లేవని గ్రహించి వాటిని త్వరలోనే కల్పిస్తామని ఎంపి చిన్ని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి పద్మావతి నగర్‌లోని చెత్తడంపింగ్ యార్డును ఎంపి, ఎమ్మెల్యే సందర్శించారు. సిఎస్ఆర్ నిధులతో రెండు నెలల్లో డంపింగ్ యార్డును ఆధునాతనంగాతీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని ఎంపి హామీ ఇచ్చారు. విజయవాడ రోడ్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ఏర్పాటుకు జరుగుతన్న పనులను పరిశీలించారు.

# పిడుగుపాటుకు తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు

**శ్రీకాకుళం, మే 20 (ప్రభాతవార్త ప్రతినిధి ) :** జిల్లా కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. బలగ బుచ్చిపేట గ్రామానికి చెందిన గేదెల రాజారావు, ఆయన కుమారుడు నాగావళి నది తీరాన ఉండగా పిడుగుపాటుకు గురయ్యారు. ఈ దుర్ఘటనలో తండ్రి రాజారావు అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు నాగర్జునకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి నాగార్జునను మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# కరెంటు స్తంభం కూలడంతో వ్యక్తి మృతి

**కావలి (నెల్లూరు), మే 20, ప్రభాతవార్త :** కావలి పట్టణ ఉదయగిరి రోడ్డులో కరెంటుస్తంభం కూలడంతో మద్దెల వెంకటేష్(32) మంగళవారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయగిరి రోడ్డులో సుబ్బారావు చికెన్‌పకోడి బండికి నీడ కల్పించేందుకు ఆయన స్నేహితుడు మద్దెల వెంకటేష్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ఉన్న కరెంటు స్తంభానికి పట్ట కడుతుండగా సపోర్ట్‌గా ఉన్న మరోస్తంభం వెంకటేష్‌పై కూలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కావలి బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన బైక్ మెకానిక్ మద్దెల వెంకటేష్‌కు భార్య మౌనిక, కూతురు, కొడుకు ఉన్నారు. దీంతో ఈ పేద కుటుంబం



రోడ్డున పడింది. ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంఘటన ప్రదేశాన్ని టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు, పోలీసులు సందర్శించారు. టిడిపి నేతలు కూడా పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయంను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



డ్యాం ప్లంజుపుల్‌ను పరిశీలిస్తున్న బృందం

**శ్రీశైలంప్రాజెక్టు,మే20,ప్రభాతవార్త** శ్రీశైలం జలాశయంను పరిశీలించేందుకు మంగళవారం నాడు పూణే నుండి సి.డబ్ల్యూ.పి. ఆర్.ఎస్.కు చెందిన హనుమాన్‌రఫాయ్, సన్‌జయ్ అబురిల్,మహేశ్వర్‌సింగ్ బిస్తా,జి.డి.నాయుడు, సునిల్ జైపాల్ అను 6 మంది శాస్త్రవేత్తల బృందం డ్యాం వద్దకు చేరుకున్నారు.వీరికి శ్రీశైలం డ్యాం ఎస్.ఈ శ్రీరామచంద్రమూర్తి స్వాగతం పలికారు.తదుపరి బృందం సభ్యులు డ్యాం వ్యూపాయింటు వద్ద పవర్ పాయింటు ప్రజెంటేషన్ ద్వారా వివరాలను అడిగి తెలుసున్నారు. తదుపరి డ్యాం ప్లంజుపూల్‌కు సమీపంలోకి చేరుకొని క్షేత్రస్థాయిలో ఆధ్యయనం చేసారు.శ్రీశైలం డ్యాంకు పడిన ప్లంజుపుల్ గుంతపై గత మాసంలో డ్యాం సేఫ్టీ బృందం ఎన్.డి.ఎస్.ఏ చైర్మన్ అనిల్‌జైన్(న్యూడిల్లి)వారు శ్రీశైలం డ్యాం సిఈ కబిర్‌బాషా నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది.ఈ క్రమంలోనే శ్రీశైలం డ్యాంకు పొంచిఉన్నా ప్రమాదం,ఏర్పడిన ప్లంజుపుల్ గుంతపై ఆధ్యయనం చేస్తున్న అధికారులు పలు నివేదికలను ప్రభుత్వంకు అందజేయడం జరిగింది.డ్యాంకు నిపుణులు సూచించిన మేరకు మరమత్తు పనులను చేపట్టేందుకు ఇప్పటికే ఏపి ప్రభుత్వం జాతీయ డ్యాం సేఫ్టి అధారిటీ హెచ్చరికలతో శ్రీశైలం రక్షణ పనులకు టెండర్ల ఉత్తరు ్వలు జారి చేస్తూ రూ.25.65 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారి చేయడం జరిగింది.

# ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతనేని రత్నకుమార్ హఠాన్మరణం



**జగ్గయ్యపేట, మే 20, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన పర్వతనేని రత్నకుమార్ (65) మంగళవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ బస్సుల నిర్వహణలో నాలుగు దశాబ్దాలకు పైగా వ్యాపారంలో పేరు పొందిన రత్నకుమార్ జిల్లాలోని పలు ప్రాంతాల వారికి సుపరిచితులు. ఆయన సోదరి హనుమంతు రత్నకుమారి జగ్గయ్యపేట నగర పంచాయితీ తొలి చైర్‌పర్సన్‌గా రెండు దశాబ్దాల క్రితం పట్టణాన్ని పరిపాలించారు. కాగా రత్నకుమార్ మరణం పట్ల జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పలువురు ప్రముఖులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియపర్చారు.

# బేబీ కిట్ల పంపిణీ పునరుద్ధరణ - రూ.51 కోట్లు మంజూరు




**విజయవాడ,మే 20,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ పథకాన్ని పునరుద్దరిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో అర్ధంతరంగా నిలిపివేసిన ఈ పథకం కోసం రూ.51.14 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పేర్కొన్నారు. ఒక్కో కిట్‌కు రూ.1,410 వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఈ పథకం పునరుద్దరణ ద్వారా సుమారు 4 లక్షల మంది తల్లులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కిట్‌లో 11 వస్తువులు...దోమతెర,బేబీ బెడ్,డ్రెస్,టవల్స్,వాషబుల్ న్యాప్‌కిన్స్,200 గ్రాముల ఫౌడర్(జాన్సన్),100 గ్రాముల షాంపు (జాన్సన్) ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రిలో జన్మించే ప్రతి శిశువుకూ ఉపయోగపడే వస్తువులతో ఉండే ఈ కిట్లను తల్లులకు పంపిణీ చేయడాన్ని 2016 జులై 1న టిడిపి ప్రభుత్వం ప్రారంభించింది. దీనిని వైకాపా ప్రభుత్వం 2021లో నిలిపేసింది.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న గర్భిణులకు ఈ ఎన్టీఆర్ బేబీ కిట్లను అందించనున్నారు. ఈ బేబీ కిట్‌లో మొత్తం 11 రకాల వస్తువులు ఉంటాయి. దోమల నుంచి రక్షణకు ఒక దోమ తెరతో కూడిన బెడ్, దోమతెర, రెండేసి టవల్స్, డ్రెస్సులు, ఉతుక్కోవడానికి వీలుగా ఉండే న్యాప్‌కిన్లు, జాన్సన్ కంపెనీకి చెందిన 200 గ్రాముల బేబీ పౌడర్ ఒకటి, 100 ఎంఎల్ ఒక షాంపూ (జాన్సన్), 200 ఎంఎల్ నూనె, 2 సబ్బులు, సబ్బు బాక్సు, గిలకను ఈ కిట్‌తో పాటు ఇస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవానికి వచ్చి డిశ్చార్జి అయ్యే సమయంలో తల్లులకు ఫ్రీగా ఈ కిట్లను అందించనున్నారు. ఈ కిట్లను పంపిణీ చేయడాన్ని తొలుత 2016 జులై 1వ తేదీన నాటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. తరువాత వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం 2021లో నిలిపేసింది. ఆగిన పథకాన్ని తాజాగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిధులు సైతం విడుదల చేశారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి

**బిట్రగుంట (నెల్లూరు), మే 20, ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని కొడవలూరు పడుగుపాడు రైల్వే స్టేషన్ ల మధ్య దిగువ లైన్ లో కె ఎమ్.నెం 184/28 -30 పోస్టుల మధ్య గుర్తు తెలియని సుమారు 40-45 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి రైలు కింద పడి మరణించడం జరిగిందని రైల్వే పోలీస్ లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కాషాయం రంగు నిండు చేతుల చొక్కా, పసుపు, మెరూన్ రంగుల లుంగీ ధరించి ఉన్నాడని, సదరు వ్యక్తి పొట్టపై నిలువుగా గతంలో చేయబడిన ఆపరేషన్ మార్క్ ఉందన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తరలించి కేసును కావలి జీఆర్‌పి ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు కావలి జీఆర్‌పి పోలీసులను సంప్రదించాలని కోరారు..



మాడపాటి అతిథి గృహం రికార్డులు పరిశీలిస్తున్న ఇఓ

# విజయవాడ - కర్నూలు నూతన విమాన సర్వీసులకు శ్రీకారం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం , మే 20 ( ప్రభాతవార్త ప్రతినిధి ) :** జూలై 2వ తేదీ నుంచి విజయవాడ కర్నూలు విజయవాడ మధ్య నూతన ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు . ప్రతి సోమవారం, బుధవారం , శుక్రవారం ఈ విమానాలు నడుపబోతున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అమరావతిని రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలును అనుసంధానం చేస్తూ ఈ కొత్త మార్గం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ ప్రయాణ అవసరాలను తీర్చడమే కాకుండా, అంతర్ రాష్ట్ర విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించామని, రాష్ట్ర ప్రజలకు విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. విద్య, వ్యాపారం, ప్రభుత్వ అవసరాల నిమిత్తం ప్రాంతీయంగా ప్రయాణించే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు.

# విశాఖ నగర డిప్యూటీ మేయరుగా దల్లి గోవిందరాజు

## - విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్‌అశోక్

**విశాఖపట్నం మే 20, ప్రభాతవార్త** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా కార్పోరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారని విశాఖ జాయింట్ కలెక్టర్, అదనపు మెజిస్ట్రేట్, ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మాట్లాడుతూ మే 19వ తేదీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం జివిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో సభ్యులు సమావేశం అయినప్పటికీ క్వారమ్ లేకపోవడం వలన డిప్యూటీ మేయర్ ఎన్నిక మే 20వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు వాయిదా వేసామని తెలిపారు. 20వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశ మందిరం లో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిప్యూటీ మేయర్ ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం జీవీఎంసీ మేయర్ ఎన్నికలకు సంబంధించి కూటమి అభ్యర్థిగా బిఫారమ్ టికెట్ 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు సమర్పించారని, దల్లి గోవిందరాజు ను డిప్యూటీ మేయరు అభ్యర్థిగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు) ప్రతిపాదించగా, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు బలపరిచారని, ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు మొత్తం 59 మంది హాజరు కాగా డిప్యూటీ మేయర్ ఎన్నికకు సరిపోయిన క్వారమ్ ఉన్నందున మరో అభ్యర్థి పోటీలో లేనందున డిప్యూటీ మేయర్ గా దల్లి గోవిందరాజు ఎన్నికైనట్లు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయరు గా దల్లి గోవిందరాజు చే ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి ప్రమాణా స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కూటమి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామక్రిష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీ క్రిష్ణ శ్రీనివాస్ యాదవ్, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కార్పొరేటర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, అధికారులు, సిబ్బంది నూతన డిప్యూటీ మేయర్ కు పుష్ప గుచ్ఛాలు అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



**శ్రీశైలంప్రాజెకు,మే20,ప్రభాతవార్త** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంను మంగళవారంనాడు ఏపి హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ వారు కుటుంబ సమేతంగా శ్రీశైలం మల్లన్న దర్శనార్ధం శ్రీశైలంకు చేరుకున్నారు.వారికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ ఎం.శ్రీనివాసరావు,ఆలయ ఆదికారులు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయదేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండింతులు వేధాశీర్వచనములు వల్లించగా,అర్చకస్వాములు తీర్ధప్రసాదములు అందజేసారు.తదుపరి ఆలయ అధికారులు శ్రీస్వామివారి శేషవస్త్రములతో సత్కరించి,లడ్డు ప్రసాదములను అందజేసారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంతో భహుకరించారు.

# 22నహనుమజ్జయంతి ప్రత్యేక పూజలు

**ఇంద్రకీలాద్రి, మే 20, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. మెట్లమార్గంలోని క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ ఆంజేయస్వామివారికి అభిషేకాదులు, నాగవల్లీ దళార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు పాల్గొన్నారన్నారు. దుర్గమ్మను దర్శించుకోడానికి వచ్చే భక్తులు విడిది చేయడానికి వీలుగా మాడపాటి అతిథి గృహంలో సౌకర్యాలు పెంచాలని ఇఓ వికె శీనా నాయక్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన మాడపాటి అతిథి గృహం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిన్న పాటి రిపేర్లు వెంటనే చేయాలన్నారు. రిజర్వేషన్ విధానం పరిశీలించారు. అనంతరం గుణదలలోని దేవస్థానం స్టాఫ్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అక్కడ ఎన్ని నివాసాలున్నాయి, సిబ్బంది ఎంతమంది నివాసముంటున్నారని తెలుసుకున్నారు. ఖరీదైన ఈ ఆలయభూమి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బంగారం గొలుసు దొంగలను పట్టుకొన్న పోలీసులు

## - మత్తు పదార్థాల విక్రేతలపై ఉక్కుపాదం

**చౌడేపల్లి (చిత్తూరు జిల్లా), మే 20 ప్రభాతవార్త** మహిళల మెడలో బంగారం గొలుసులు అపహరించే గరుడుకట్టిన నేరస్తులను పోలీసులు పన్నాగం పన్ని మరీ పట్టుకొన్నారు. దీంతో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ వారికి రివార్డులందించారు. నిందితులను కోర్టుకు తరలించారు. డీఎస్పీ డేగల ప్రభాకర్ కథనం మేరకు...అంతర్ జిల్లాల్లోని బంగారం గొలుసులు ధరించిన మహిళలను లక్ష్యాలుగా చేసుకొన్న ఇద్దరు వ్యక్తులు వారి మెడలోంచి గొలుసులను అపహరిస్తూ వున్నారు. అన్నమయ్య జిల్లాలోని గాలీవీడు, పెద్దమండెం, చిన్నమండెం, నిమ్మనపల్లి, చిత్తూరు జిల్లాలోని సోమల, గంగవరం మండలాల్లో గత 3నెలలుగా మహిళల మెడల్లోంచి బంగారం గొలుసులు అపహరణకు గురవుతున్నాయి. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పుంగనూరు రూరల్(చౌడేపల్లి) సిఐ రాంభూపాల్ పర్యవేక్షణలో సోమల ఎస్ఐ శివశంకర్, పలమనేరు ఐడి పార్టీ ఎఎస్ఐ శ్రీనివాసులు, యల్లప్ప, అల్లావుద్దీన్, శశిధర్‌లు రంగంలో దిగారు. అనతి కాలంలోనే కేసు ఛేధించారు.

# అనంతపురం అర్బన్ మినీ మహానాడులో గందరగోళం

## టిడిపి ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేశులు ఆత్మహత్యాయత్నం

**అనంతపురం, మే 20, (ప్రభాత వార్త బ్యూరో)** అనంతపురం అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. స్థానిక ఎం వై ఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం అనంతపురం అర్బన్ నియోజకవర్గం మినీ మహానాడు కార్యక్రమంలో అనంతపురం నగర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశులు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఇతర నాయకులు సమావేశానికి హాజరయ్యారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నోసార్లు ఎమ్మెల్యేలు కలిసినా ఎమ్మెల్యే తనను పట్టించుకోలేదని కారణంతో వెంకటేశులు సమావేశం మధ్యలోనే పురుగుమందు సేవించడం నాయకులు కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. వెంకటేశులు ను వెంటనే టిడిపి కార్యకర్తలు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స నిర్వహించారు.అనంతపురం నగరంలోని కమ్మ భవన్ లో జరిగిన అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడులో ఆత్మహత్యాయత్నం చేసిన టిడిపి కార్యకర్త వెంకటేష్ ను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరామర్శించారు. ఎస్సీ సెల్ విభాగానికి చెందిన వెంకటేష్ క్షణికావేశంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నట్లు,అక్కడ ప్రాథమిక చికిత్సలు అనంతరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు టిడిపి వర్గాలు చెబుతున్నా యి .అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మినీ మహానాడు కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ప్రభుత్వాసుపత్రికి, అలాగే సవేరా ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్ ను పరామర్శించారు. ఎందుకు ఈ సంఘటన జరిగిందన్న వివరాలు ఆరా తీశారు. అలాగే వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి గురించి కూడా వైద్యులునడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

# కళ్యాణదుర్గం సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా

## ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



**కళ్యాణదుర్గం, మే 20 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కార్యకర్తలు ప్రజలు తనపై ఎంతో నమ్మకం ఉంచి కళ్యాణదుర్గం అభివృద్ధి కోరుతూ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలని ప్రజలందరి రుణం తీర్చుకునేలా కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని, పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త తలెత్తుకొని తిరిగేలా పాటుపడతానని, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ప్రజా వేదికలో నిర్వహించిన మినీ మహానాడుకు కళ్యాణ్ దుర్గం రూరల్ మండల అధ్యక్షులు గోళ్ళ వెంకటేశులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం నియోజకవర్గం అయిన కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే పథకాన్ని హామీ ఇచ్చిన మేరకు రెండు వందల శాతం పూర్తి చేస్తానని హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ప్రతిపక్షాల విమర్శలకు తాను వెనుకడుగు వేసేది లేదని ఇచ్చిన మాట నెలివేచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా తిమ్మసముద్రం వద్ద 1110 ఎకరాల ఏపీఐఐసీ ప్రభుత్వ భూమిలో పరిశ్రమల స్థాపనకు ఇటీవల శంకుస్థాపన చేశానని 35 కోట్లతో టమోటా మామిడి ప్రాసెసింగ్ యూనిట్లతో అభివృద్ధికి బాటలో వేయనున్నట్లు తెలిపారు. మిల్ట్రీ ఇండస్ట్రీ కూడా రాబోతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా చిన్నచిన్న కుటీర పరిశ్రమలతో మొదలుకొని మధ్యతరగతి పరీక్షల దాకా గ్రామీణ యువతరం విద్యావంతులు యువ పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పించేందుకు కూడా ఆహ్వానిస్తున్నామని, ఇలాంటి వారికి అవసరమైన ప్రోత్సాహ సహాయం అందజేస్తామని తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని ఇప్పటికే గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పలు రోడ్లను జిల్లా కలెక్టర్ ద్వారా మంజూరు చేయించి పనులు పరమయ్యాయని మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి రోడ్డును అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. కంబదూరు పేరూరు రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగడంతో టెండర్లు రద్దు అయ్యే సందర్భంలో కాంట్రాక్టర్ సుమారు ఐదు కోట్ల నష్టం వస్తుందని పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఒప్పించి నష్టాల్లో తాను కూడా పాలు పంచుకుంటానని భరోసా ఇచ్చి రోడ్డు పనిని ప్రారంభించిన విషయాన్ని హర్షధ్వనాల మధ్య వివరించారు. కరువు జిల్లా అనంతపురంలో స్వచ్ఛంద సంస్థ ఆర్డిటి పేదలకు వరమని ఆ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎస్ సి ఆర్ ఏ నిధుల మంజూరును నిలిపివేసిన సంఘటనకు గత సంవత్సరమే స్పందించి కేంద్ర హోం మంత్రి అమిస్తా దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చేసిన కృషిని వివరించారు.

# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

## - హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ,మే20,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. దక్షిణ కోస్తా,సీమ మీదుగా నైరుతి,బంగాళాఖాతం, ఆగ్నేయ బంగాళాఖాతం లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్ర,రాయలసీమ మీదూ ఆవరించి ఉంది.

దీని ప్రభావంతో రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది,. దక్షిణకోస్తా,రాయలసీమ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు,కోస్తాంధ్ర జిల్లాల్లో గంటకు 50 నుండి 60 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. మరోవైపు కొన్ని ప్రాంతాలలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ఈ నెల 24న ముమ్మిడివరంలో మెగా జాబ్ మేళా

**కోనసీమ బ్యూరో , మే 20 ( ప్రభాతవార్త ) :**
డాక్టర్ .బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజక వర్గం, పరిధిలోని ముమ్మి డివరం ఎయిమ్స్ ఇంజ నీరింగ్ కళాశాల నందు ఈనెల 24న మెగా జాబ్ మేళా నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడిం చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రచార గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ మేళాలో 11 ప్రముఖ కంపెనీలకు చెందిన మానవ వనరుల అధి కారులు పాల్గొని సుమారు 560 పైగా ఖాళీలను భర్తీ చేయ నున్నారన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులుఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలలో స్థిరపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పదో తరగతి నుండి డిగ్రీ పీజీ వరకు చదివిన యువ తీయువకులకు ఇదొక గొప్ప వరమని తెలిపారు నిరుద్యోగ యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాల న్నారు. యువతకు భరోసాగా పలు జాబు మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ మెగా జాబ్ మేళా సంబం ధించిన మరిన్ని సందేహా ల నివృత్తి కొరకు 8247645389 నెంబర్లును సంప్రదించా ల్సిందిగా



జిల్లా నైపుణ్య భివృద్ధి అధికారి డి. హరిశేషు తెలిపారు. ఈ కార్యక్రమం లో వికాస జిల్లా మేనేజర్ రమేష్ , జిల్లా ప్లేస్మెంట్స్ అధికారి కె. రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



# ఐఎఫ్ఎస్ కు లవకుమార్ ఎంపికవ్వడం బీసీలకు ఎంతో గర్వకారణం

## - బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు



**రౌతులపూడి , మే 20 ( ప్రభాతవార్త ) :**
రౌతులపూడి మండలం, ములగపూడి గ్రామానికి చెందిన చింతకాయల లవ కుమార్ ఐఎఫ్ఎస్ కు ఎంపికవ్వడం బీసీలకు ఎంతో గర్వకారణమని 93 బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన లవకుమార్ స్వగృహానికి విచ్చేసి తల్లిదండ్రులు వీర సర్వ చక్రవర్తి, వీర వరహాలు, విజేత లవకుమార్ ను దుస్సాలువా కప్పి, జ్యోతిబాపూలే చిత్రపటం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశస్థాయిలో మారుమూల ప్రాంతం నుండి ఐఎఫ్ఎస్ కు ఎంపికవ్వడం ఈ రోజుల్లో మామూలు విషయం కాదన్నారు. అహర్నిశలు కష్టపడితేనే ఈ ఫలితం సాధించారన్నారు. ఎటువంటి కోచింగ్ లేకుండా, ఆన్లైన్లో చదివి కుటుంబ సభ్యులతో కష్టపడి పట్టుదలతో చదువుకొని లవ కుమార్ ర్యాంకు సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. లవ కుమార్ లక్ష్యం పైన పెట్టిన గురి, సాధించా లనే తపన పలు యువత ఆదర్శంగా తీసుకోని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. శిక్షణ అనంతరం పంచి స్థానంలో పోస్టింగ్ సాధించి, సర్వీస్ లో మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈయన వెంట రాష్ట్ర కోశాధికారి నక్క కిషోర్, ఓం ఫౌండేషన్ సేవకుడు సుర్ల శ్రీనివాస్, మండల కో ఆప్షన్ చింతకాయల వీర వెంకట సత్యనారాయణ, రుత్తల సత్య నారాయణ, యామల అప్పలనాయుడు, తాలపరెడ్డి నారాయణమూర్తి, కొరప్రోలు నారాయణమూర్తి, పైల చల్లారావు, రుత్తల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యోగా ఆంధ్ర 2025పై నెల రోజులు పాటు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు : కలెక్టర్ షణ్మోహన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , మే 20 ( ప్రభాతవార్త ) :**
జిల్లాలో అందరికీ యోగా పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు గ్రామ స్థాయి వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, వివిధ శాఖల అధికారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహించినున్న వివిధ కార్యక్రమాలు అమలుపై జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించు కుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విశాఖ పట్నంలో



యోగా ఆంధ్ర-2025 కార్యక్రమం నిర్వహించ నున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలందరికీ యోగా పట్ల అవగాహన, ఆసక్తి కలిగించే ఉద్దేశంతో ఈ నెలరోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. అవగాహన ర్యాలీలు, మారథాన్ పరుగు, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించడం ద్వారా చిట్ట చివరి వ్యక్తి వరకు యోగా చేరేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే కార్యక్రమాలకు నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి, మున్సిపాలిటిలలో జరిగే కార్యక్రమాలకు కాకినాడ కమిషనర్ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల, వార్డులలో జరిగే యోగా కార్యక్రమాలకు అవసరమైన ట్రైనర్లను ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతి నిధులు భాగస్వామ్యం చేయాలన్నారు.

జిల్లా దేవాలయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయా ల్లోనూ ఈ నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల న్నారు. ఈ నెల రోజుల పాటు జరిగే యోగాఆంధ్ర 2025 కార్యక్రమం విజయవంతం చేసేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచిం చారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి, డీపీవో వి.రవికుమార్, డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్..డీఎల్వీ రమేష్ బాబు, అన్నవరం ఈవో వి.సుబ్బారావు, ఆయుష్ వైద్య అధికారి డా.ఎంఎస్.ఆలీ, వివిధ యోగా అసోసి యేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 'యోగా' తో సంపూర్ణ ఆరోగ్యం : యోగా గురువు శ్రీనివాస్

**అంబాజీపేట , మే 20 ( ప్రభాతవార్త ) :**
ప్రతిరోజు 'యోగా' చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించడంతోపాటు పాటు జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని అంబాజీపేట శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు ఆకుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిరతపూడిలో స్థానిక మహిళలు, యువతులు, బాలికలకు ఉచిత యోగా శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాలోని ప్రణాయామాలు చేయడం వల్ల మానసిక ఉల్లాసాన్ని పొంది మేధాశక్తి పెంచు కోవచ్చన్నారు.యోగా



చేయడం వల్ల రోగాలను అదుపులో ఉంచవచ్చని, తద్వారా శరీరంలోని అన్ని అవయువాలు చురుగ్గా పనిచేస్తాయన్నారు. ఉచిత యోగా శిక్షణా శిబిరంను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని యోగా గురువు శ్రీనివాస్ కోరారు.

# కోనసీమ తిరుమల వాడపల్లి 'వెంకన్న'అష్టోత్తర పూజలు

**ఆత్రేయపురం , మే 20 ( ప్రభాతవార్త ) :**
ప్రముఖ పుణ్యక్షేత్రం గా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరని స్వామి వారి ఆలయం మంగళవారం అష్టోత్తర పూజలు, శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం, స్వామి వారి దర్శనాలకు వేలాది మంది భక్తులతో శోబిల్లింది.ఉదయం మేలుకొలుపు, ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ, నీరాజనం మంత్రపుష్పం, అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగ నివేదన, తదితర కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి రావులపాలెం చెందిన కర్రీ వేంకట రెడ్డి, కమలా వతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ 1,01,116 లక్ష విరాళన్ని అందజేశారు. వారికి వేద పండితులు,ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపెరడెంట్, రాంబాబు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

# కాలిన గాయాలతో వ్యక్తి మృతి

**ఆత్రేయపురం , మే 20 ( ప్రభాతవార్త ) :**
ఆత్రేయపురం మండల పరిధిలో పేరవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ ముసలయ్య తండ్రి పేరు వీరయ్య (78) అను ఆసామి తన ఇంట్లో వంట చేసుకుంటూ ఉండగా గ్యాస్ పొయ్యి నుండి మంటలు వచ్చి శరీరం కాలిన గాయాలైన తన తండ్రి ని అతని కుమారుడైన యార్లగడ్డ వీర్రాజు రాజమండ్రి ప్రభుత్వ హాస్పిటల్ తీసుకువెళ్లగా . చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం యార్లగడ్డ మృతి చెందినట్లు తెలిపారు. విషయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు

# పాఠశాలల వారీగా విద్యార్థి మిత్ర కిట్లను అందజేయాలి : ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ మమ్మి

**అంబాజీపేట , మే 20 ( ప్రభాతవార్త ) :**
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ప్రభుత్వ పాఠశాలల వారీగా అందించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.మమ్మి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో భద్రపరిచిన విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మమ్మి మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన పాఠ్యపుస్తకాలు, బెల్ట్, క్వాలిటీ చెక్కింగ్ బోర్డు, డిస్ప్లే వాల్ను సమగ్రంగా అందించాలన్నారు. అందుకు అవసరమైన రికార్డులను సిద్ధం చేసుకోవా లన్నారు. మిగిలిన సామాగ్రి వారం రోజుల్లోగా స్టాక్ పాయింట్కు చేరతాయన్నారు. అంతకుముందు మండలానికి వచ్చిన షాఠ్యపుస్తకాలతో పాటు ఇతర



వస్తువులను పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న పీఎంఎస్కే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్, ప్లే ఫీల్డ్ నిర్మాణం వేగవంతంగా చేయాలన్నారు. ఎంఈఓలు కె. వెంకటశ్వరరావు, మోకా ప్రకాష్, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఎంఆర్సీ స్టాఫ్, సీఆర్ఎంటీలు ఆమె వెంట ఉన్నారు.

# గోపాలపురంలో కిషోరి వికాసం పై అవగాహన



**రావులపాలెం , మే 20 ( ప్రభాతవార్త ) :**
గోపాలపురం అంగన్వాడీ కేంద్రం లో ఐసిడిఎస్ కొత్తపేట సిడిపిఓ ఎ గజలక్ష్మి ఆదేశాలతో సూపర్ వైజర్ ఫాతిమా బీబీ ఆధ్వర్యంలో కిషోరి వికాసం శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెషన్ 6, లింగ వివక్షత, అసమానతల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఫాతిమా బీబీ మాట్లాడుతూ కౌమార బాలికల సత్ సంబంధాలు,సమస్యలు, పరిపూర్ణ ఆరోగ్యం, పోషణ అవసరాలు,పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మ రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించి ఆత్మ స్థైర్యం తో ముందడుగు వేయా లన్నారు. అనంతరం గ్రామం లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఏఎన్ఎంలు, మహిళా పోలీసు లు, అంగన్వాడీ టీచర్లు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, అధికసంఖ్యలో తల్లులు,కిషోరి బాలికలు పాల్గొన్నారు.

# ప్రజల నుండే వచ్చాను ప్రజలతోనే ఉంటాను



**నిడదవోలు , మే 20 ( ప్రభాతవార్త ) :**
నిడదవోలు నియోజకవర్గ టిడిపి మహానాడు కార్యక్రమం మంగళవారం వేలివెన్ను గ్రామంలో వేలాదిగా తరలివచ్చిన టిడిపి అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమితులైన, నిడదవోలు టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మినీ మహానాడులో పార్టీ శ్రేణులు నాలుగు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీతో పాటు తెలుగు ప్రజలందరి పండగన్నారు. పేదవాడికి కూడు గుడ్డ నీడ అందించలనే లక్ష్యంతో పార్టీని స్థాపించి కిలో రెండు రూపాయలకే బియ్యం అందించిన ఘనత ఎన్టీఆర్ ది అన్నారు. దేశవ్యాప్తంగా ఎన్టీఆర్ తెలుగు వాడి కీర్తి ప్రతిష్టలు చాటి చెపితే, రెండవ తరంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలుగు వాడి సత్తాను ప్రపంచవ్యాప్తం చేశారన్నారు.

ఇటీవల రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్గా బాధ్యతలు అప్పగిం చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, యువనేత నారా లోకేష్ బాబుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని టిడిపి నేతలు, మండల, పట్టణ, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.

# పంట కాలువల ఆధునికరణకు చర్యలు : ఎమ్మెల్యే గిడ్డి

**మామిడికుదురు , మే 20 ( ప్రభాతవార్త ) :**
పంట కాలువల ఆధునీకరణకు చర్యలు తీసుకుం టున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు.పంట కాలువల్లో పూడికను తొలగించి కాలువలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలోగోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మానేపల్లి నీటి సంఘం చైర్మన్ మద్దాల తమ్మయ్య నాయుడు, ఇరిగేషన్ డి.ఇ.ఇ. నాగేంద్ర కుమార్, ఇరిగేషన్ ఎ.ఇ.ఇ.సుందర సింగ్,మామిడికుదురు మండల టిడిపి అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్,జనసేన మండల



పార్టీ అధ్యక్షుడు జాలెం శ్రీనివాస్,సంసాని పెద్దిరాజు,జాలెంసుబ్బారావు,డొక్కా నాద్ బాబు, కొమ్ముల జంగమ్మయ్య,గుబ్బల పండు, చుట్టుగుల్ల కిషోర్,బాలు, వారణాసి ప్రసాద్, మద్దాల అధిశేషు, విల్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కష్టంలో ఉన్న కుటుంబానికి "సత్యం వాసంశెట్టి" ఫౌండేషన్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం



**కోనసీమ బ్యూరో, మే 20 ( ప్రభాతవార్త ) :**
కష్టంలో ఉన్న ఒక కుటుంబానికి "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" అండగా నిలిచింది. రామచంద్రపురం పట్టణంలోని తొమ్మిదో వార్డు జల్లి పేటలో నివాసం ఉంటున్న యళ్ళ శ్రీదేవి (45) ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మరణంతో తీవ్ర శోకంలో ఉన్న ఆ కుటుంబానికి ఓదార్పు అందించి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం స్థానిక తొమ్మిదవ వార్డు కూటమి నాయకులచే మంగళవారం ఆ కుటుంబానికి అందించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, స్థానిక కూటమి నాయకుల చేతులు మీదుగా ఆ కుటుంబానికి సహాయం చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కష్ట కాలంలో ఉన్న తమ పట్ల ఓదార్పు, మనో ధైర్యం, సానుభూతి చూపించటంతో పాటు, ఆర్థిక సహాయం అందించిన "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" కు యాళ్ల శ్రీదేవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆపదలో, కష్టాల్లో ఉన్న కుటుంబాల పట్ల మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నిత్యం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# క్షేత్ర స్థాయి పర్యటనలో ప్రజా పంపిణీ వ్యవస్థనుతనిఖీలు నిర్వహించాలి : కలెక్టర్ పి ప్రశాంతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , మే 20 ( ప్రభాతవార్త ) :**
మండల స్టాక్ పాయింట్లు వద్ద ఉన్న సరుకుల స్టాక్ వివరాలను , రిజిస్టరు ప్రకారం నిర్వహిస్తున్నారో? లేదో? , అదే విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్ర స్థాయి పర్యటన సందర్భంలో ఖచ్చితంగా తనిఖీ చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం చాగల్లు మండలం ఉనగట్ల ఎమ్ ఎస్ ఎల్ పాయింట్ , కొవ్వూరు పట్టణ ప్రాంతంలో ఉన్న చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత , తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌర సేవలు అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరు పై జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆమేరకు చాగల్లు మండ



లం ఉన్నకట్ల గ్రామంలోనీ మండల స్టాక్ పాయింట్ నిర్వహణ విషయంలో స్టాక్ నిర్వహణా, రిజిస్టర్ల నిర్వహణ ను పరిశీలించడం జరిగిందన్నారు. స్టాక్ పాయింట్ లో ఉన్న స్టాక్ , రిజిస్టర్ ప్రకారం సరిగ్గా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదిక అందచేయాలని ఆర్డీవో రాణి సుస్మిత ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొవ్వూరు పట్టణంలోని పలు చౌక ధరల దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్ , అక్కడ వినియోగదారులతో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును పట్ల, మోటార్ డెలివరీ యూనిట్స్ ద్వారా ఇంటి వద్దనే సరుకుల పంపిణీ పై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చెయ్యడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత తనిఖీ చేసిన స్టాక్ వివరాలు తెలియ చేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ, ఐ సి డి ఎస్ ద్వారా ఏం ఎస్ ఎల్ పాయింట్ లో స్టాక్ స్పోర్టెక్స్ రైస్ 19245 సంచులలో 959.328 మెట్రిక్ టన్నులు, ఫోర్టిఫైడ్ రైస్ 14.244 మెట్రిక్ టన్నులు, చక్కెర 58.494 మెట్రిక్ టన్నులు , కందిపప్పు పిడిఎస్ , ఐసిడిఎస్ లు 11.882 మెట్రిక్ టన్నులు , పిడిఎస్ 2.427 మెట్రిక్ టన్నులు పామ్ ఆయిల్ 1049 లీటర్ ప్యాకెట్, 7219 అర లీటర్ ప్యాకెట్ లు స్టాక్ మేరకు సరిపోయినట్లు తెలిపారు. ఆమేరకు కలెక్టర్ కు నివేదిక అందచెయ్యడం జరిగిందన్నారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, చాగల్లు తహసీల్దార్ అమ్మజీ, కొవ్వూరు తహసిల్దార్ ఎమ్. దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయ పునరుద్ధరణకు కేబినెట్ ఆమోదం : మంత్రి కందుల దుర్గేష్ హర్షం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో్ , మే 20 ( ప్రభాతవార్త ) :**



రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయ పునరుద్ధరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీని ఏపీకి తరలించే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలపడం తద్వారా కళలకు కాణాచి, సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరానికి పూర్వవైభవం వస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం చట్టం – 1985లోని సెక్షన్ 3(2) ప్రకారం ఏపీలోని రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతుల ఉన్నత స్థాయి పరిశోధన కేంద్రంగా తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని తెలిపారు. అన్ని భాషలను గౌరవిస్తూనే మాతృభాషకు అగ్రతాంబూలం ఇవ్వాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెలుగు భాష మరియు సాహిత్యం ఆధారంగా కళా సంస్కృతి, సంగీతం, రంగస్థల నాటకాలు, చిత్ర లేఖనం తదితర వాటిలో అధునాతన అధ్యయానికి, పరిశోధనలు సులభతరం చేయడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. భవిష్యత్ లో జరిగే శాస్త్రీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి రంగంలోనూ ప్రాచీన తెలుగు పరిశోధనలకు అవకాశం కల్పించబడుతుందన్నారు. అంతేగాక తెలుగు భాషా సాహిత్యాలు, కళలు, సంస్కృతి, శాస్త్రాలు సంపూర్ణంగా, సమగ్రంగా అభివృద్ధి చెందాలన్న సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ప్రజల తరపున సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంస్కృతి, వారసత్వానికి వారధిగా నిలుస్తూ పవిత్ర గోదావరి చెంతన ఉన్న రాజమహేంద్రవరంలో తెలుగు వైభవంగా వెలుగొందుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాషా సంస్కృతులు, కళలు మరింతగా విరాజిల్లుతాయన్న అభిప్రాయాన్ని మంత్రి దుర్గేష్ వ్యక్తం చేశారు.

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ధర్నా

**కాకినాడ టౌన్ , మే 20 ( ప్రభాతవార్త ) :**



కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీసం 26 వేలు వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని, డిమాండ్ చేస్తూ మంగళవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయం కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అలాగే అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మీల్, యనిమేటర్లు వంటి స్కీం వర్కర్ల అందరిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రైతుల పంటల గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజు వేతనం 600 చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వర్లు, ఐఎన్టియుసీ ఏపీ అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరు రాజులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను పరిశ్రమల యాజమాన్యాలకు, కార్పొరేట్లకు, మోడీ ప్రియ మిత్రులకు లాభదాయకమని, దేశంలో కష్టించి పనిచేసే 90 శాతం మంది ప్రజానైన కార్మిక వర్గానికి, ఉద్యోగులకు, అసంఘటితరంగ కార్మికులకు ఉరితాడు వంటివని విమర్శించారు. ఇవి అమలులోకి వస్తే ఇప్పటి వరకు కార్మికులకు హక్కులైన పర్మినెంట్, బోనస్, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ప్రమాద నష్టపరిహార చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రద్దు చేయడబతాయని తెలిపారు. బ్రిటిష్ పాలన రోజులో బానిస బ్రతుకులు తిరిగి రాబోతున్నాయని కార్మిక వర్గాన్ని హెచ్చరించారు. అందువల్ల కేంద్రంలో ఉన్న 11 కార్మిక సంఘాలు ఉమ్మడిగా జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేసి ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయించుకోవాలని ఉద్యోగులకు కార్మికులకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, టి రాజా, ఏపీ మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకట్రావు, ఆశా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి భారతి, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రకాశరావు, పెంక్షనర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు, వివోఏ జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికుడితో ప్రాణహాని ఉందని ఎస్పీ కు ఫిర్యాదు



**రౌతులపూడి , మే 20 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని రాఘవపట్నం పంచాయతీ శివారు మాతయ్య పేటకు చెందిన యాదల సత్యనారాయణ లైంగికంగా తనను వేధిస్తున్నాడని యాదల దేవి సోమవారం జిల్లా ఎస్పీ పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు నకలను విలేకరులకు అందజేశారు. ఈ నెల 6న నా భర్తలేని సమయంలో సత్యనారాయణ నా ఇంటికొచ్చి లైంగికంగా వేధించాడని దేవి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం చుట్టుపక్కల వారికి తెలియడంతో పారిపోయాడన్నారు.

అంతే గా కుండా రాత్రి సమయంలో మా ముగ్గురు పిల్లలతో నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్ పోసి ఇల్లు తగలబెట్టారన్నారు. ఆ సమయంలో పట్టుకోవడానికి ప్రయత్నించినా పారిపోయాడన్నారు. స్థానికులు వచ్చి తగలబడుతున్న ఇంటిని ఆ ర్పారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఈనెల 7న రౌతులపూడి పోలీస్స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చామన్నారు. అతనిపై ఏ విధమైన చర్యలు లేకపోవడంతో బెదిరిస్తున్నారని, సత్యనారాయణ నుండి నా కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె ఫిర్యాదులో కోరారు.

# విద్యుత్ టవర్ల ఆధునీకరణకు పవర్ కట్..వినియోగదారులు సహకరించాలి : కలెక్టర్ మహేష్ కుమార్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో్ , మే 20 ( ప్రభాతవార్త ) :**

నూతనంగా ఏర్పడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల విద్యుత్ డిమాండ్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్తు టవర్లు లైన్లు ఆధునీకరణ వంటి పనుల నిర్వహణ నిమిత్తం జిల్లాలో రామచంద్రపురం డివిజన్, కొత్తపేట డివిజన్లోని ఆత్రేయపురం, రావులపాలెం,కొత్తపేట మండలాల్లో మినహా మిగిలిన మండలాలలో విద్యుత్ పవర్ కట్ ముందుగా నిర్దేశించిన గ్రామాలలో ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఏపీ ట్రాన్స్కో, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి విద్యుత్ టవర్లు ఏర్పాటు సందర్భంలో విద్యుత్ పవర్ కట్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 90 టవర్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 60 టవర్లు నిర్మించినట్లు మిగిలిన 30 టవర్లు నిర్మాణానికి సంబంధించి రోజుకు రెండు చొప్పున నిర్మించనున్నట్లు తెలిపారు. వీటిని నిర్మాణ సందర్భంలో విధించే విద్యుత్ అంతరాయ సమయాలను, గ్రామాలను ముందుగా తెలియజేయడం జరుగుతుందని ఆ మేరకు వినియోగదారుల సహకరించాలన్నారు.విద్యుత్ అంతరాయాలను ఉదయం 11 గంట నుండి 5 గంటల మధ్య సమయంలో విధించడం జరుగుతుందన్నారు.సబ్ స్టేషన్ మెయింటెనెన్స్, కొత్త పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయాలను ప్రకటిస్తారన్నారు.స్థానిక విద్యుత్ అవసరాలలో 20 శాతం మేర ఈ పనుల నిమిత్తం కోత విధించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి విద్యుత్ అంతరాయాలు (పవర్ కట్లు) విధించలేదని ఆయన స్పష్టం చేశారు. ఏపీ ట్రాన్స్కో అధికారులు టవర్లు నిర్మాణ సందర్భంలో విధించే విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ముందుగాతెలియజేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.రొటేషన్ పద్ధతిలో ఎవరికి పెద్దగా ఇబ్బందులు లేకుండా ఒక సబ్ స్టేషన్లో ఉన్న నాలుగు పీడర్లు ఉంటే రోజు కొక పీడర్ చొప్పున ఒక గంట పాటు విద్యుత్ అంతరాయాన్ని విధించడం జరుగుతుందన్నారు.

జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగానికి ఎటువంటి విద్యుత్తు అంతరాయాలను విధించరాదని 24/7 త్రాగునీటి అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండాలని ఏపీ ట్రాన్స్కో ఇంజనీర్లను ఆదేశించారు. సరాసరిన కేవలం అమలాపురం డివిజన్లో మాత్రమే 24 గంటల వ్యవధిలో కేవలం 3 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.ఏపీ ట్రాన్స్కో విశాఖపట్నం జోనల్ చీఫ్ ఇంజనీర్ బి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్లు ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్తు లైన్ ఆధునీకరణ వంటి పనుల నిమిత్తం విద్యుత్ అంతరాయాలను15 రోజులు పాటు విధించడం జరుగుతుందన్నారు.దీనికి విద్యుత్ వినియోగదారులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఎస్సీ ఎస్. రాజబాబు, గ్రామీణ నీటి సరఫరా,పారిశుద్ధ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి,ఇరు విభాగాల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**కోనసీమ బ్యూరో్ , మే 20 ( ప్రభాతవార్త ) :**

స్థానిక జిల్లా కేంద్రంలో వాహనాల రాకపోకల రద్దీ ని నియంత్రించేందుకు యుద్ధ ప్రాతిపదికన నడిపూడి లాకు వద్ద ఈదరపల్లి వద్ద నూతన వంతెనల నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రహదారులు భవనాల శాఖ ఇంజనీ ర్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిధి లోని నడిపూడి లాకు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పను లను ఆయన పరిశీలించా రు. నిర్మాణ పనుల నిర్వ హణ తీరుతెన్నులను ఇంజనీర్లను అడిగి తెలు సుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటిం చాలని సూచించారు. నిర్మా ణ పనులలో ఎటువంటి జాప్యాలకు తావివ్వ రాదని ఆయనస్పష్టం చేశారు నిర్ణీత కాలవ్య వధిలో నిర్మాణ పనులను పూర్తి చేస్తూ ఈ యొక్క వసతులను జిల్లా వాసు లకు అందుబాటులోకి తీసుకొని వస్తూ ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని ఇంజనీర్లను సూచించా రు. ఈ కార్యక్రమంలో రహదారు లు భవనాల శాఖ జిల్లా సూపరింటెం డెంట్ ఇంజనీర్ బి రాము డివిజనల్ ఇంజనీర్ వర్మ జూనియర్ ఇంజనీర్ రమేష్ స్థానిక తహసిల్దార్ అశోక్ కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

# వర్షాలు కారణంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపే ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా : జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో్ , మే 20 ( ప్రభాతవార్త ) :**

సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపేందు కు ఈ నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపుకు వచ్చే కెనాల్ రోడ్డు ట్రాఫిక్ మళ్లింపు వర్షాల కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట నుంచి కాకినాడ వచ్చే రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనులు 4 రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేయడానికి నిర్ణయం చేయగా వర్షాలు కురుస్తున్న కారణంగా గడ్డర్లు లేపే సమయంలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ గడ్డర్లు లేపే ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సామర్లకోట నుంచి కాకినాడకు వచ్చే కెనాల్ రోడ్డులో వాహనాల రాకపోకలు యధావిధిగా సాగుతాయన్నారు. ఈ మార్పును ప్రయాణికులు, వాహనదారులు గమనించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

# నిర్దేశిత సమయంలో క్లోజర్ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో్ , మే 20 ( ప్రభాతవార్త ) :**



వేసవి కాలువలు మూసి వేత సమయంలో వివిధ గ్రాంట్ల కింద మంజూరైన క్లోజర్ పనులను వేగవంతం చేసి ఋతు పవనాలు వచ్చే లోపల పూర్తి చేస్తూ ఖరీఫ్ సీజన్లో రైతులకు సజావుగా సాగునీరు, మురుగు నీరుపారేలా చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జలవనరులు డ్రైనేజీ విభాగపు ఇంజనీర్లను ఆదేశించారు. మంగళ వారం స్థానిక కలెక్ట రేట్ నందు జలవనరులు డ్రైనేజీ విభాగ ఇంజనీ ర్లతో సంయుక్తంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు వివిధ గ్రాంట్ల కింద మంజూరైన పనుల స్థితిగతులపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల వనరుల శాఖ మరియు సి ఎస్ ఆర్, టి ఆర్ 27 నిధుల ద్వారా మంజూరైన పనులను విడివిడిగా సమీక్షించి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదే శించారు.ముఖ్యంగా తూడు తొలగింపు, షట్టర్లు మరమ్మత్తు పనులపై ప్రత్యేక పోకస్ పెట్టాలన్నారు. అత్య వసరమైన పనుల పట్ల మరింత శ్రద్ధ వహించి డెల్టా రైతాంగ సంక్షేమం అభ్యున్నతికి పాటు పడాల న్నారు. గ్రాంట్ల వారీగా పూర్తిచేసిన పనుల నివేది కలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జలవ నరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి శ్రీనివాసరావు, జిల్లా డ్రైనేజీ విభాగం కార్యనిర్వహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్, వివిధ డివిజన్ల డివిజనల్ ఇంజనీర్లు, సహాయం ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు బాగు చేయరూ..ఛిద్రమైన రోడ్డుపై బాటసారులు పాట్లు

**అంబాజీపేట , మే 20 ( ప్రభాతవార్త ) :**



దశాబ్ద కాలం క్రితం నిర్మించిన రహదారి ఛిద్రం కావడంతో బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే రహదారిని బాగు చేయించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుండి గట్టెక్కించాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎన్ఎస్ఎన్ వర్మ అధికారుల్ని కోరారు. మండలంలోని పుల్లేటికుర్రు పంచాయతీ పరిధిలోని బాబా నగర్ వంతెన నుండి మోడేకుర్రు వంతెన వరకు గత టిడిపి ప్రభుత్వంలో ఆర్డీఎఫ్ పథకం ద్వారా నాబార్డు నిధులతో కొంతమేర సీసీ రోడ్డు, కొంతమేర తారు రోడ్డు నిర్మించాలన్నారు. ప్రస్తుతం రహదారి పూర్తిగా దెబ్బతినడంతో గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలువ ఉండి పోవడంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక బాటసారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి తోడు రాళ్లు లేచి నడిచి వెళ్లే వాళ్లకు గుచ్చుకుంటున్నాయన్నారు. ఈ మార్గం గుండా నిత్యం ఎంతోమంది ప్రయాణిస్తుంటారని, ఎక్కువగా విద్యార్థులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. కావున సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పరిష్కార దిశగా ఆలోచన చేయాలని ఎన్ఎస్ఎన్ వర్మ కోరారు.

# వైద్యం, విద్యకు రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ సాయం




**కాకినాడ టౌన్ , మే 20 ( ప్రభాతవార్త ) :**

వైద్యం, విద్యకు రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ ట్రస్ట్ సహాయపడుతుంది అందులో భాగంగా మంగళ వారం డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ బుల్ ట్రస్ట్ కార్యాలయంలో సుమారు ఒక లక్ష 25 వేల రూపాయలు విలువ చేసే సహాయాన్ని అందించారు. ఎంబీఏ చదువుతున్న విద్యార్థికి ల్యాప్ టాప్, డిగ్రీ చదువుతున్న నలుగురు విద్యార్థులకు స్కాలర్, మధు మేహ వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాబుకు 3 నెలలకు సరిపడ మందులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళకు 3 నెలలకు సరిపడ్డ మందులు మొత్తం అన్ని కలిపి ఆ ఏడుగురుకి లక్ష ఇరవై ఐదువేలు రూపాయలు విలువ చేసే సేవా కార్య కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ ఆడిటర్, రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థి తాళ్లూరి శ్రీనువాసు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య లకు సంబంధించిన సేవా కార్యక్రమాలకు ప్రాముఖ్యత ఇస్తున్నాయని, బాగా చదువుతున్న విద్యార్థులను వీలైనంత వరకు ట్రస్ట్ ద్వారా తమ పూర్వ విద్యార్థుల సహకారంతో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎన్ కళ్యాణి, ఎ సరళ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రతకు చర్యలు : జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో్ , మే 20 ( ప్రభాతవార్త ) :**



ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్,రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ,ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం గోదాము భద్రతను తనిఖీ చేసి, నివేదిక పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటి ఎం.జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారు ఇండ్ల స్థలములకు దరఖాస్తు చేసుకోండి : తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

**సామర్లకోట , మే 20 ( ప్రభాతవార్త ) :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఇండ్ల స్థలములు మంజూరుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీ కొరకు ప్రస్తుతం ఇళ్ల స్థలం మంజూరు కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొనుటకు వెబ్ పోర్టల్ ఓపెన్ చేయడం జ అర్హులైన వారు వెంటనే వారి దగ్గరలో ఉన్న సచివాలయంనకు వెళ్లి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇ పట్టా కొరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా అందరికీ తెలియపరుస్తున్నామని సామర్లకోట తహసిల్దార్ కే చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# పిల్లలు ఇద్దరూ సమానమే !



ఇంట్లో ఒకరికి మించి పిల్లలు ఉంటే చాలు.. తరచూ తగాదాలే. 'అన్ననే నువ్వు బాగా చూస్తావ్'. చెల్లికే నువ్వు అన్నీ కొనిస్తావ్ అంటూ అలకబూనుతుంటారు. ఇది కొంతవరకూ పరవాలేదు కానీ తోబుట్టువులపై ద్వేషం పెంచుకునే వరకూ వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఇందుకోసం నిపుణులు ఏం సలహా ఇస్తున్నారంటే..

✦ తల్లిదండ్రులుగా ఇద్దరు పిల్లల్ని వేర్వేరుగా చూడాలన్న పక్షపాతం మీకు లేకపోయి ఉండొచ్చు. కానీ తరచూ ఒకరితో ఒకరు గొడవ పడటం, చిన్నబుచ్చుకోవడం చేస్తుంటే.. వారికి కాస్త మీ ప్రేమ అవసరం అని తెలుసుకోండి. ఇద్దరూ సమానమే అని చెప్పే ప్రయత్నం చేయండి. తనతో మీరు చిన్నప్పుడు ఎంత చనువుగా ఉండేవారో చెబుతూ ఉండండి ఇది తనలోని అభద్రతా భావాన్ని దూరం చేస్తుంది. ఆ జ్ఞాపకాలన్నీ క్రమంగా తన అపోహల్ని దూరం చేయొచ్చు.

✦ అమ్మానాన్నలు వయసులో చిన్నది కదా అని ఆఖరిదానికి అడిగినవన్నీ తెచ్చివ్వడంలో తప్పులేదు. కానీ, అదే సమయంలో పెద్దవాడి ఇష్టాలకూ ప్రాధాన్యం ఇవ్వండి. లేదంటే, మీకూ, తనకీ, మధ్య చెల్లి వచ్చిందనే అభద్రత బాధ తోబుట్టువుతో గొడవలకు దారితీస్తాయి.

✦ పిల్లల్లో అల్లరి, గిల్లికజ్జాలు మామూలే తప్పొవ్వులు ఇద్దరివైపూ ఉంటాయి. అలా కాకుండా పెద్దాడే చేసుంటాడు. లేదా చిన్నదే చేస్తుందిలా అనే నిర్ధరణకు వచ్చేయకండి. సమస్య ఏంటో తెలుసుకుని సరిదిద్ది నప్పుడు గొడవలు రావు. ఇంకోసారి ఒకరి మీద మరొకరు ఫిర్యాదు చేసుకునే పరిస్థితి ఉండదు. □

# సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి !



కష్టంలో ఉన్నవాళ్లకు అండగా నిలవడం, యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, మూగజీవాల దాహార్తిని తీర్చడం... ఇలాంటి సేవా కార్యక్రమాలెన్నో చేస్తారు. అందులోనే సంతృప్తి అంటారు. విశాఖకు చెందిన ఎస్.గీతా నారాయణ్, అందుకే తన ముందు ఎన్నో దారులు కనిపించినా... సేవా మార్గాన్నే ఎంచుకున్నారామె.

డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అధికారి భార్య కాబట్టి ఇదంతా చేస్తున్నారు. రాజకీయాల్లోకి రావాలని సేవ చేస్తున్నారు... ఇలా ఎన్నో రకాలుగా నా గురించి అనుకోవడం విన్నాను. అయినా వాటిని పట్టించుకోలేదు. ఎందుకంటే నేను సేవచేయడానికి కారణాలు వారనుకున్నవి కాదు. మా అబ్బాయి పట్లే కాదు... సమాజంపైనా నాకు అంతే బాధ్యత ఉందనుకుంటాను. సంపాదనలో కొంత అందుకు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నా. దీనికి



కారణం నా నేపథ్యమే. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మా సొంతూరు. నాన్న తల్లాడి సత్యనారాయణ గ్రామ సర్పంచ్‌గా చేశారు. అమ్మ వరలక్ష్మి, వాళ్ల మూడో సంతానం నేను, ఎన్ని ఇబ్బందులున్నా. అడిగినవారికి కాదనకుండా నాన్న సాయం చేయడాన్ని దగ్గరగా చూశారు. ఉమ్మడి కుటుంబంలోని సభ్యుల మధ్య ప్రేమ, సాయం, జాలిని చూశాను. ఇవే నన్ను సేవవైపు నడిచేలా చేశాయి. మావారు శంకర్ నారాయణ్ ఐఆర్ఎస్, ఎపి ప్రభుత్వంలో డ్రగ్స్ కంట్రోల్ కాపీరైట్లను పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. సేవా కార్యక్రమాల్లో నాకు అండగా ఉంటున్నారు.

**పక్షుల కోసం చలివేంద్రాలు ...**

మావారి ఉద్యోగ రీత్యా 2012లో విశాఖ వచ్చాం. ఇక్కడ సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధమైనప్పుడు సంతోష్ పుల్లెటికుర్తి స్థాపించిన 'కెన్ ఫౌండేషన్' మంచి వేదికగా అనిపించింది. అప్పట్నుంచి నేనూ అందులో భాగమై వివిధ కార్యక్రమాలు చేస్తున్నా. వాటిలో 'గ్రీన్' ప్రాజెక్టు ఒకటి. వేసవి రాగానే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అదే ఎన్ని తరహా పక్షులకూ ఎందుకు ఉండకూదని పించి 'వాటర్ బౌల్స్' ప్రాజెక్టుని ప్రారంభించాం. ఈ ప్రాజెక్టుకు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. గత 13 ఏళ్లుగా ఉమ్మడి విశాఖ పరిధిలో వేల సంఖ్యలో పక్షుల కోసం నీటి తొట్టెలను పెట్టించాం. జంతువులు, వీధి శునకాలకు సైతం పెద్ద సిమెంటు తొట్టెలను ఏర్పాటు చేస్తున్నాం.

**గిరిజనులకు వింటర్ స్మైల్...**

పాడేరు చుట్టుపక్కల గిరిజన గ్రామాల్లో 'వింటర్ స్మైల్ పేరుతో ఓ ప్రాజెక్టు చేపడుతున్నాం. పోలీసుల సాయంతో రెండు నెలలపాటు స్థానిక పేద కుటుంబాలకు దుస్తులు, 2 నిత్యావసర సరకులు అందిస్తాం. నాన్న గుండెపోటుతో చనిపోయినప్పుడు అంబులెన్స్ సమస్య వచ్చింది. అది చూశాక, అన్ని రకాల సౌకర్యాలుండే అంబులెన్స్‌ను రూ.20లక్షలతో కొనుగోలు చేసి జంగారెడ్డిగూడెంలో ఒక ఎన్జీవోకు అప్పగించారు. అక్కడ ప్రభుత్వ స్కూల్లో నీటికి అవస్థలు పడుతుంటే రూ.3లక్షలతో బోర్ వేయించాం. విశాఖ పరిధిలో 13వేల మంది అనాథ చిన్నారులు, బాలికలు, వృద్ధులకు ఇప్పటివరకు అండగా నిలిచాం. నాలుగేళ్ల క్రితం పాడేరులో పదో తరగతి అర్హత ఉన్నవారిని గుర్తించి రెండు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. 550 మంది హాజరైతే అందులో 180 మంది పోలీస్ శిక్షణకు ఎంపికయ్యారు. నిరాదరణకు గురైన మహిలలకు 60కు పైగా కుట్టు మెషీన్లు పంపిణీ చేయడంతోపాటు, ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించాం. హుద్‌హుద్ సమయంలో విశాఖలో వెళ్లగలిగిన ప్రతి ప్రాంతంలో మా సేవలందాయి. సేవలో దొరికే సంతృప్తి మరెక్కడా ఉండదు. అందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నా. అందుకే మా మార్గాన్ని ఎంచుకున్నా. □

# కీళ్ల నొప్పులకు రోజ్‌హిప్ టీ



అందం, ఆరోగ్యం కోసం.. సంప్రదాయ టీ స్థానంలోకి హెర్బల్ టీలు వచ్చాయి. వాటిల్లోనూ యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే రోజ్‌హిప్ టీ తీసుకోవడం వల్ల అధిక ప్రయోజనాలు పొందొచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు.

✦. సాధారణ హెర్బల్ టీలతో పోలిస్తే ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల మనలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

✦. రక్తంలోని ట్రైగ్లిజరాయిడ్లని అదుపుచేసి.. గుండెజబ్బులు రాకుండా చేస్తుంది. బరువుని అదుపులో ఉంచుతుంది.

✦. తుంటి, కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతర్గత వాపుల రాకుండా చూస్తుంది. ఈ టీని నిత్యం తాగేవారికి విటమిన్ సి, విటమిన్ ఇలు పుష్కలంగా అందుతాయి. ఈ విటమిన్లు.. చర్మంలో సాగే గుణాన్ని పెంపొందించి వయసు ఛాయలని వెనక్కి నెడతాయి. □

## చెలి చిట్కా

ముఖాన్ని ఎంతగట్టిగా రద్దితే అంత మెరుగువస్తుందని కొందరి భ్రమ. ముఖాన్ని గట్టిగా చేతులతో అదిమి రుద్దుకోవడం వల్ల అందం పెరగకపోగా చక్కటి చర్మం పాడవు తుంది. □

# సంగీతంతో మనసు ఉల్లాసం



కొన్ని పాటలు శరీరంలో పులకలు తెప్పిస్తాయి. మరికొన్ని చల్లటిగాలేదో చుట్టుముట్టిన భావనని కలిగిస్తాయి. కొన్ని వ్యక్తం చేయలేని శోకాన్నేదో కలిగిస్తే.. మరికొన్ని తెలియని ఆనందాన్ని పుట్టిస్తాయి. ఎందుకు జరుగుతోందిలా? అన్న ప్రశ్నకి సంగీతం మనసులో తెచ్చే స్పందనలే ఇందుకు కారణమని చెబుతూ వచ్చారు ఇంతకాలం. కానీ ఒక్క మనసే కాదు శరీరమూ సంగీతానికి రకరకాలుగా స్పందిస్తోందని తాజాగా తేల్చారు శాస్త్రవేత్తలు. ఇందుకోసం 528 మందితో ఓ అధ్యయనం నిర్వహించారు. వాళ్లకి వినిపించడానికి కొన్ని వాయిద్య సంగీత భాగాల్ని ఎంచుకున్నారు. వాళ్ల ముందు మానవ శరీరభాగాలతో ఉన్న టచ్‌స్క్రీన్ బొమ్మని ఉంచారు. ప్రతిసారీ సంగీతాన్నీ విన్న పది సెకన్ల తర్వాత వాళ్ల శరీరంలో ఏ భాగం స్పందిస్తోందో దాన్ని టచ్‌స్క్రీన్‌లోని బొమ్మని తాకి చెప్పమన్నారు. దాదాపు అందరూ కొన్ని పాటలతో తమ హృదయ స్పందన పెరుగుతోందనీ, మరికొన్నింటితో ఉదరభాగంలో ఏదో కదులుతున్నట్టు భావించామనీ చెప్పారట! దీన్నిబట్టి సంగీతం అన్నది మనసుపైనే కాదు శరీరంమీదా ప్రభవాన్ని చూపుతోందని తేల్చారు శాస్త్రవేత్తలు. ముఖ్యంగా పాట మొదలైనప్పటి నుంచీ చివరిదాకా సాఫీగా సాగే మెలడీ ఉదర(గట్) భాగాల్లో అవ్యక్తానుభూతికి కారణమైతే.. అక్కడక్కడా మలుపులున్న సంగీతం హృదయ స్పందనల్నీ పెంచుతోందని విశ్లేంచారు. □

# కారం గవ్వలు

ఆకుకూరలు ఆరోగ్యానికెంతో మంచిది. మరి వాటిని పిల్లలతో తినపించాలంటే కూరగా కంటే చిరుతిండి రూపంల ఇస్తే సరి. మెంతికూరతో ఇల స్నాక్స్ చేశారనుకోండి. ఇంటిల్లిపాదికీ నచ్చేస్తాయి.

**కావలసినవి..** మెంతికూర 2 కట్టలు, నెయ్యి 2 చెంచాలు, మైదా, గోధుమపిండి పావు కిలో చొప్పున, శనగపిండి 2 టేబుల్‌స్పూన్లు, నెయ్యి 3 చెంచాలు, వాము అర చెంచా, నువ్వులు 2 చెంచాలు, నూనె వేయించేందుకు సరిపడా, ఉప్పు రుచికి తగినంత, ఆమ్‌చూర్ పౌడర్ పావు చెంచా, అల్లం ముద్ద ముప్పావు చెంచా, పచ్చిమిర్చి తరుగు, మిరియాలపొడి అర చెంచా, చొప్పున తీసుకోవాలి.



**తయారీ :** మెంతికూరను శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా వడకట్టాలి. వెడల్పాటి పాత్రలో మైదా, గోధుమపిండి, శనగపిండి, నెయ్యి, వాము నువ్వులు, ఉప్పు, ఆమ్‌చూర్ పౌడర్, అలనం ముద్ద, పచ్చిమిర్చి తరుగు, మిరియాలపొడి వేసి కలపాలి. కడాయిలో మిగలిన నెయ్యి వేడిచేసి మెంతికూరను వేయించాలి. చల్లారాక.. దీన్ని కూడా జోడించి కొన్ని నీళ్లతో పిండి కలిపి.. గవ్వలు చేయొచ్చు. అది కష్టమనుంటే.. కొంచెం మందమైన చపాతీలు చేసి, చతురస్రం, త్రిభుజం.. =ఇలా ఇష్టమైన ఆకృతిలో ముక్కలుగా కట్ చేయొచ్చు. లేదా సన్నగా చీలికలుగా చేసి ఒక్కోదాన్నీ కింది నుంచి పైకి రోల్ చేసినా చూడసొంపుగా ఉంటాయి. ఇలా నచ్చినట్టు చేశాక.. కాగుతున్న నూనెలో వేయించుకుంటే.. నోరూరించే కారం గవ్వలు సిద్ధమైపోతాయి. □

# పిల్లలు సెలవుల్లో సరదాగా..



ముందు ఖాళీ బాటిళ్లను తీసుకోవాలి. క్రాఫ్ట్ స్టోర్‌లో దొరికే కలర్ ఇసుకను తీసుకొచ్చి వాటిల్లో వేయాలి. ఆ తర్వాత ఓ కర్రకు చెక్క లేదా గట్టిగా ఉండే ప్లాస్టిక్ రింగునొకదాన్ని కట్టి వేలాడదీయాలి. మరో పెద్ద రింగు మధ్యలో బాటిల్‌ను అడ్డంగా ఉంచండి. ఇప్పుడు ఆ కర్ర సాయంతో ముందుగా ఎవరైతే బాటిల్‌ను నిలువుగా నిలబెడతారో వాళ్లు గెలిచినట్టు! ఈ ఆట పిల్లల్లో ఏకాగ్రత, మెంటల్ బ్యాలెన్స్‌ను పెంచుతుంది. □

# మెరిసే అందం కోసం..

అందానికీ, ఎంటర్‌టైన్స్‌మెంట్‌కీ హద్దులుండవు కదూ! అలా మనం అనుసరించే వారిలో కొరియన్లూ ఒకరు. ఆ చిత్రాలకే కాదు.. వారి చర్మతత్వానికీ మన అమ్మాయిలు ఫిదా అవుతుంటారు. అంతటి నున్నటి, మెరిసే **చర్మం కావాలా..** వారి స్కిన్ కేర్ రొటీన్‌ను మీరూ అనుసరించేయండి.

డబుల్ క్లెన్సింగ్... మేకప్‌తో సంబంధం లేకుండా డబుల్ క్లెన్సింగ్‌కి ప్రాధాన్యమివ్వాలి. ముందు మిసెల్లర్ వాటర్ లేదా ఆయిల్ క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రపరచుకోవాలి. **లేదంటారా..** కొబ్బరి, ఆలివ్, బాదం నూనెల్లో నచ్చినదాన్ని తీసుకొని ముఖానికి పట్టించండి. మృదువుగా వృత్తాకారంలో ముఖమంతా రుద్దితే సరి. చర్మరంధ్రాల్లోని మురికి బయటికి రావడమే కాదు. మర్దనా జరిగి రక్తప్రసరణా మెరుగవు తుంది. తర్వాత నచ్చిన లిక్విడ్ సోప్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తే సరి.



టోనింగ్ తప్పని సరి.. ముఖం కడిగేటప్పుడు చర్మ రంధ్రాలు తెరుచు కుంటాయి. వాటిని తిరిగి మూయడంలో దీనిదే ప్రధాన పాత్ర. చర్మానికి తాజాదనంతో పాటు తేమనీ అందిస్తుంది. మీ అవసరాలకు తగ్గట్టు విటమిన్ సి, నియాసినమైడ్, గ్రీన్ టీ.. నచ్చిన రకాలను ఎంచుకోవచ్చు. గ్లాసీ లుక్ కావాలి అనుకుంటే సెరమైడ్స్ ఉన్నవి ఎంచుకోండి. 30 దాటితే కొల్లాజెన్‌ను పెంచేవి వాడితే మంచిది. □

# నలుగురిలో ప్రత్యేకంగా..

ఆరునెలల్లో మనమేంటో తెలిసిపోతుంది. వ్యక్తిగత లేదా వృత్తి జీవితాల్లో నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని కోరుకోని అమ్మాయి ఉంటుందా! ఈ గుర్తింపు రావాలంటే ఈ సూత్రాలు పాటించాల్సిందే..

**ఆహార్యంతో:..** పుట్టుకతో వచ్చిన ఛాయ, రూపం.. వంటి వాటిని మార్చలేం. కానీ ఉన్నదాంట్లోనే ఉత్తమంగా కనిపించే అవకాశం మన చేతుల్లోనే ఉంది. అలాగని ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, వస్తువులు వేసుకోవాలనే కాదు. మనం ఏది ధరించినా అందులో మన వ్యక్తిత్వం ప్రస్ఫుటించాలి. హుందాతనాన్ని మరింత పెంచేలా ఉండాలి. ఎవరు ఎంత చెప్పినా సరే.. ఒక మనిషిని చూడగానే ఎదుటివారు మొదట గమనించేది మన **ఆహార్యాన్నే..** కాబట్టి దానిమీద శ్రద్ధపెట్టడం చాలా ముఖ్యం. నువ్వు నీలా ఉంటేనే.. కొందరు నలుగురు



మెప్పు పొందాలని.. లేని అలవాట్లు, పద్ధతులను అనుసరిస్తుంటారను. ఈ ధోరణి సరికాదు. ఎందుకంటే మనం ఎంత దాచిపెట్టినా మన వ్యక్తిత్వం ఎదుటి వారికి 6 నెలల్లోపే తెలిసి పోతుందట. దాన్ని ఎక్కువ రోజులు ఎవరి దగ్గరా దాచలేమనేది అందరికీ తెలిసిన సత్యమే. ముందు మనం మనలా, నిజాయితీగా ఉండాలి. మన నమ్మకాలను, విలువలను, వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉండాలి. అప్పుడే మనకు స్నేహితులు, బంధువులు ఎవరి వద్దయినా గౌరవం ఉంటుంది.

**వినటం నేర్చుకుంటే..** ఒక్కోసారి మన ఎదుటివారు చెప్పే విషయాలను శ్రద్ధపెట్టి వినం. అలాంటప్పుడు మనం తిరిగి సమాధానం చెప్పాల్సివస్తే ఏం చెప్పాం? అందుకే ఇతరులు చెప్పే విషయాల్ని శ్రద్ధగా విని, ఆలోచించి స్పందిస్తే వారిని మనం గౌరవించినట్లే. అప్పుడు వాళ్లూ మనల్ని తిరిగి గౌరవిస్తారు. అదే విధంగా మనం రకరకాల వ్యక్తులతో కలిసి పనిచేస్తుంటాం. ఒక్కొక్కరి ఆలోచన, అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. తొందరపడి వాళ్లపైన మీరు ఇది అనే ముద్ర వేయకుండా చెప్పింది వినాలి. అది మన అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంచటమే కాకుండా, వారితో మన అనుబంధాన్నీ బలపరుస్తుంది. దాంతో పాటు గౌరవాన్నీ ఇస్తుంది. □

# స్నేహ

ఆధ్యాత్మికం



మనిషి జీవితంలో అతిమధురమైనది స్నేహం. జీవితాంతం చెరిగిపోనిది స్నేహ బంధం. తల్లిదండ్రులతో, తోబుట్టువులతో, సంతానంతో, కట్టుకొన్న భార్యతో కూడా చెప్పుకోలేని కొన్ని విషయాలను ప్రాణ సమానులైన స్నేహితులతో పంచుకోడానికి సామాన్యంగా ఎవరూ వెనుకాడరు. అయితే విశ్వాస పాత్రుడూ, శ్రేయోభిలాషీ అయిన సుగుణవంతునితోనే చెలిమి చేయాలంటారు పెద్దలు. శ్రీరాముని బాధలలో పాలుపంచుకొని, సాయంచేసి, తరించారు ఆయన స్నేహితులైన గుహుడు, ఆంజనేయుడు, సుగ్రీవుడు. ప్రాణ స్నేహితునిగా, జీవిత సారథిగా, చెలికానిగా, గురువుగా అర్జునునికి తోడై నిలిచి శ్రీకృష్ణుడు అతనికి విజయాన్ని, శాశ్వత కీర్తిని కల్గించాడు. వారిది నర (అర్జునుడు) నారాయణ (శ్రీకృష్ణుడు) బంధం. కర్ణ దుర్యోధనుల స్నేహం కూడా గాఢమైనదే. కానీ దుర్గుణ సంపన్నుడైన సుయోధనునితో స్నేహం చేసి, అధర్మం వైపున నిలిచినందు వలన కర్ణుని కీర్తి మసకబారింది. మైత్రీబంధ వినిష్ఠితులైన మహనీయులు మనకు చాలా మంది పురాణేతిహాసాలలో కన్పిస్తారు. శ్రీకృష్ణ కుచేలుల మైత్రి జగతికే ఆదర్శమైంది.

"మిత్రే నివేదితే దుఃఖే/ దుఃఖినో జా యతే లఘుః / భారం భార వహస్యేన/ స్కంధయోః పరివర్తితే ". బరువులను మోసేటప్పుడు ఒకే భుజంపైననే కాక, మధ్య మధ్యలో ఆ బరువును రెండో భుజంపైకి మార్చుకొంటూ ఉంటే భారమనిపించనట్లు, మిత్రునికి బాధ చెప్పుకొంటే దుఃఖ భారం ఉపశమిస్తుందని పై సుభాషితం చెబుతుంది.

అంతేకాదు. " కరాని వ శరీరస్య , నేత్రయోరి వపక్ష్మణీ / అవిచార్య ప్రియం కుర్యాత్ తన్మిత్రం మిత్ర ఉచ్యతే " శరీరానికి చేతులలాగా, కళ్ళకు రెప్పల లాగా, స్వచ్ఛందంగా, వేరే ఆలోచనే లేకుండా సహాయపడే వాడు, మేలు చేసే వాడే స్నేహితుడనబడతాడు. అలాంటి సన్మిత్రుడు లభించినవాడు చాలా అదృష్టవంతుడు అదే స్నేహభాగ్యము.

–డా. గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి

# మహిళలకు శక్తి నిచ్చే బాదం !

**ఇంటి బాధ్యతలన్నీ నెత్తి వేసుకుని అందరి గురించీ ఆలోచించే మహిళల్లో ఎక్కువమంది పోషకాహార లోపంతో** బాధపడుతు న్నారని చెబుతున్నారు పలు అధ్యయనాలు. అందుకే, రోజూ గుప్పెడు బాదం గింజల్ని తినమని సూచిస్తున్నారు. మరి దీని ప్రయోజనా లేంటో తెలుసుకుందామా !

ే.బాదం గింజల్లో విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రొటీన్, రైబోఫ్లేవిన్, జింక్ వంటి 15 రకాల పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యం ఉంచేందుకు దోహదపడతాయి. పోషకాల లేమిని తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు యాంటీ ఏజింగ్ గుణాలూ బాదంలో ఎక్కువ. వీటిని తీసుకోవడం వల్ల చర్మం ముడతలు పడకుండా ఉంటుంది.

ే. ఇందులో ఎక్కువ దొరికే ప్రొటీన్ శక్తి నివ్వడంతో పాటు కండరాల సాంద్రతను పెంచుతుంది. అలానే ఇందులోని విటమిన్ బి2, విటమిన్ ఇ, మెగ్నీషియం, ఫాస్ఫరస్‌లు నరాల పనితీరుని పెంపొందిస్తాయి. అంతేకాకుండా బాదం తినడం వల్ల త్వరగా కడుపునిండినచ భావన కలిగి అతిగా తినే అలవాటు తగ్గుతుంది. ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ తక్కువగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ే బాదం తినడం వల్ల రక్తంలో చక్కెరలు సమన్వయం అవుతాయి. ఇన్సులిన్ ఉత్పత్తి బాగుంటుంది. అలానే, ఇందులో అధిక మోతాదులో లభించే కాల్షియం ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. కండరాల పనితీరుని మెరుగుపరుస్తుంది. శరీరంలో ఎర్రరక్త కణాల శాతాన్ని పెంచి రక్తహీనతను నివారించడంలో ఐరన్ పాత్ర ఎక్కువే. ఫలితంగా మహిళల్లో రక్తహీనత అదుపులోకి వస్తుంది. ఇది బాదం గింజల్లో పుష్కలంగా లభిస్తుంది. శరీరంలోని అన్ని అవయవాలకూ ఆక్సిజన్ సరఫరా సక్రమంగా ఉండేలా చూస్తుంది. మెటబాలిజాన్నీ, వ్యాధినిరోధక శక్తినీ పెంచుతుంది. □

# 'భైరవం' నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది..మంచు మనోజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తు తోంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. ఈ సినిమా మే 30న వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవు తోంది. ఈ నేపథ్యంలో మనోజ్ మంచు విలేకరుల సమా వేశంలో సినిమావిశేషాలు పంచుకున్నారు.



**భైరవం జర్నీ ఎలా స్టార్ట్ అయింది?** ఒక సినిమా ఈవెంట్‌కి వెళ్ళినప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కలిశారు. డైరెక్టర్ విజయ్ నన్ను కలవా లని అనుకుంటున్నారని చెప్పారు. అలా ఫోన్ నెంబర్ ఇవ్వడం జరిగింది. విజయ్ ఈ కథగురించి చెప్పారు. నాకు చాలా నచ్చింది. ఇమ్మీడియట్‌గా ఒకేచేశాను.

**ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** గజపతి వర్మ లాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు నేను చేయలేదు. చాలా ఇంటెన్స్ అండ్ ఫెరోషియస్ క్యారెక్టర్. భైరవం తప్పకుండా నా కెరియర్‌లో చాలా ప్రత్యేకంగా నిలుస్తుంది.సాయి నాకు తమ్ముడు లానే వాడు. రోహిత్ నాకు మంచి ఫ్రెండ్. ఈ సినిమా వలన మీ ముగ్గురు ఎక్కువ టైం స్పెండ్ చేసాము.

**నాన్న నుంచి మీరు ఏం నేర్చుకున్నారు?** నమ్మినోల్ని బాగా చూసుకోవడం, పదిమందికి హెల్ప్ చేయడం. ఆయన కష్టపడుతూ పైకి వచ్చారు. ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. నిజాయితీగా ఉండడం ఆయన దగ్గరే చూసి నేర్చుకున్నాను. నాకు మా ఫాదరే హీరో.

**మీరు మంచిగా బిర్యాని వండు తారని అతిధి శంకర గారు చెప్పారు?** హాస్టల్లో ఉండే వాళ్ళం కాబట్టి వంట చేయడం అలవాటు. అలా సెట్స్‌లో ఉండే టప్పుడు కూడా కొంచెం సమయం దొరికితే వంట చేయ డం మొదలు పెట్టే వాళ్ళం. అలాగే రోహిత్ కూడా చాలా మంచి వంట చేస్తారు.

**మీరు సోలోగా ఎప్పుడు వస్తున్నారు?** అహం బ్రహ్మాస్మి సోలోగా వద్దామని చేసుకున్న కథ. అయితే అది కొన్ని కారణాల వల్ల కుదరలేదు.

**డైరెక్టర్ విజయ్‌కనకమెడల గురించి?** విజయ్ తెలుగు ఆడియన్స్ పల్స్ మీద చాలా మంచి గ్రిప్ ఉంది. అన్ని కమర్షి యల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాని ప్రజెంట్ చేశారు. గరుడన్ సినిమా చూసిన వాళ్లు కూడా ఈ సినిమా చూస్తే చాలా సర్ప్రైజ్ అవుతారు. తన మీద చాలా గౌరవం పెరిగింది. ఆయన లాంటి డైరెక్టర్స్ మరింత మంది రావాలి.

# 'హరిహర వీరమల్లు' కి కీరవాణి సంగీతం భేష్

మనలోని పౌరుషం.. వీరత్వం ఎన్నటికీ చల్లబడిపోకూడదు అని ప్రతి ఒక్కరినీ తట్టిలేపే సలసల మరిగే నీలోని రక్తమే...అని పాటకు సంగీత, సాహిత్యాలతో ప్రాణం పోశారు శ్రీ కీరవాణి గారు. హరిహర వీరమల్లులో ఈ గీతం వినిపిస్తుంది. నేటి పరిస్థితులలో మనందరిలో వీరత్వం చేవజారిపోకూడదని చర్నాకోలతో చెప్పినట్లు అనిపించింది. ఈ పాటను 21వ తేదీన అందరికీ విన్పించబోతు న్నారు. హరిహర వీరమల్లు చిత్రానికి కీరవాణి అందిం చిన సంగీతం, నేపథ్య సంగీతం ఆ చిత్ర కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకువెళ్తాయి. ఈ సినిమా కోసం ఎంత తపన చెంది స్వరాలు అందించారో



స్వయంగా చూశాను. వీరమల్లుకి ప్రాణం పోశారు అంటే అతిశయోక్తి కాదు. మొదటిసారి మీతో చేస్తున్నాను అంటే... అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టు ఉండాలి కద్దా అనడం కీరవాణిలో అంకిత భావాన్ని తెలియచేస్తోంది. ఆస్కార్ గ్రహీత కీరవాణిని కలిసి సాగించిన సంభాషణ ఎంతో సంతోషాన్ని కలిగించింది. సంగీత దర్శకులు చక్రవర్తి దగ్గర శిష్యరికం నుంచి సరస్వతి పుత్రులైన శ్రీ వేటూరి సుందర రామమూర్తి, శ్రీ సిరివెన్నెల సీతా రామశాస్త్రి వరకూ తనకున్న అనుబంధాన్ని, సంగీత సాహిత్యాల గురించి చెబుతుంటే సమ యం తెలియలేదు. కీరవాణి దగ్గర ఉన్న వయొలిన్లు చూసి వాటి గురించి మాట్లాడుకొం టున్నప్పుడు - నేను వయొలిన్ నేర్చుకోవడం, జంట స్వరాల వరకూ నేర్చుకొని వదిలేయడం గుర్తు చేసుకున్నాను. చిదంబరనాథన్ ఇచ్చిన వయొలిన్ ను ఎంత భద్రంగా దాచుకున్నారో చూపించారు కీరవాణి. తెలుగు కథలను ప్రేమించే కీరవాణి తనకు అమితంగా నచ్చిన 32 కథలను ఒక సంకలనంలా చేసుకొన్నారు. వాటిని నాకు బహూకరించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అందులో కీరవాణి రాసిన రెండు కథలు కూడా ఉన్నాయి.




# మళ్లీ తెరపైకి 'మాయాబజార్'

మాయాబజార్ సినిమా విడుదలై నేటికీ 68 సంవత్సరాలు. ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్.వి.రంగారావు, సావిత్రి, రేలంగి, గుమ్మడి, ముక్కామల, మిక్కిలినేని, అల్లు రామలింగయ్య, ఆర్.నాగేశ్వర రావు, సూర్యకాంతం, రమణా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన గొప్ప పౌరాణిక చిత్రం. విజయా ప్రొడక్షన్స్ పతాకంపై నాగిరెడ్డి, చక్రపాణి మాయాబజార్ చిత్రాన్ని చిరస్మరణీయంగా రూపొందించారు. దర్శకుడు కె.వి.రెడ్డి మాయా



బజార్ చిత్రాన్ని అపూర్వంగా, అనూహ్యంగా, అనితర సాధ్యంగా తెలుగు తెరపై ఓ సెల్యు లాయిడ్ కావ్యంగా మలిచారు. మాయాబజార్ చిత్రాన్ని ఈనెల 28న మహానటుడు ఎన్. టి. రామారావు 102వ జయంతి సందర్భంగా బలుసు రామారావు విడుదల చేస్తున్నారు. మాయా బజార్ సినిమాకు పింగళి నాగేంద్ర రావు అద్భుతమైన మాటలను అందించారు. ఛాయాగ్రాహ కుడు మార్కస్ బార్ట్ లే ఈ సినిమాను నవరస భరితంగా తెరమీద చూపించారు. ఘంటసాల సంగీత దర్శకత్వంలో ఈ చిత్రాల్లోని పాట్లను ఈ తరం ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణుడుగా ఎన్.టి.రామారావు, ఘటోత్కచుడుగా ఎస్.వి.రంగారావు, శశి రేఖగా సావిత్రి, అభిమన్యుడిగా అక్కినేని నాగేశ్వర రావు ఆయా పాత్రలను సజీవంగా మన ముందు నిలబెట్టారు. 27 మార్చి 1957లో ఆంధ్ర దేశంలో విడుదలై సంచలన విజయం సాధించింది. ఈ సినిమాను కలర్‌లో మళ్ళీ తెలుగు ప్రేక్షకుల కోసం రామారావు బలుసు ఈనెల 28న విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మాయాబజార్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా టిడి జనార్దన్, రమేష్ ప్రసాద్, ఎస్వి కృష్ణారెడ్డి అచ్చి రెడ్డి, దర్శకుడు వీర శంకర్, భగీరథ, వైజె రాంబాబు, త్రిపురనేని చిట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చెర్మన్ శ్రీ టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ, మాయాబజార్ సినిమా అప్పటి ఇప్పటి తరానికి ఒక మైలు రాయి లాంటిది. ఇప్పటితరంలో ఎన్నో గ్రాఫిక్స్ వచ్చినా ఆనాడే గ్రాఫిక్స్ లేని సమయంలో ఎంతో అద్భుతంగా మాయాబజార్‌ను మలిచి తిరుగులేని విజయాన్ని అందుకున్నారు. మళ్లీ ఇప్పుడు మాయాబజార్‌ని బలుసు రామారావు విడుదల చెయ్యడం అభినందించదగ్గ విషయం. సినీరంగంలో రారాజుగా నిలిచిన ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఓ ధ్రువతారగా అభివర్ణిం చారు. ఎన్టీఆర్ ముందు, తర్వాతగా తెలుగునాట రాజకీయాల్ని చెప్పుకోవాలని, రాజకీయాల్లో నైతిక విలువల్ని, ప్రజాస్వామ్య విధానాల్ని, సంక్షేమ శకాన్ని ప్రారంభించిన మహాపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. 2023లో ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీని ఏర్పాటు చేశాము, ఎన్టీఆర్ నమ్మి ఆచరించిన మహోన్నత ఆశయాలు, సిద్ధాంతాలు, విధానాల్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో తాము ఎన్టీఆర్‌కు సంబంధించిన అపురూప గ్రంధాలను వెలువరిచాము.

# 'వార్ 2' టీమ్ టీజర్ విడుదల

ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ కలయికలో రాబోతున్న మోస్ట్‌వాంటెడ్ పాన్ ఇండియా మల్టీస్టారర్ వార్ 2. ఈ సినిమా ఆగస్టు 14, 2025న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఐతే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భం గా వార్ 2 టీమ్ టీజర్‌ను విడుదల చేసింది. ఇందులో ఎన్టీఆర్ పవర్ ఫుల్‌గా కనిపించారు. నా గురించి తెలియదేమో.. ఇప్పుడు తెలుసుకుంటావ్.. గెట్ రెడీ ఫర్ ద వార్ అంటూ ఎన్టీఆర్ డైలాగ్, యాక్షన్ సన్నివేశాలతో ఉన్న ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. ఇక రెండో పాటను హృతిక్ ఎన్టీఆర్‌పై షూట్ చేయనున్నారు. వచ్చే నెల హృతిక్‌తారక్‌పై ఈ సాంగ్‌ను 7 రోజుల పాటు షూట్ చేస్తారట, ఈ సాంగ్‌లో తారక్ స్టెప్స్ అదిరిపోతాయని తెలుస్తోంది. కాగా, మోస్ట్ వాంటెడ్ పాన్



ఇండియా మల్టీస్టారర్స్‌లో వార్ 2 ఫస్ట్ ప్లేస్‌లో ఉంటుంది. పైగా ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ కలయిక అనగానే ఆడియన్స్‌లో కూడా భారీగా అంచనాలు పెరిగిపోయాయి. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రపై ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. నిర్మాత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది.

# 'ఎం4ఎం' స్క్రీనింగ్, రెడ్ కార్పెట్‌పై దక్కిన గౌరవం

2025 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఓ తెలుగు సినిమా మన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. మోహన్ వడ్లపట్ల, జో శర్మ మూవీ ఎం4ఎం. కేన్స్‌లోని ప్రెస్టీజియస్ థియేటర్‌లో ఎం4ఎం మూవీ రెడ్ కార్పెట్ స్క్రీనింగ్ జరిగింది. ఈ వేడుకకు అంత ర్జాతీయ ప్రేక్షకులు భారీ సంఖ్యలో హాజర య్యారు. తెలుగు చిత్రసీమ తరపున దర్శకుడు మోహన్ వడ్లపట్ల తో పాటు అమెరికాకు చెందిన నటి జో శర్మ గౌరవంగా రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ప్రదర్శన అనంతరం ప్రేక్షకులు హర్ష ధ్వానాలు చేయడంతో పాటు, విమర్శకులు, సినీ అభిమానుల నుంచి ప్రశంసలు లభిం చాయి. ఇది తెలుగు సినిమాకు కేన్స్‌లో దక్కిన అరుదైన ఘనత. ఇటీవల అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందుతున్న జో శర్మ, ఈ ఈవెంట్‌లో దుబాయ్, ఢిల్లీలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన దుస్తులు ధరించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె ఫ్యాషన్ సెన్స్, నటనా ప్రతిభకు అక్కడి మీడియా ప్రశంసలు కురిపిం చింది. మోహన్ మీడియా క్రియేషన్స్, మ్యాక్‌విన్ గ్రూప్ గీళీతి సంయుక్తంగా నిర్మించిన ఎం4ఎం, కేన్స్ 2025లో ప్రదర్శించిన ఏకైక తెలుగు చిత్రం. ఈ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ కథ అంతర్జా తీయ ప్రేక్షకులను ఆకట్టుకుంది. కథన బలంతో పాటు సినిమాటిక్ ప్రెజెంటేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ సహా ప్రపంచ సినీ పరిశ్రమ నుండి పలువురు ప్రముఖులు హాజరై చిత్రానికి అభినందనలు తెలిపారు. గత కొన్నేళ్లుగా తెలుగు సినిమాకు కేన్స్‌లో ఊరిస్తున్న ఈ అరుదైన గౌరవం, ఎం4ఎం మూవీకి దక్కడంతో ఈ ప్రీమియర్ తెలుగు చలనచిత్ర చరిత్రలో గొప్ప ఘట్టంగా నిలిచింది. టాలీవుడ్ నిర్మాతగా మంచి గుర్తింపు ఉన్న మోహన్ వడ్లపట్ల, ఈ చిత్రంతో దర్శకుడిగా ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు పొందారు. జో శర్మ అభినయం ప్రపంచ స్థాయిలో ప్రశంసలందుకుంది. త్వరలో ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. భారతీయ ప్రాంతీయ సినిమాకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన సినిమాగా ఎం4ఎం విడుదలకు ముందే అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు అందుకుంటోంది.



# సోషల్ మీడియాలో రాశీ ఖన్నా గాయపడిన ఫోటో..

స్టార్ హీరోయిన్ రాశీఖన్నా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆమెనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ ఫొటోల్లో రాశీఖన్నా తన ముక్కు నుంచి రక్తం కారుతుంది. అలాగే, రాశీఖన్నా కాళ్లకు, చేతులకు కూడా దెబ్బలు తగిలి రక్తం కారుతూ ఉంది. ఓ సినిమా షూటింగ్‌లో రిస్కీ యాక్షన్ సీన్స్‌లో రాశీఖన్నా పాల్గొంది. అందువల్లే ఆమెకు ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో ఫర్జీ2 అనే వెబ్ సిరీస్‌లో యాక్ట్ చేస్తోంది. అన్నట్టు రీసెంట్‌గా హీరోయిన్ రాశీఖన్నా తన పెళ్లి గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశీ ఖన్నా తన మ్యారేజ్ ప్లాన్స్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేస్తూ.. నా పెళ్లిపై కొన్ని రూమర్స్ వినిపిస్తు న్నాయి. అవి నిజం కాదు. ఐతే, నాకు పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలని ఉంది. కానీ నా పెళ్లికి ఇంకా సమయం ఉంది. అయినా, నా పెళ్లి అనేది నా పర్సనల్ మ్యాటర్. కాబట్టి ఇక్కడ దాని గురించి డిస్కస్ చేయాలను కోవడం నాకు ఇష్టం లేద్దు అంటూ రాశీఖన్నా తెలిపింది.





# విశాల్ పెళ్లిపై సాయి ధన్సిక క్లారిటీ

తమిళ హీరో విశాల్ తెలుగు ఆడియెన్స్‌లోనూ మంచి క్రేజ్‌ను దక్కించుకున్నాడు. ఆయన నటించే తమిళ చిత్రాలను



తెలుగులోనూ గ్రాండ్‌గా రిలీజ్ చేస్తారు. ఇక గతకొద్ది రోజులుగా విశాల్ పెళ్లిపై పలు వార్తలు వినిపిస్తూ ఉన్నాయి. అయితే, తాజాగా విశాల్‌తో పెళ్లిపై హీరోయిన్ సాయి ధన్సిక క్లారిటీ ఇచ్చేసింది. ఓ ఈవెంట్‌లో మాట్లాడిన సాయి ధన్సిక త్వరలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నానని.. హీరో విశాల్‌తో తన పెళ్లి ఆగస్టు 29న జరగనుందని తెలిపింది. అదే ఈవెంట్‌లో విశాల్ కూడా ఉండటంతో వారు అధికారికంగా తమ పెళ్లి డేట్‌ను ప్రకటించారు. ఇక ఈ వార్తతో వారి అభిమానులు శుభాకాంక్షలు తెలుపు తున్నారు. విశాల్‌సాయి ధన్సిక వివాహం కోసం సినీ పరిశ్రమ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

# ఈ తరం హీరోయిన్స్‌కు అన్షు అంబానీ పోటీ

టి అన్షు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ముద్దుగుమ్మ మన్మథుడు సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. అక్కినేని నాగార్జున సరసన నటించిన ఈ తెలుగు రొమాంటిక్ కామెడీ సినిమాతో ఆమె గుర్తింపు పొందింది. ఈ చిత్రంలోని గుండెల్లో ఏముందో పాటలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా తర్వాత ఆమె ప్రభాస్ సరసన రాఘవేంద్ర సినిమాలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత ఓ తమిళ్ సినిమాలోనూ నటించింది ఈ చిన్నది. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ చిన్నది ఇటీవలే తిరిగి రీ ఎంట్రీ ఇచ్చింది. 21 సంవత్సరాల విరామం తర్వాత, ఆమె సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్‌లతో కలిసి మజాకా చిత్రంతో తెలుగు సినిమాల్లోకి తిరిగి అడుగుపెట్టింది. ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2025న విడుదలైంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. మజాకా సినిమా సూపర్ హిట్ కావడమే కాదు.. మరోసారి తన నటనకు మరోసారి ప్రశంసలు అందుకుంది. దీంతో ఇప్పుడు తెలుగులో మరిన్ని ఆఫర్స్ వస్తే చేసేందుకు రెడీగా ఉంది అన్షు. ఇదిలా ఉంటే.. సోషల్ మీడియాలో అన్షు చాలా యాక్టివ్. నిత్యం తన ఫ్యామిలీతోపాటు తన క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తూ



ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు మోడ్రన్ డ్రస్‌లో మరింత అందంగా కనిపిస్తుంది. వయ్యారాల సింగారంతో ఫాలోవర్లను కట్టిపడేస్తుంది ఈ చిన్నది.



## టంగుటూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 69వ వర్ధంతి సందర్భంగా అసెంబ్లీ ముందున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ, స్వాతంత్ర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు సేవలను రాబోయే తరం గుర్తుంచుకోవాలన్నారు. ఆయన జీవిత ఆశయాలను మనమంతా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వేణుగోపాలాచారి, తదితర నేతలు పాల్గొన్నారు.

## ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకున్నా రూ.1 లక్ష ఆర్థిక సాయం

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. గతంలో ఒకరు దివ్యాంగులు, మరొకరు సాధారణ వ్యక్తి పెళ్లి చేసుకుంటేనే రూ. లక్ష ప్రోత్సాహం లభించేది. ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకుంటే వర్తించేది కాదు. ఈ సమస్య దశాబ్దాల కాలంగా ఉండగా తాజాగా మంత్రి సీతక్క చొరవతో దీనికి చెక్ పడింది. ఇద్దరికీ ప్రోత్సాహకం అందేలా కాంగ్రెస్ సర్కార్ జీవో జారీ చేసింది. ఇక నుంచి ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ. లక్ష ఆర్థిక సహాయం వర్తింపజేయాలని పేర్కొన్నది. ఈ మేరకు మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఆదేశాలు జారీ చేశారు.

## రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్‌ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

### ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఎస్సి, ఎస్టి సొసైటీల్లో 6వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు బ్యాక్ లాగ్ సీట్లతోపాటు 6వ తరగతిలో రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు అర్హత పొందిన విద్యార్థులు స్కూల్స్‌లో చేరడానికి గడువును పొడిగించారు. మంగళవారం(మే 20)తో గడువు ముగియడంతో ఈ నెల 25 వరకు చేరడానికి అవకాశం కల్పించినట్టు టిజిసెట్-2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ విఎస్ అలగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశానికి ఫిబ్రవరి 23న నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఏప్రిల్ 28న విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులు ఆయా పాఠశాలలో చేరేందుకు మంగళవారం(మే20) తుది గడువు కాగా, ఇప్పుడు గడువునుకాస్త ఈ నెల 25 వరకు పొడిగించడం జరిగిందని అలగు వర్షిణి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అలాగే తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సి గురుకుల సొసైటీ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న పరీక్షను నిర్వహించారు. అర్హత పొందిన విద్యార్థులలో రుక్మా పూర్ సైనిక్ స్కూల్ లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను 1:10 చొప్పున ఎంపిక చేసి ఫిజికల్, మెడికల్ టెస్ట్‌లను ఈనెల మొదటి వారంలో నిర్వహించడం జరిగింది. మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్ దగ్గరగల ఏదులాబాద్ ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న పరీక్షను నిర్వహించడం జరిగింది.

## సైనికులపై చిల్లర కామెంట్స్ చేసిన ఘనత బిజెపిదే : మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** సైనికులపై చిల్లర కామెంట్స్ చేసిన ఘనత బిజెపిది, చివరకు పాకిస్తాన్‌పై దాడి చేసి వచ్చిన సోఫియా ఖురేషీపై కూడా అభ్యంతర కరమైన వ్యాఖ్యలు బిజెపి మంత్రి చేయడం ఓట్లకోసం వారి దిగజారుడు రాజకీయం తేటతెల్లం అవుతోందని మాజీ రాజ్యసభ సభ్యుడు,మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హను మంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ భవన్‌లో మాజీ ఎంపీ విహెచ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఛీప్ పొలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆపరేషన్ సింధూర్ ను రాజకీయం కోసం వాడుకుంటున్నారని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన ఫ్యామిలీ రాహుల్ గాంధీ కుటుంబం అని ఆయన గుర్తుచేశారు. దేశభక్తి కల్చర్ కాంగ్రెస్ పార్టీ కి ఉంది అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ లో చిచ్చు పెట్టే ఆలోచన కిషన్ రెడ్డి చేయడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశంలో స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తీకరణ చేయలేని నియంతృత్వ పరిస్థితికి తీసుకొని వచ్చారని ఆయన ఆవేదన చెందారు.

## రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### జూన్ 3 వరకు కొనసాగింపు

### ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి.. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసే వారికోసం నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పటి వరకు రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారనే విషయాన్ని ఇంటర్ బోర్డు ప్రకటించ లేదు. రాష్ట్రంలో ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులను వార్త ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించ లేదు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి(మే 22 గురువారం) నుంచి జూన్ 3 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగనున్నాయి. మార్చి 5 నుంచి 25 వరకు జరిగిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో 2,89,907 మంది ఫీజు చెల్లించినట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు చేసుకున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు ఈ నెల 17న విడుదల చేసింది. రాష్ట్రంలో మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. మొదటి సంవత్సరంలో 4,88,430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 3,22,191 మంది పాసయ్యారు. మరో 1,66,239 మంది ఫెయిలయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,08,582 మంది పరీక్షలకు హాజరు కాగా.. వారిలో 3,33,908 మంది ఉత్తీర్ణులయ్యారు.. మరో 1,74,674 మంది ఫెయిలయ్యారు.

# కిక్కిరిసిపోయిన త్రివేణి సంగమం

### 6వ రోజు భక్తుల రాకతో జనసంద్రమైన కాళేశ్వరం

### తాకిడి పెరగడంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం



**కాళేశ్వరం, మే 20, ప్రభాతవార్త:** 'కాళేశ్వర నివాసోపా, కాళేశ్వర నిరీక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం' అని స్తుతిస్తూ భక్తులు త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. 6వ రోజు కూడా త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పునీతులై నీరాజనాలు అర్పిస్తున్నారు. 6వ రోజు కూడా భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నం అయింది. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్ళు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**6వ రోజు..**

పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకత ననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొం దించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రాదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో 6వ రోజున ఔషధ దానం, కర్పూర దానం, చందన దానం, కస్తూరి దానం చేయాలని పురణాలు వివరించాయి. ఈ రోజు పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. 6వ రోజైన మంగళవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు.

# గుల్జార్‌హౌస్ మృతులకు ఎంపిలు, ఎమ్మెల్యే నివాళులు

### బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఈటల, కొండా, రాజాసింగ్

### ఒకే కుటుంబంలో 17 మంది చనిపోవడం బాధాకరం

### ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్



మృతులకు నివాళులర్పిస్తున్న ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (అత్తాపూర్) మే 20, ప్రభాతవార్త :** ఒకే కుటుంబంలో 17 మంది చనిపోవడం బాధాకరమైన విషయమని ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పేర్కొన్నారు. పాతబస్తీ గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదంలో మరణించిన మోదీ అగర్వాల్ కుటుంబ సంతాప సభను మంగళవారం రాజేంద్రనగర్ పరిధిలోని ఎస్ఎన్‌సి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ తొకల శ్రీనివాస్ రెడ్డిలు హాజరై మృతుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. చార్మినార్, గుల్జర్ హౌస్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి 17 మంది చనిపోవడం యావత్ సమాజాన్ని కలిచివేసిందనిఅగ్నిప్రమాదం ఏ సమయంలో జరిగింది, ఎన్ని గంటలకు ఫోన్ వెళ్ళింది, ఏ టైం కు రెస్క్యూ సిబ్బంది వచ్చారు అనే దానిపై ముఖ్యమంత్రిని రాజకీయాలకు, వివక్షకు ఆస్కారం లేకుండా సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చార్మినార్, బేగంబజార్, ఓల్డ్ సిటీలో నిర్మాణాలు ఎప్పుడో కట్టినవి కాబట్టి ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరగకుండా ఉండాలంటే ఒక సమగ్రమైన ప్రణాళిక చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితుల్ని ఎస్సెట్ చేసి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలన్నారు. ఫైర్ డిపార్ట్మెంట్, వైద్య సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఒకటే కుటుంబంలో 17 మంది చనిపోవడం అనేది చాలా బాధాకరం. ఆ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్నానని వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుం టున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు, దుఃఖాలు మరొకరికి రాకూడదు అంటే ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళిక రూపొం దించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల్లో సరస్వతి నవరత్నమాల హారతి ప్రత్యక్ష ప్రసారం

**హైదరబాద్, మే 20, ప్రభాతవార్త:** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న సరస్వతి నవరత్నమాల హారతి ఘట్టాన్ని ప్రతీ రోజూ ప్రత్యక్ష ప్రసారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు మంగళవారం నుంచే ఈ హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రతీ రోజు సాయంత్రం నిర్వహించే సరస్వతి హారతిని ఇవ్వడానికి, కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతినిచ్చే పండితులను ప్రత్యేకంగా ప్రభుత్వం పిలిపించింది. దాదాపు అరగంట పాటు సాగే సరస్వతి నవరత్నమాల హారతిలో తొమ్మిది (ఓంకార హారతి, నాగహారతి,పంచహారతి, సూర్యహారతి, చంద్రహారతి, నంది హారతి, సింహహారతి, కుంభహారతి, నక్షత్రహారతి) ప్రత్యేక హారతులను ఇస్తారు.

## కాళేశ్వరం అవినీతిలో కెసిఆర్, హరీశ్, ఈటలకు జైలుకెళ్లే అర్హతలున్నాయి

### కిషన్‌రెడ్డి వంటి వారితో ఈ ప్రాంతానికి నష్టం

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్య

**హైదరాబాద్,మే 20,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఊరికినే భట్ట కాల్చి మీద వేయదు, రాజ్యాంగ బద్దంగా వ్యవహరించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చట్టానికి ఎవరు అతీతులు కాదు కాళేశ్వరం అవినీతిలో కెసిఆర్, ఈటెల, హరీష్‌రావు వీళ్ళ ముగ్గురికి జైలుకి వెళ్ళడానికి అన్ని అర్హతలు ఉన్నాయని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఈటెల రాజేందర్ గుడ్డిగా ఆర్థిక అనుమతులు ఎలా ఇచ్చారని అన్నారు. కేసీఆర్ విచారణకు హాజరై తన నిజాయితీ నిరూపించుకుంటే పూలదండలు వేస్తాం అని అన్నారు. కాళేశ్వరం ఆనాటి సిఎం, ఇరిగేషన్, ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామిక కోణంలో నిర్ణయం తీసుకుంటుంది, అందుకే కమిషన్ వేశామని అన్నారు. ఈటెల రాజేందర్ ని కేసీఆర్ కావాలనే బిజెపి లోకి పంపారా?? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈటెల రాజేందర్ తప్పు చేసి బిఆర్ఎస్ నుంచి బిజెపిలోకి వచ్చారా? ఇప్పుడు బిజెపి వారిని కాపాడుతుందా? తప్పు ఎవరు చేసిన జైలుకి వెళ్ళాల్సిందే అని అద్దంకి అన్నారు. తెలంగాణ దొంగలకు దొంగల దొడ్డిగా మార్చారని ఆయన ఆగ్రహం చెందారు. మేడిగడ్డ వద్ద 3 ఏళ్లలో ఒక్కపిల్లర్ పోతే ఏం అవుతుంది అని కేసీఆర్ అంటున్నాడు నాగార్జున సాగర్, శ్రీశైలం ఎందుకు ఒక్క పిల్లర్ కూడా కూలలేదు అని గుర్తుచేశారు. గతంలో గవర్నర్ కాళేశ్వరరావు అన్నారు ఇప్పుడు కూలగానే నోవేశ్వర్ రావు అంటున్నాడు. కాంగ్రెస్ బిఆర్ఎస్ ఒకటి అవుతార అందుకే అరెస్టు చేయడం లేదని ఇన్నాళ్ళుఅభియోగం మోపారని . ఇప్పుడు మీ నాయకుడు అరెస్టు అయ్యేజాబితాలో ఉన్నారని గుర్తుచేశారు. ఈటెల సీల్డ్ కవర్లో ఏదో దాచిపెట్టారో అని అది రాలేదు అనే నోరు జరారని అద్దంకి అన్నారు. బిజెపి పార్టీని ప్రశ్నిస్తే దేశ ద్రోహులవుతారా అని ఆయన ప్రశ్నించారు. బిజెపి పార్టీ దేశ స్వాతంత్ర్య పోరాటానికి సంబంధం ఏంటి? కిషన్ రెడ్డి లాంటి బానిసలు ఉండబట్టే ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం అని అన్నారు. బిజెపి అంటే బూతు జనతా పార్టీ అని కొత్త భాష్యం చెప్పారు.

# ఆపరేషన్ కగార్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతమంది మావోయిస్టులను చంపి వేశారు? మరేంత మందిని చంపుతారు? అసలు కేంద్ర ప్రభుత్వం లక్ష్యం ఏమిటో శ్వేత ప్రతం విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేనిసాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర బలగాలతోకలిసి రాష్ట్ర పోలీసులు సైతం పాల్గొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంపై దాడిచేసి అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులతో దౌత్య పరంగా చర్చలు జరుపుతామని ప్రకటించిన కేంద్రం.. దేశ పౌరులైన మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్దమని ప్రకటించి ముందుకు వచ్చారని.. వారితో చర్చలు జరపాలని దేశమంతా కోరుతున్నారన్నారు. కేంద్రం మాత్రం ఆపరేషన్ కగార్ పేరుతో వారిని మట్టుపెడుతోందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన కేంద్ర పాలకులు.. ఇప్పుడు న్యాయ వ్యవస్థనుపై మాటల దాడి కొనసాగిస్తూ చులకన చేసే ప్రయత్నం చేస్తున్నారని కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ద వ్యవస్థల మధ్య హక్కులు, న్యాయపరమైన చిక్కులు తలెత్తినప్పుడు వాటిలో కల్గజేసుకునివాటిని పరిష్కరించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన గవర్నర్లు ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పాలనపరమైన ఇబ్బందులు కలిగిస్తూ ఫైళ్లను పరిష్కరించకుడా తొక్కిపెడుతున్న నేపథ్యంలో వాటిని ఎంతకాలంలో క్లియర్ చేస్తారో స్పష్టత ఇవ్వాలని సూచించిన సుప్రీంకోర్టును రాష్ట్రపతి సైతం తప్పు పట్టడం ఏమిటని కూనంనేని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. పాత సంక్షేమ పథకాల పరిస్థితి ఏమిటని.. వాటిని అరకొరగా అమలు చేయడంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అతిముఖ్యమైన పథకాలైన ఇళ్లతోపాటు రేషన్ కార్డులను త్వరితగతిన అందజేయాలన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయనకు సముచిత గౌరవం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎదురుగా ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం ఓ అనాద విగ్రహంగా ఉందని, ముఖ్యమైన ప్రదేశంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయనకు సమూచిత గౌరవం కల్పించాలని కోరారు. అదేవిధంగా కమ్యూనిస్టు దిగ్గజమైన మాజీఎంపి ధర్మ బిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టాలని మరోసారి సిఎంకు విజ్ఞప్తి చేస్తున్నట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

# అక్రమంగా రవాణా చేస్తున్న ఎండుగంజాయి పట్టివేత

### ఐదుగురు నిందితులకు రిమాండ్

### 59 కిలోల సరకుతోపాటు కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

**ఘట్‌కేసర్ రూరల్, మే 20, ప్రభాతవార్త:** కారులో అక్రమంగా తరలిస్తున్న 59 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భారీ ఎత్తున పట్టుబడిన ఎండు గంజాయి విషయమై రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. దశరథ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. సంఘటన వివరాలు ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు సీఐ జూపల్లి రవి తన సిబ్బందితో కలిసి ఈనెల 19 వ తేది రాత్రి ఏడు గంటల సమయంలో ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా రెడ్ కలర్ బ్రిజా మారుతి కారును ఆపి తనిఖీ చేయగా అందులో 29 బ్యాగులు బ్యాగుకు రెండు కిలోల చొప్పున మొత్తం 59 కిలోల 88 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులను విచారించగా వారంతా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ వాసులుగా తెలిపారు. పట్టుబడిన కారు కర్ణాటక రాష్ట్రానికి చెందినదిగా నెంబరు కెఎ 39 ఎం 2162గా తెలిపారు. అందులో ఎండు గంజాయి రవాణాచేస్తూ పట్టుబడిన వారిలో గోవింద్ తాప్‌సేల్ (36), గజానంద్ (21), పవన్ (25), ఆకాశ్ (32)లుగా తెలిపారు. వీరంతా కర్ణాటక లోని బీదర్ జిల్లా జైగావ్, శంశేర్‌పూర్ వాడీ వాసులుగా తెలిపారు. తోరత్ రాహుల్ (31) ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్ వాసిగా పోలీసులు తెలిపారు.



నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ

# వరి జన్యుమార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### కేంద్రానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ

**హైదరాబాద్, మే 20,ప్రభాతవార్త:** వరి జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, గతంలో మన్మోహన్ సింగ్ హయాంలో వంకాయ జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ రాశారు. వరి జన్య మార్పిడికి కేంద్రం అనుమతించడాన్ని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. వరి జన్యు మార్పిడి విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం అత్యంత తీవ్రమైన ప్రమాదకరమైన నిర్ణయంగా అభివర్ణించారు. ఈ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న ఫుడ్ సిస్టమ్ పై ప్రభావం చూపుతుందన్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా వున్నప్పుడు ఆహార పంట అయినా వంకాయ జన్య మార్పిడిని కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అప్పటి దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ రాష్ట్ర రైతాంగం అభిప్రాయాన్ని మన్నించి ఆ ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రం లో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు.

వరి ధాన్యాన్ని ఎక్కువ ఉత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణ అని ఇక్కడి రాష్ట్ర రైతాంగం తరుపున రైతు కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల బియ్యం ఆహారంగా తినే వినియోగదారుడిపై కూడా తీవ్రమైన ప్రభావం పడ్తుందని, ఎక్కువ శాతం వరి పండించే తెలంగాణపై ఈ నిర్ణయంతో తీవ్రమైన ఆర్థిక ప్రభావం పడుతుందని చైర్మన్ కోదండరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. అంతేకాదు విత్తన హక్కుకు కూడా భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కీలకమైన ఈ నిర్ణయం తీసుకోకముందు రాష్ట్ర అభిప్రాయం తీసుకోకపోవడం బాధాకరమని ఆవేదన లేఖలో వ్యక్తం చేశారు.

అంతేకాదు వినియోగదారులను పరిగణలోకి తీసుకోకపోవడం తీవ్రమైన విషయంగా కమిషన్ పరిగణిస్తుందన్నారు. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భారతదేశ వ్యవసాయము రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.



కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

## కొత్త నాలుగు కార్మిక కోడ్‌లను రద్దుచేసి 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

### కేంద్ర కార్మిక సంఘాల భారీ ధర్నా

**హైదరాబాద్, మే 20, ప్రభాతవార్త:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్మార్గపు కొత్త నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఎస్. బాలరాజ్ (ఏఐటీయూసీ) పాలడుగు భాస్కర్ (సిఐటియు), కె. సూర్యం (టియుసిఐ), ఎం. శ్రీనివాస్ (ఐ.ఎఫ్.టి.యు), ఆర్.డి. చంద్ర శేఖర్ (ఐ.ఎన్.టి.యు.సి), పశ్య పద్మ (తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం), టి. సాగర్ (తెలంగాణ రైతు సంఘం) లు డిమాండ్ చేసారు. నాలుగు కార్మిక కోడ్‌లు మరియు స్థిరకాలిక ఉపాధి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, పని ప్రదేశంలో సమానత్వం, భద్రతను కల్పించాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేసి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యానగర్, కేంద్ర రీజినల్ లేబర్ కమీషనర్ కార్యాలయం వద్ద వేలాదిమంది కార్మికులు, రైతులతో భారీ ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, జండాలు చేతబూని నాలుగు కార్మిక కోడ్‌లు, రైతువ్యతేరేక చట్టాలను రద్దు చేయాలనీ, పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని పెద్దఎత్తున వారు పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కేంద్ర రీజినల్ లేబర్ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ పాత 29 కార్మిక చట్టాలలో ట్రేడ్ యూనియన్ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, వృత్తి భద్రత మరియు ఆరోగ్యంపై చట్టం, కాంట్రాక్ట్ కార్మిక చట్టం, అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం, సమాన వేతన చట్టం, ప్రసూతి ప్రయోజన చట్టం మొదలైనవి ఉన్నాయని, వీటిని నియంతృత్వ మోదీ ప్రభుత్వం రద్దు చేసి, బదులుగా కొత్తగా 4 కోడ్లను తీసుకొచ్చిందని, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమైన ఈ 4 కోడ్లను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ వ్యవస్థీకృత కార్మికులకు నెలవారీ కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలనీ కోరారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నేతలు పి. ప్రేమపావని, ఏం. నరసింహ, బి. వెంకటేశం, కమతం యాదగిరి, బొడ్డుపల్లి కిషన్, ఏం. ప్రవీణ్ కుమార్, సిఐటియు నేతలు జె. వెంకటేష్, కుమారస్వామి, ఈశ్వర్ రావు, టియుసిఐ నేతలు ఎస్ఎల్. పద్మ, లింగం గౌడ్, శ్రీనివాస్, ఐ.ఎఫ్.టి.యు నేతలు జి. అను రాధ, ఐ.ఎన్.టి.యు.సి నేతలు విజయ్‌కుమార్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల టి20 వరల్డ్ కప్..
# క్వాలిఫయర్స్‌కు నేపాల్, థాయ్ అర్హత
### చివరి లీగ్ మ్యాచ్‌ల్లో ఎమిరేట్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 వరల్డ్ కప్-2026 గ్లోబల్ క్వాలిఫయర్స్‌కు నేపాల్, థాయ్‌లాండ్ జట్లు ఆఖరి నిముషంలో అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శన కనపర్చిన ఈ రెండు జట్లు వరల్డ్ కప్ బెర్త్ కోసం పోటీ పడేందుకు అర్హత సాధించాయి. తమ చివరి లీల్ మ్యాచ్‌ల్లో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌పై విజయాలు సాధించిన నేపాల్, థాయ్‌లాండ్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించాయి. గ్లోబల్ క్వాలిఫయర్స్‌కు ఇప్పటికే స్కాంట్లాండ్, బంగ్లాదేశ్ జట్లు అర్హత సాధించాయి. ఇక యూరప్, ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుండి అర్హత సాధించే జట్లేవో తెలియాల్సి ఉంది. ఈరెండు టోర్నీల నుండి రెండు జట్లు వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం గ్లోబల్‌క్వాలిఫయర్స్‌లో ఆరు జట్లు పోటీ పడగా, అందులో నాలుగు జట్లు వరల్డ్ కప్‌కు అర్హత సాధిస్తాయి. కాగా2026 మహిళల టీ20 వరల్డ్ కప్ ఇంగ్లండ్ వేదికగా జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 12జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి పోటీ పడతాయి. ఆతిధ్య దేశ హోదాలో ఇంగ్లండ్‌తొలుత ఈ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించగా, ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక దేశాల జట్లు ఈ మెగా టోర్నీకి నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు బెర్త్‌లు గ్లోబల్ క్వాలిఫయర్స్ ద్వారా నిర్ణయం అవుతాయి. ఈ టోర్నీలో న్యూజిలాండ్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది.

# లాటిన్ అమెరికాతో ఛెత్రి శాశ్వత అగ్రిమెంట్
### తొలి భారత్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రికార్డు



**న్యూఢిల్లీ:** లాటిన్ అమెరికన్ జట్టుతో భారత్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు బిజయ్ ఛెత్రి శాశ్వత ఒప్పందం చేసుకున్నాడు. ఉరుగ్వే క్లబ్ కోలన్ ఎఫ్‌సితో పూర్తి సమయం ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా బిజయ్ ఛెత్రి దకిణ అమెరికా జట్టులో శాశ్వతంగా చేరిన మొదటి భారతీయ ఆటగాడిగా నిలిచాడు. మణిపూర్‌కు చెందిన ఛెత్రి, 2016లో షిల్లాంగ్ లాజోంగ్‌తో తన ఫుట్‌బాల్ కెరీర్‌ను ప్రారంభించాడు. 2018లో ఇండియన్ ఆరోస్‌తో సీనియర్‌గా అరంగేట్రం చేశాడు. అప్పటి నుండి అతను తనతొలి ఐఎస్‌ఎల్‌క్లబ్ అయిన చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో చేరడానికి ముందు చెన్నై సిటీ, రియల్ కాశ్మీర్ మరియు శ్రీనిధి డెక్కన్ వంటి క్లబ్‌లకు ఆడాడు. అయితే, కోలన్‌లో ఛెత్రి గత సీజన్‌లో కేవలం 25 నిమిషాలు మాత్రమే ఆడాడు. ఉరుగ్వేలోని సెగుండా డివిజన్ ప్రొఫెషనల్ (రెండవ డివిజన్)లో పోటీ పడుతున్నాడు. 23 ఏళ్ల సెంటర్‌బ్యాక్ గతసీజన్‌లో చెన్నైయిన్ ఫుట్‌బాల్‌క్లబ్ తరపున పాల్గొంటున్నాడు. ఈసారి దాన్ని మరింతగా మెరుగుపరచుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు.




### ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ ర్యాంకింగ్స్‌లో..
# అగ్రస్థానంలో సబలెంకా
### 2 నుండి 5వ ర్యాంక్‌కు పడిపోయిన స్వియాటెక్
### శ్రీవల్లికి 287, సహజకు 316 ర్యాంక్

**న్యూఢిల్లీ:** ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటిఎ) ర్యాంకింగ్స్‌లో అరినా సబలెంకా అగ్రస్థానాన్ని ఆక్రమించింది. రోమ్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత అమెరికాకు చెందిన కోకో గౌఫ్ తన కెరీర్‌లో 2వ ర్యాంకుకు తిరిగి చేరుకుంది. డబ్ల్యూటిఎ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకునే ముందు ఇగా స్వియాటెక్ 5వ స్థానానికి పడిపోయింది. 23 ఏళ్ల స్వియాటెక్ ఈ నెల 25 నుండి జూన్ 8 వరకూ పారిస్‌లో జరగనునన రోలాండ్ గారోస్‌లో వరుసగా ఐదవ టైటిల్‌ను గెలుచుకోవాలని పట్టుదలతో ఉంది. అయితే మాజీ ప్రపంచ నంబర్ వన్ అయిన పోలిష్ క్రీడాకారిణి, 2024 ఎడిషన్ క్లే మేజర్‌లో విజయం సాధించినప్పటి నుండి స్వియాటెక్ ఇబ్బంది పడుతోంది. ఇటీవల ఆమె ఇటాలియన్ ఓపెన్‌లో 32వ రౌండ్‌లో అమెరికన్ డేనియల్ కాలిన్స్ చేతిలో ఓడిపోయింది. దీని ఫలితంగానే స్వియాటెక్ ర్యాంకింగ్స్‌లో 2 నుండి 5వ స్థానానికి పడిపోయింది. ఇక ఇటాలియన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న జాస్మిన్ పావోలిని 5వ స్థానం నుండి నాల్గవ స్థానానికి చేరుకోగా, గౌఫ్ స్వదేశీయురాలుజెస్సికా పెగులా 4వ స్థానం నుండి 3వ స్థానానికి చేరుకుంది. అలాగే రోమ్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో గౌఫ్ చేతిలో ఓడిపోయిన రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా, ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ మాడిసన్ కీస్‌ను అధిగమించి ఆరో స్థానంలో నిలిచింది. ఇక భారత్ ప్లేయర్లకు సంబంధించి టాప్ 100లో ఎవరికీ స్థానం దొరకలేదు. ప్రార్థన తోంబరే నాలుగు స్థానాలు ఎగబాకి 148వ ర్యాంక్‌కు, అంకితా రైనా ఒక స్థానం ఎగబాకి 208వ ర్యాంక్, రుతుజా భోసలే 20 పాయింట్లు పడిపోయి 242వ స్థానానికి, ఆరు స్థానాలు పైకి ఎగబాకిన రియా భాటియా 258వ ర్యాంక్, భమిడిపాటి శ్రీవల్లి 282వ ర్యాంకుకు, ఏడు స్థానాలు ఎగబాకి 316వ ర్యాంక్‌తో యమలపల్లి సహజ, ఆరు స్థానాలు ఎగబాకిన వైదేహి 355వ ర్యాంక్ లభించింది.

# హైదరాబాద్ విక్టరీతో ప్లే ఆఫ్స్ నుండి లక్నో ఔట్
### గుజరాత్,బెంగళూరు, పంజాబ్ కన్ఫర్మ్.. నాలుగో ప్లేస్‌కు ముంబయి, ఢిల్లీ మధ్య నేడు కీలక పోరు







**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025, సీజన్ 18 ప్లేఆఫ్‌లకు సంబంధించిన లెక్కలు ముగింపు దశకు వస్తున్నాయి. ప్రస్తుతానికి గుజరాత్, బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు మాత్రమే ప్లే ఆఫ్స్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇక నాలుగో జట్టు గురించి మాత్రం మరో రోజు ఆగాల్సిందే. ఇందు కోసం రెండు జట్లు పోటీపడనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిపోవడం ద్వారా, లక్నో సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ రేస్‌కు చేరుకునే ఆశలకు కూడా తెరపడింది. ఇక ఇప్పుడు ప్లేఆఫ్స్‌లో మిగిలిన స్థానం కోసం రెండు జట్లు ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ రేసులో మిగిలి ఉన్నాయి. ముంబై, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ సమీకరణాన్ని చూస్తే పాయింట్ల పట్టికలో రెండు జట్ల స్థానాలు కీలకం కానున్నాయి. ముంబై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాల్గవ స్థానంలో ఉంది. 12 మ్యాచ్‌ల తర్వాత ముంబై ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. ఢిల్లీ 12 మ్యాచ్‌లలో 13 పాయింట్లు సాధించి పట్టికలో 5వ స్థానంలో ఉంది. అంటే, గ్రూప్ దశలో రెండు జట్లకు చెరొక మ్యాచ్ మిగిలి ఉంది. దీంతో ఈ ఇరుజట్లలో ఒకరు ప్లేఆఫ్స్‌కు చేరుకోనున్నారు. ఇందుకు ఈ నెల 21 కీలకమైంది. ఈ రోజున ముంబై వర్సెస్ ఢిల్లీ ముఖాముఖిగా తలపడ్డాయి. అంటే, ఒకరి జట్టు గెలిస్తే, వారిలో ఒకరి ఓటమి ఖాయం. రెండు జట్లకు ఓడిపోవడం అంటే, ప్లే ఆఫ్స్ నుంచి బయటపడడమే అని తెలుసు. ఈసారి రెండు జట్లు వాంఖడేలో ఒకదానికొకటి తలపడుతున్నాయి. కాబట్టి, ఇది ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రతీకార మ్యాచ్ అవుతుంది. ఎందుకంటే గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తమ సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. ఢిల్లీ ప్రతీకారం తీర్చుకుంటే, ముంబై ఇండియన్స్ పురోగతి కథ ఇక్కడ ఆగిపోతుంది. ప్లేఆఫ్ సమీకరణం ప్రకారం ఢిల్లీ అయినా ముంబై అయినా, రెండూ తమ మిగిలిన రెండు మ్యాచ్‌లను గెలవాలి. ఇటువంటి పరిస్థితిలో, ఈ నె 21న ఈ ఇద్దరి మధ్య ఘర్షణ మరింత ముఖ్యమైనది అవుతుంది. ఒకరితో ఒకరు తలపడిన తర్వాత, రెండు జట్లు చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడవలసి ఉంటుంది. ఈ సీజన్‌లో ముంబై, ఢిల్లీ జట్లు తొలిసారి పంజాబ్ కింగ్స్ సవాలును ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ముంబై, ఢిల్లీ రెండూ జైపూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడవలసి ఉంది. జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియం రికార్డు ఢిల్లీకి అనుకూలంగా ఉంది. ముంబై కంటే ఇక్కడ ఎక్కువ మ్యాచ్‌లు ఆడడమే కాకుండా, ఎక్కువ విజయాలు కూడా సాధించింది. మునుపటి గణాంకాల ప్రకారం ప్రతిదీ అలాగే ఉంటే, ప్లేఆఫ్ రేసులో ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్ కంటే ముందుండటం కష్టమే అనిపిస్తుంది.

# టి 20లో యుఎఇ రికార్డు విజయం
### 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి



**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో పసికూన అయిన యూఏఈ రికార్డు విజయం సాధించింది. తమ చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్‌పై విజయం నమోదు చేసింది. టీ20 మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో 2 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టనికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం బరిలోకి దిగిన యూఏఈ మరో బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లు తంజిద్ హసన్ (59), లిటన్ దాస్ (40), నజ్ముల్ హసన్ షాంటో (27), తౌహిద్ హృదోయ్ (45), జాకిర్ అలీ (6 బంతుల్లో 18) రాణించడంతో భారీ స్కోర్ చేసింది. యూఏఈ బౌలర్లలో జవాదుల్లా 3 వికెట్లు, సాఘిర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. తదుపరి భారీ లక్ష్య ఛేదనకు దిగిన యూఏఈని కెప్టెన్ మహమ్మద్ వసీం (42 బంతుల్లో 82) అద్భుత ఇన్నింగ్స్ ఆడి గెలిపించాడు. వసీం ఔటయ్యే సరికి యూఏఈ లక్ష్యానికి ఇంకా దూరంలో ఉన్నా, వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లు తలో సిక్సరో, బౌండరీనో బాది జట్టు గెలుపునకు దోహదపడ్డారు. చివర్లో ధృవ్ పరాషార్ (11), హైదర్ అలీ (15 నాటౌట్) జాగ్రత్తగా ఆడి యూఏఈకి రికార్డు విజయాన్ని అందించారు. యూఏఈ 18.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. బంగ్లా బౌలర్లలో షోరీఫుల్, నహీద్ రాణా, రిషద్ హొసేన్ తలో రెండు వికెట్లు తీయగా, తన్వీన్ ఇస్లాం, తంజిమ్ హసన్ చెరో వికెట్ పడగొట్టారు. కాగా ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో యూఏఈ 1-1తో సమంగా నిలిచింది. ఈ సిరీస్ కోసం యూఏఈలో (షార్జా) పర్యటిస్తున్న బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నిర్ణయాత్మక మైన మూడో టీ20 ఈ నెల 21న షార్జాలో జరుగనుంది.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 20:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు.. తర్వాత భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 800పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 24,700 దిగువకు చేరింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా నష్టపోగా, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ షేర్లు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచి 0.94 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.50 లక్షలు కీణించి రూ.440.23 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,116.17 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 81,153.70 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 872.98 పాయింట్ల నష్టంతో 81,186.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.55 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అమెరికా ప్రభుత్వ అప్పులపై ఆందోళన నేపథ్యంలో యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో అక్కడి 30 ఏళ్ల బాండ్ రాబడులు 2023 నవంబర్ తర్వాత గరిష్ఠ స్థాయి అయిన 5.03 శాతానికి చేరాయి. బాండ్ రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు లిక్విడిటీ తగ్గొచ్చన్న భయాలతో మన మార్కెట్లు పడ్డాయి. గత కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థా గత ఇన్వెస్టర్లు మే 19న అమ్మకాలకు దిగారు. రూ.526 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత సైతం రూ.238 కోట్లు విలువైన షేర్లను విక్రయించారు. భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో 4 శాతం మేర లాభపడ్డాయి. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ వంటి లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది.



# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముమ్మరం



**న్యూఢిల్లీ, మే 20:** భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఏ) మొదటి దశను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇరు దేశాలు చర్చలను ముమ్మరంచేశాయి. ఈ మేరకు కేంద్ర వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. మొదటి దశ ఒప్పందాన్ని త్వరగా పూర్తి చేసే దిశగా తమ మధ్య ఫలప్రదమైన చర్చలు జరిగాయని ఎక్స్ వేదికగా తెలిపారు. మంత్రుల స్థాయి సమావేశాల అనంతరం రెండు దేశాల ప్రధాన సంధానకర్తల మధ్య చర్చలు ఈనెల 22 వరకు నిర్వహించను న్నారు. ఈ ఏడాది సెప్టెంబరు అక్టోబరు నాటికి తొలిదశ ఒప్పందాన్ని ఖరారు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈచర్చల్లో ప్రధానంగా పరస్పర మార్కెట్ల వినియోగం.. స్థానికనిబంధనల అమలు, టారిఫ్ మినహాయింపులకు పరిమితులపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ ఒప్పందంలో భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు,రొయ్యలు, నూనె గింజలు, రసాయనాలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. ఈఒప్పందం కోసం రెండు దేశాలు నిబంధనల్ని ఖరారుచేశాయి. ఇందులో సుంకాలు, వస్తువులు, సేవలు, సుంకేతర అడ్డంకులు,కస్టమ్స్ వంటి అంశాలు ఉన్నాయి. అమెరికా, భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో ఈ 90 రోజుల వ్యవధిని ఉపయోగించుకొని చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఇక 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథంగా కొనసాగుతుంది. విస్తృతమైన వాణిజ్య లోటును తగ్గించేందుకు టారిఫ్ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఏప్రిల్ 2న ప్రకటించిన విషయం తెలిసిందే.

# బంగ్లాదేశ్‌లో స్టార్‌లింక్ పాగా



**వాషింగ్టన్, మే 20:** ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ యాజమాన్యంలోని శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ స్టార్ లింక్ బంగ్లాదేశ్‌లో అధికారికంగా సేవలు ప్రారంభించిట్లు ప్రకటించింది. ఇది దేశ డిజిటల్ కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో గణనీయమైన పురోగతిని సూచిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్, నెట్‌వర్క్ సమస్యలతో పోరాడుతున్న మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్టార్ లింక్ విభిన్న యూజర్ అవసరాలను తీర్చడానికి బంగ్లాదేశ్‌లో వివిధ సబ్‌స్క్రిప్షన్ ప్యాకేజీలను ప్రవేశ పెట్టింది. స్టార్ లింక్ రెసిడెన్స్ ప్లాన్‌లో భాగంగా నెలకు 6వేల టాకా ధర రూ.4,200తో ప్రామానిక గృహ వినియోగానికి ఇంటర్నెట్ అందిస్తున్నారు. రెసిడెన్సీ లైట్ ప్లాన్‌లో భాగం గా నెలకు 4,200 టాకా రూ.2,900 ధరతో నెట్ సేవలు అందిస్తున్నారు. వన్ టైమ్ సెటప్ ఫీజు కింద 47వేల టాకాలు రూ.32వేలు చెల్లించాల్సి ఉంటుంది. స్టార్ లింక్ డిష్, రౌటర్‌తో సహా పరికరాల ఖర్చులు ఇందులో కవర్ అవుతాయి.

# నిస్సాన్ ప్లాంట్ల మూసివేత వార్తలపై కంపెనీ క్లారిటీ!

**న్యూఢిల్లీ, మే 20:** దేశంలోని కొన్ని తయారీ ప్లాంట్లను మూసివేస్తారని వస్తున్న వార్తలను నిస్సాన్ మోటార్ ఇండియా అధికారికంగా తోసిపుచ్చింది. తమ కార్యకలాపాలు, డీలర్లు, భాగస్వాములు, వినియోగదారులకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ఇండియాలో తమ సర్వీసులపట్ల ఉన్నట్లు కంపెనీ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపింది. నిస్సాన్ కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా మెక్సికోలో ఫ్రాంటియర్, నవరా పికప్స్ ఉత్పత్తి ఏకీకృతం చేస్తున్నట్లు ప్రకటించడంతో ఈ పుకార్లు వెలువడ్డాయి. అయితే ఈ మార్పుల వల్ల భారత తయారీ ప్లాంట్లు ప్రభావితం కావని నిస్సాన్ స్పష్టం చేసింది. భారత దేశంలో తమ వ్యాపార వ్యూహం బలంగాఉందని, ఏ కర్మాగారంలో కార్యకలాపాలను నిలిపి వేసే అధికారిక ప్రణాళికలు లేవని వాటాదారులకు హామీ ఇచ్చింది. మార్చి 2025లో రెనాల్ట్ గ్రూప్ రెనాల్ట్ నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 51శాతం వాటాను కొనుగోలు చేస్తుందని నిస్సాన్ ప్రకటించింది. ఈ చర్య రెనాల్ట్-నిస్సాన్ ప్రపంచ భాగస్వామ్యాన్ని కీలకం కానుందని కంపెనీ తెలిపింది. ఇది చెన్నై ఆధారిత ఉత్పత్తి రెనాల్ట్ పూర్తి నియంత్రణను తీసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇదిలా ఉండగా, నిస్సాన్ భారతదేశ వ్యాపారం పూర్తిగా పనిచేస్తుందని, కస్టమర్ నిమగ్నత, డీలర్‌షిప్ విస్తరణపై నిరంతరం దృష్టిపెడతామని కంపెనీ స్పష్టం చేసింది.




# వాణిజ్యం

# మహదేవ్ బెట్టింగ్‌యాప్ కుంభకోణంపై 'ఇడి' దర్యాప్తు

**ముంబై, మే 20:** మహదేశ్ బెట్టింగ్‌యాప్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సిఇఒ నిశాంత్ పిట్టిని విచారిస్తున్నట్లు తెలిపింది. అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో పిట్టి ప్రమేయం ఉందని ఇడి అనుమానిస్తోంది. ఈ వ్యవహారంతో స్టాక్ మానిప్యులేషన్, మనీలాండరింగ్‌పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అసోసియేట్ ల్యాప్‌టాప్ నుంచి స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలు ద్వారా పిట్టిని అక్రమ బెట్టింగ్ ప్లాట్ ఫామ్ అయిన స్కై ఎక్ఛేంజ్‌కు ఏజెంట్‌గా గుర్తించినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా మహదేవ్ బెట్టింగ్‌యాప్ ఆపరేటర్లతో సంబంధం ఉన్న డొల్ల కంపెనీలకు ఈజ్ మై ట్రిప్ చెల్లింపులు చేసిందని దర్యాప్తు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది ఏప్రిల్‌లో ఇడి పిట్టి నివాసంలో సోదాలు నిర్వహించి రూ.7 లక్షలు స్వాధీనం చేసుకుంది. స్టాక్ ధరలను తారు మారు చేయడం, చట్టవిరుద్ధమైన ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడం లక్ష్యంగా ఉన్న బిగ్ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ లావాదేవీలు జరిగాయని అధికారులు భావిస్తున్నారు. నిషాంత్ పిట్టి ఈ ఆరోపణలను ఖండిస్తూ ఇడి సూచించిన వ్యక్తులు, కంపెనీల గురించి తనకు తెలియదని స్పష్టం చేశారు. 2017 నుంచి ఈజ్ మై ట్రిప్ ఏ సంస్థలకు చెల్లింపులు చేయలేదని, పారదర్శకత, చట్టబద్ధమైన కార్యకలాపాలకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నానని, అన్ని ఆర్థిక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు.




# ప్రొటీన్ ఈగవ్ షేర్లు భారీ పతనం

**ముంబై, మే 20:** ఇ-గవర్నెన్స్ సేవలు అందించే ప్రొటీన్ ఈగవ్ టెక్నాలజీ షేర్లు భారీగా పతనం అయ్యాయి. రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ స్టాక్ విలువ దాదాపు 30 శాతం మేర క్షీణించింది. సోమవారం ట్రేడింగ్ 20 శాతం మేర పతనం కాగా, మంగళవారంట్రేడింగ్ ఆరంభంలో 13 శాతం మేర నష్టాన్ని చవిచూసి తర్వాత కోలుకుంది. మధ్యాహ్నం 1.15 గంటల సమయానికి 8.76 శాతం నష్టంతో 1,043.00 వద్ద కొనసాగింది. కీలకమైన పాన్ 2.0 ప్రాజెక్టుకు ప్రొటీన్‌ఈగవ్ అర్హత సాధించకపోవడమే షేర్లు పతనానికి కారణం. పాన్‌కు కొనసాగింపుగా కేంద్ర ప్రభుత్వం పాన్ 2.0 ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్, డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, మెయింటెయినెన్స్ కోసం ఆదాయపు పన్ను శాఖ బిడ్డింగ్‌లు ఆహ్వానించగా, ప్రాజెక్టును చేజిక్కించుకోవడంలో ప్రొటీన్ ఈగవ్ విఫలమైంది. మేనేజ్డ్ సర్వీస్ ప్రొవైడర్‌గా వ్యవహరించేందుకు బిడ్డింగ్‌లో పాల్గొనగా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేదంటూ ఐటీవిభాగం నుంచి తమకు కమ్యూనికేషన్ అందినట్లు ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో ప్రొటీన్‌ఈగవ్ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న పాన్ ప్రక్రియపై పెద్దగా ప్రభావం ఉండబోదంటూ ఇన్వెస్టర్లకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేసింది. ఈ వ్యాఖ్యలేవీ మార్కెట్‌ను మెప్పించకపోవడంతో షేర్లు పతనం అవుతున్నాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.